


ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...


ప్రభాత
వెలుగు
11.01.2019
www.v6velugu.com
శుక్రవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 326 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL




జనరల్
నేటి నుంచి సంక్రాంతి సెలవులు
రాష్ట్రంలోని స్కూళ్లకు 11 నుంచి 17 వరకు.. జూనియర్ కాలేజీలకు 12 నుంచి 15 వరకు.
02




దేశం - విదేశం
అయోధ్య కేసు విచారణలో ట్విస్ట్
సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నుంచి తప్పుకున్న జస్టిస్ లలిత్. విచారణ 29కి వాయిదా.
05



ప్లే
హైదరాబాద్‌లో తొలి వన్డే
ఆసీస్ టూర్ షెడ్యూల్ విడుదల.. ఫిబ్రవరి 27న విశాఖలో టీ20. మార్చి 2న హైదరాబాద్‌లో వన్డే.
11



బిజినెస్
పేరు కావాలంటే షేర్లివ్వండి
సెలబ్రిటీల నయా ట్రెండ్.. మోస్ట్ వాల్యుబుల్ సెలబ్రిటీ బ్రాండ్‌గా విరాట్ కోహ్లీ.
10



అలోక్ వర్మ మళ్లీ ఔట్

సీబీఐ చీఫ్ గా తప్పించిన ప్రధాని నేతృత్వంలోని కమిటీ
బాధ్యతలు స్వీకరించి 48 గంటలు గడవకముందే వేటు
అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే నిర్ణయం
సంస్థ చరిత్రలోనే మొదటిసారి
వ్యతిరేకించిన కమిటీ సభ్యుడు ఖర్గే
తాత్కాలిక డైరెక్టర్‌గా మళ్లీ బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వర్‌రావు
వారంలోగా కొత్త చీఫ్ నియామకం
తనను తప్పించే అధికారం ప్రభుత్వానికి లేదన్న వర్మ

చట్ట పరిధిలోనే నిర్ణయం తీసుకున్నాం: మోడీ

తనను తప్పించే అధికారం ప్రభుత్వానికి లేదన్న అలోక్ వర్మ విమర్శలను మోడీ కొట్టిపారేశారు. సుప్రీం పరిధికి లోబడే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

తన అబద్ధాల్లో తానే బందీ అయిన మోడీ

రాఫెల్ ఒప్పందం విషయమై ప్రధాని మోడీ మనసులో ఎంత భయం నెలకొందో చెప్పడానికి అలోక్ వర్మను మళ్లీ తప్పించడమే నిదర్శనం. మోడీ తన అబద్ధాల్లో తానే బందీగా మారిపోయారు. ఇప్పుడు ఆయన మనసును భయం పూర్తిగా ఆక్రమించుకుంది. నిద్ర కూడా పోలేకపోతున్నారు.

– ట్విటర్‌లో కాంగ్రెస్ చీఫ్ రాహుల్

02



ఆ సిక్సర్లు ఇవేనా?

నెలరోజుల్లోపే మరిన్ని కీలక నిర్ణయాలు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ వ్యూహం
పేదలు, మధ్య తరగతి వర్గాలే టార్గెట్
ఐటీ నుంచి జీఎస్టీ దాకా పలు మార్పులు
రైతులను ప్రసన్నం చేసుకునే యత్నాలు

మోడీ మదిలో ఉన్న ఆలోచనలు ఇవేనా?

1. ఇప్పుడున్న ఆదాయ పన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం. అలాగే 20%, 30% పన్ను కట్టాల్సిన ఆదాయ పరిమితిని భారీగా పెంచడం.
2. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు తరహా పథకం తేవడం. నేరుగా రైతుల అకౌంట్లలో డబ్బు వేయడంతో పాటు కౌలురైతులకు కూడా ఏదో ఒక ప్రయోజనం కల్పించడం.
3. 28 శాతం పన్ను కింద మూడు నాలుగు రకాల వస్తువులను మాత్రమే ఉంచి మిగతావన్నీ 18 శాతం స్లాబులోకి మార్చడం. 12, 18 శాతం స్లాబులను కలిపేసి ఒకే స్లాబుగా చేయడం.
4. కనీస ఆదాయం కంటే తక్కువ ఆదాయం ఉన్నవారికి ఆర్థికంగా ఎంతో కొంత సాయం అందించడం.
5. ఇప్పటికే లోక్ సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభలోనూ గట్టెక్కేలా చూడడం.
6. ఫసల్ బీమాలోనూ మార్పులు చేయొచ్చు. రైతులు కట్టే ప్రీమియంను వీలైనంత తగ్గించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే 90 శాతం కట్టే ప్రతిపాదన.

ఊహకందని నిర్ణయం, ఊహించని వేగంతో పెద్ద కులాల్లో పేదలకు 10 శాతం కోటా బిల్లును ఎదురు లేకుండా పాస్ చేయించడంలో సక్సెస్ అయ్యారు ప్రధాని నరేంద్ర మోడీ. ఇదొక్కటే కాదు.. వేర్వేరు వర్గాలను ఆకర్షించేలా కొత్త వరాలపై ఆయన కసరత్తు చేస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఎన్నికల ముందు ఇలాంటి నిర్ణయాలు పార్టీని మళ్లీ గెలిపిస్తాయన్న ధీమా బీజేపీ నేతల్లో కనిపిస్తోంది. కోటా నిర్ణయంతో మోడీ సిక్సర్ కొట్టారన్న బీజేపీ నేతలు మరిన్ని సిక్సర్లు ఉంటాయని సంకేతాలిస్తున్నారు. ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో కొత్త నిర్ణయాలు కూడా నెలరోజుల్లోపే ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. రైతుల కోసం సరికొత్త పథకం రూపొందిస్తున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి.

03

చిన్న వ్యాపారులకు రిలీఫ్



- ఎంఎస్‌ఎంఈలకు జీఎస్టీ పరిమితి రూ.40 లక్షలకు పెంపు
- కాంపోజిషన్ స్కీములోనూ మార్పులు
- రూ.1.5 కోట్ల పరిమితి వరకూ చేరేందుకు చాన్స్
- 1 శాతం కెలామిటీ సెస్ విధించడానికి కేరళకు అనుమతి
- జీఎస్టీ కౌన్సిల్ 32వ సమావేశంలో కీలక నిర్ణయాలు

04

నాకు నచ్చినట్టు నేనుంటా
ఇట్స్ మై లైఫ్



మారుతున్న మన యూత్ ప్రాధాన్యాలు
బీయింగ్ మై సెల్ఫ్ అంటున్న నవతరం
స్వేచ్ఛగా ఉండేందుకే తొలి ఓటు
పెండ్లి గురించి అసలు ఆలోచనే లేదు
18 నుంచి 25 ఏళ్ల వారిపై టిండర్ యాప్ సర్వే

తరుణ్. వయసు 20 ఏళ్లు. సిటీలోని ఒక ప్రముఖ కాలేజీలో డిగ్రీ చేస్తున్నాడు. గేమ్స్, స్టడీలో ఎప్పుడూ ఫస్టే. 'లైఫ్‌లో నీ ఫస్ట్ ప్రయారిటీ దేనికి?' అని అడిగితే అతడు చెప్పిన సమాధానం 'బీయింగ్ మైసెల్ఫ్'అని. తరుణ్ ఒక్కడే కాదు.. ఈ ఏజ్ గ్రూప్‌లో ఉన్న చాలా మంది నుంచి ప్రస్తుతం వినిపిస్తున్న మాట ఇదే. పెండ్లి, ఆర్థికంగా స్థిరపడటం ఇవేవీ వీరి టాప్ 5 ప్రయారిటీ లిస్ట్‌లో లేనేలేవు.

04



'ఎస్సారెస్పీ' పనులు
యమా స్పీడు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) పునరుజ్జీవ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్ణీత లక్ష్యానికన్నా ముందే పనులు పూర్తి చేసి వచ్చే వానాకాలానికే కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి నీటిని ఎత్తిపోసేలా ఇరిగేషన్ శాఖ కృషి చేస్తోంది. ఇటీవల పునరుజ్జీవ పనులను సీఎం కేసీఆర్ పరిశీలించి ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. దీంతో పనుల్లో వేగం మరింత పెరిగింది. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు, అక్కడి నుంచి మిడ్ మానేరుకు అక్కడి నుంచి వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం.

02



వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
79.00	79.00	79.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
79.00	79.00	79.00



పైసలియ్యర్రి సారూ!

రబీలో రైతులకు అప్పులివ్వని బ్యాంకులు
22 శాతమే అందజేత.. నాట్ల దశ దాటిపోతున్న పరిస్థితి
దారిలేక ప్రైవేటును ఆశ్రయిస్తున్న రైతన్నలు

02



గురువారం చెన్నై కోయంబేడులోని థియేటర్‌లో రజనీకాంత్, అజిత్ ఫ్యాన్స్ గొడవతో చినిగిన ఫ్లెక్సీలు

రోడ్డెక్కిన అభిమానం

- రజనీ, అజిత్ అభిమానుల మధ్య కత్తుల దాడి
- సినిమాకు పైసలివ్వలేదని తండ్రికి నిప్పపెట్టిన కొడుకు

చెన్నై: సినిమా అభిమానం వెర్రితలలు వేస్తోంది. మా హీరో గ్రేట్ అంటే.. మా హీరో గ్రేట్ అంటూ ఇద్దరు అగ్ర హీరోల అభిమానులు రోడ్డెక్కారు. కత్తులతో ఒకరినొకరు పొడుచుకున్నారు. తమిళనాడులోని వేలూరులో ఈ ఘటన జరిగింది. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ కావటంతో స్టార్ హీరోల సినిమాలు క్యూ కట్టాయి. ఈ వరుసలో రజనీకాంత్ 'పేట', అజిత్ 'విశ్వాసం' రెండూ గురువారమే విడుదలయ్యాయి. ఇద్దరి సినిమాలు ఒకే రోజు విడుదల కావడం, పక్క పక్క థియేటర్లలోనే రావడంతో వేలూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓ థియేటర్ ముందు ఇరువర్గాల అభిమానులు కత్తులతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

సినిమాకు పైసలివ్వలేదని..

సినిమా చూసేందుకు పైసలివ్వలేదన్న కోపంతో ఓ ప్రబుద్ధుడు తన తండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వేలూరుకు సమీపంలోని దరపడవేడు ప్రాంతానికి చెందిన అజిత్ కుమార్ (20).. అజిత్‌కు వీరాభిమాని. అజిత్ 'విశ్వాసం' సినిమాను అందరికన్నా ముందు స్పెషల్ షోలో చూడాలని, ఇందుకు డబ్బులు కావాలని తండ్రి పాండ్యన్‌తో బుధవారం రాత్రి కొట్లాటకు దిగాడు. బీడీ కార్మికుడైన పాండ్యన్.. తన దగ్గర డబ్బు లేదని చెప్పాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన అజిత్‌కుమార్.. తండ్రి ముఖంపై పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ పాండ్యన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

థియేటర్‌లో 'పేట'.. బయట పెళ్లి బాజా



చెన్నై: ఆ ఇద్దరు ప్రేమికులు రజనీకాంత్‌కు వీరాభిమానులు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు తమ అభిమాన హీరో సినిమా విడుదల సమయాన్నే ముహూర్తంగా ఎంచుకున్నారు. చెన్నైకి చెందిన జంట అంబసు, కమాచి గురువారం 'పేట' సినిమా విడుదల సమయానికి పెళ్లి చేసుకున్నారు. 'పేట' ఆడుతున్న వుడ్‌ల్యాండ్ సినిమా హాల్‌ను వేదికగా చేసుకున్నారు. రజనీకాంత్ నటించిన సినిమాల పోస్టర్లతో పెళ్లి మండపాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుకున్నారు. అటు థియేటర్‌లో సినిమా పేర్లు పడుతుండగా.. బయట పెళ్లి బాజా మోగడం ప్రారంభమైంది. 'పేట'లో రజనీకాంత్ ఎంట్రీ సమయానికి అంబసు మెడలో కమాచి తాళి కట్టాడు. ఇంటర్‌వెల్‌కు బయటకొచ్చిన ప్రేక్షకులు.. ఆ నూతన దంపతులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

నేటి నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

రేపటి నుంచి జూనియర్ కాలేజీలకూ


హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని అన్ని స్కూళ్లకు శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెలవులు అమలు చేయాలని యాజమాన్యాలకు సూచించింది. కాగా, ఈ నెల 12 నుంచి 15 వరకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు ఉంటాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్‌కుమార్ వెల్లడించారు. 16వ తేదీన కాలేజీలు తిరిగి ప్రారంభించాలని మేనేజ్‌మెంట్లను ఆయన ఆదేశించారు.



ట్రిపుల్ తలాక్‌పై మళ్లీ ఆర్డినెన్స్

ఆమోదించిన కేబినెట్

న్యూఢిల్లీ: మరోసారి ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్సును తెచ్చేందుకు కేంద్రం నిర్ణయించింది. గురువారం కేబినెట్ దానికి ఆమోద ముద్ర వేసింది. గత ఏడాది సెప్టెంబర్‌లో తెచ్చిన ఆర్డినెన్స్ గడువు జనవరి 22తో ముగుస్తున్నందున కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 17న కేంద్రం ప్రవేశపెట్టిన ట్రిపుల్ తలాక్ బిల్లును కొద్ది రోజుల క్రితమే లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభలో అది పెండింగ్‌లో పడింది. ప్రతిపక్షాలు ససేమిరా అంటుండడంతో అది అక్కడే ఆగింది. రాజ్యసభ నిరవధిక వాయిదా పడడంతో మరికొన్నాళ్లు కేంద్రానికి ఎదురుచూపులు తప్పేలా లేవు.



ఇటీవల జగిత్యాల జిల్లా రాజేశ్వరరావుపేట వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

'ఎస్సారెస్పీ' పనులు యమా స్పీడ్

- లక్ష్యానికన్నా ముందే పూర్తి చేసేందుకు సన్నాహాలు
- సీఎం పర్యటనతో పనుల్లో మరింత పెరిగిన వేగం
- వానాకాలానికి మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసేలా ప్రణాళిక
- ఆయకట్టు రైతాంగానికి భరోసా

హైదరాబాద్, వెలుగు: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) పునరుజ్జీవ పనులను 2017 ఆగస్టులో మొదలుపెట్టారు. ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనుల కోసం ప్రభుత్వం రూ.1,067 కోట్లు కేటాయించగా, నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ పనులను దక్కించుకుంది. ఎస్సారెస్పీకి దిగువ నుంచి నీటిని తరలించి మొత్తం 33 మీటర్లు ఎత్తి పోచంపాడులో పోసేలా పునరుజ్జీవ పథకాన్ని డిజైన్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరిలో వరద ఎక్కువగా ఉండే 60 రోజుల్లో 60 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి తరలించి ప్రాజెక్టు ఆయకట్టుకు భరోసానిచ్చేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. తొలి ఏడాది కనీసం 50 టీఎంసీల నీటిని తరలిస్తామని ఇరిగేషన్ అధికారులు ధీమాగా చెప్తున్నారు. మరోవైపు మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీ(లోయర్ మిడ్‌మానేరు)కి గ్రావిటీ ద్వారా నీటిని తరలించి.. ఎల్ఎండీకి దిగువ ఆయకట్టుకు నీళ్లిస్తామని పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఆలస్యంగా కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీలో 60 టీఎంసీల వరకు నీరు చేరినా ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు నీరు ఇవ్వలేకపోయారు. చెరువులు నింపేందుకు ఒకే విడతలో నీటిని విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే తొలి ఫలితం ఎస్సారెస్పీ ఆయకట్టుకే దక్కుతుందని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు.

పనులు ఇలా..

- పునరుజ్జీవ పథకంలో మొదటి పంపుహౌస్‌ను జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ వద్ద నిర్మిస్తున్నారు. ఇక్కడ మట్టి పని 10.91 లక్షల క్యూబిక్ మీటర్లు చేయాల్సి ఉండగా బుధవారానికి 10.72 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు పూర్తయింది. 2.06 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులకుగాను ఇప్పటివరకు 1.26 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు జరిగాయి.
- జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద నిర్మిస్తున్న రెండో పంపుహౌస్‌లో 9.01 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనికి 8.74 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తయ్యాయి. 1.95 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వర్క్‌కుగాను 1.22 లక్షల క్యూబిక్ మీటర్ల పని జరిగింది.
- ఎస్సారెస్పీ ప్రాజెక్టు దిగువన మోప్కాల్ వద్ద నిర్మిస్తున్న మూడో పంపుహౌస్‌లో 11.06 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనికి 10.09 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తయింది. 2.19 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనికిగాను 0.82 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు మాత్రమే పూర్తయింది. మూడు పంపుహౌస్‌లలో మట్టి పని వేగంగా సాగుతుండగా కాంక్రీట్ పనులు మాత్రం సగం మేరకు పూర్తయ్యాయి.
- ఒక్కో పంప్‌హౌస్‌లో 1,450 క్యూసెక్కుల సామర్థ్యం గల 8 మోటార్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే 8 చొప్పున పంపులు, డ్రాఫ్ట్ ట్యూబ్‌లు ఏర్పాటు చేసి రోజుకు టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 24 పంపులకుగాను ఇప్పటికే 18 పంపులు కొనుగోలు చేశారు. 14 మోటార్లు తెప్పించారు. మిగతా పంపులు, మోటార్లు ఈనెలాఖరుకు వస్తాయని అధికారులు చెప్తున్నారు. ఒక్కో పంపుహౌస్ వద్ద 220/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్ల పనులను కొనసాగిస్తున్నారు. ఇందుకుగాను రూ. 207 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 70 % నిధులు ఇప్పటికే ఖర్చు చేశారు.

ఏప్రిల్‌లో వెట్ రన్

మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన కన్నేపల్లి పంపుహౌస్ వద్ద గోదావరి నదిపై కాపర్ డ్యాం నిర్మించి నదిలో వరదను ఎత్తిపోయాలని సీఎం కేసీఆర్ సూచించారు. వేసవి కాలం ఏప్రిల్, మే నెలల్లోనూ ఇక్కడి నదిలో ప్రవాహం ఉంటుంది. మార్చి నెలాఖరు నాటికి కన్నేపల్లి పంపుహౌస్‌లో 11 మోటార్లు, పంపులు బిగించి నీటిని లిఫ్ట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అటుపై ఎల్లంపల్లిలో రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి 9 కి.మీ.ల ట్విన్ టన్నెల్స్ ద్వారా లక్ష్మీపూర్ పంపుహౌస్‌కు.. అక్కడి నుంచి 11 కి.మీ.ల టన్నెల్ ద్వారా మేడారం రిజర్వాయర్‌కు.. అక్కడి నుంచి ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిస్తారు. మిడ్ మానేరు నుంచి వరద కాలువ ద్వారా రాంపూర్ పంప్‌హౌస్‌కు.. అక్కడి నీటిని ఎత్తి రాజేశ్వర్‌రావు పేట పంపుహౌస్‌కు తరలిస్తారు. రాజేశ్వర్‌రావులో 8 మోటార్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేసి ఎస్సారెస్పీకి తరలిస్తారు. ఎస్సారెస్పీకి దిగువన నిర్మిస్తున్న పంపుహౌస్ పూర్తి కాకున్నా రెండు పంపుహౌస్‌ల ద్వారా రోజుకు టీఎంసీ నీటిని తరలిస్తామని ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు. కన్నేపల్లి, అన్నారం, గోలివాడ పంపుహౌస్‌లతో పాటు రాంపూర్, రాజేశ్వర్‌రావు పేట పంపుహౌస్‌ల్లోనూ ఏప్రిల్‌లోనే వెట్ రన్ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వానాకాలంలో నీళ్లిస్తాం

కాళేశ్వరం నీటిని ఎస్సారెస్పీ ఆయకట్టుకు వచ్చే వానాకాలంలో నీళ్లిస్తాం. ఎగువన మహారాష్ట్ర నుంచి వరద వచ్చినా రాకపోయినా ప్రాణహిత, దిగువ గోదావరి నీటిని రివర్స్ పంపింగ్ చేస్తాం. ఈ మేరకు పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నాం. మోప్కాల్ పంపుహౌస్ పూర్తికాకపోయినా ఎస్సారెస్పీకి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు. వచ్చే ఖరీఫ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు తొలిఫలితం ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.

- శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సీఎం ఓఎస్డీ (ఇరిగేషన్)

ఆస్పత్రి బెడ్డుపైనే నిఖా



- పెద్దలు ఒప్పుకోరేమోనని పురుగుల మందు తాగిన ప్రేమికులు
- బాధను అర్థం చేసుకున్న పెద్దలు..
- సంప్రదాయం ప్రకారం పెళ్లి



వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రిలో బెడ్‌పైనే నిఖా జరిపిస్తున్న కుటుంబసభ్యులు

వికారాబాద్ జిల్లా, వెలుగు: ఓ అమ్మాయి.. ఆమె సోదరి మరిది.. ఇద్దరూ ప్రేమించుకున్నారు. కానీ, ఇంట్లో ఆ అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారు. తాను మనసిచ్చిన వాడికి దూరమవుతానన్న బాధతో పురుగుల మందు తాగేసింది. హాస్పిటల్‌లో చేరింది. ఆమెను చూసిన ఆమె ప్రియుడూ ఆమె తాగిన పురుగుల మందునే తాగేశాడు. దీంతో వాళ్ల బాధను అర్థం చేసుకున్న పెద్దలు.. హాస్పిటల్ బెడ్డుపైనే నిఖా చేసేశారు. వికారాబాద్ జిల్లా అత్వెల్లి ఊరికి చెందిన రేష్మాబేగం అక్కను ధారూరు మండలం కుక్కింద గ్రామానికి చెందిన వ్యక్తికిచ్చి పెళ్లి చేశారు. అప్పుడప్పుడు ఆమె తన అక్క దగ్గరకు వెళుతుండేది. ఈ క్రమంలోనే ఆమె తన అక్క మరిది నవాజ్‌ను ప్రేమించింది. చెబితే ఎక్కడ విడగొట్టేస్తారోనని భయపడి దాచిపెట్టింది. ఇంతలోనే తల్లిదండ్రులు ఓ సంబంధం తెచ్చారు. దీంతో తనకు నవాజ్‌తో పెళ్లి జరగదని భావించి మంగళవారం పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను వికారాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కొంచెం సీరియస్‌గా ఉండడంతో అక్కడి నుంచి వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న రేష్మను చూసేందుకు నవాజ్ వచ్చాడు. ఆమెను ఆ పరిస్థితుల్లో చూసి బాధపడిన నవాజ్.. ఆమె తాగిన పురుగుల మందు డబ్బా తీసుకుని తాగేశాడు. దీంతో రేష్మ కుటుంబ సభ్యులు అతడినీ అదే హాస్పిటల్ చేర్చారు. విషయం తెలుసుకుని పెద్దలు మాట్లాడుకుని గురువారం ముస్లిం సాంప్రదాయం ప్రకారం ఆస్పత్రి బెడ్డుపైనే నిఖా చేశారు. వాళ్ల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, కొద్ది రోజులు చికిత్స చేసి డిశ్చార్జి చేస్తామని డాక్టర్లు చెప్పారు. చావుదాకా వెళ్లొచ్చిన వాళ్ల ప్రేమకథ సుఖాంతమైంది.

పైసలియ్యర్రి సారూ!

రబీలో రైతులకు అప్పులివ్వని బ్యాంకులు



- ఇప్పటివరకు 22 శాతమే అందజేత
- నాట్ల దశ దాటిపోతున్న పరిస్థితి
- వేరే దారిలేక ప్రైవేటును ఆశ్రయిస్తున్న రైతన్నలు
- సహకరించాలని బ్యాంకర్లను కోరుతున్న అధికారులు

హైదరాబాద్, వెలుగు:

ఓ వైపు యాసంగి పంటల నాట్లు వేసే దశ దాటిపోతోంది. మరోవైపు రబీ సీజన్ పంట రుణాలు అందలేదు. దీంతో బ్యాంకుల చుట్టూ తిరిగి అలిసిపోయిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వేరే దారి లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అధిక వడ్డీకి అప్పుజేసి పంట వేస్తున్నారు.

అప్పుడూ అంతే..

2018-19లో రూ.42,494.26 కోట్ల పంట రుణాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 60 శాతం (రూ.25,496 కోట్లు) ఖరీఫ్ పంటలకు, మిగిలిన 40 శాతం రబీ పంటలకు రైతులకు అందజేయాలని రుణ ప్రణాళికలో పేర్కొంది. అయితే గత ఖరీఫ్‌లో రుణ లక్ష్యాన్ని చేరుకోని బ్యాంకర్లు, ఇప్పుడు రబీలోనూ అదే దారిలో నడుస్తున్నారు. వర్షాకాలంలో రూ.25,496 కోట్లకు, రూ.19,672 కోట్ల రుణాలను మాత్రమే రైతులకు అందజేశారు.

రుణమాఫీ ఎఫెక్ట్?

యాసంగి నాట్లు డిసెంబర్‌లోనే మొదలవుతాయి. రైతుకు తొలి దశలోనే ఎకరానికి రూ.10 వేల నుంచి 15 వేల వరకు అవసరమవుతాయి. నాటు వేసిన పది రోజుల్లోపు తొలి దశ ఎరువులకు మరో రూ.5 వేలు కావాలి. దీంతో నాట్లకు ముందే రైతులు రుణాలు ఆశిస్తారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటం, అన్ని పార్టీలూ రుణమాఫీ ప్రకటించడంతో రుణాలివ్వడానికి బ్యాంకర్లు వెనుకంజ వేశారు. యాసంగి పంటకు రూ.16,998 కోట్ల రుణం మంజూరు చేయాల్సి ఉండగా, ఎన్నికల ముందు నాటికి కేవలం రూ.3,816 కోట్ల (22.45 శాతం) రుణాన్నే మంజూరు చేశారు. దీంతో అధిక శాతం రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుజేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

సహకరించాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి

రెండ్రోజుల క్రితం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ దేవసేన, రుణాల మంజూరులో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆ జిల్లాలో రబీ రుణ లక్ష్యం రూ.469.94 కోట్లు కాగా, ఇప్పటి వరకూ రూ.163.13 కోట్లు మాత్రమే రైతులకు అందజేశారు. జిల్లా రుణ లక్ష్యంలో ఇది 34.7 శాతం మాత్రమే. దీంతో రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు దేవసేన విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లిలోనే కాదని, దాదాపు అన్ని జిల్లాల్లోనూ పంట రుణాల మంజూరులో ఇదే పరిస్థితి నెలకొందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాంకర్లు సహకరించి రుణాల మంజూరులో వేగం పెంచి, రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

కౌలు రైతుల దీనస్థితి

రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. భూమి ఉన్న వారికి రైతుబంధు, రైతు బీమా కొంత ఊరటనిస్తుండగా, కౌలు చేస్తున్న రైతులకు ఆ పథకాలు దక్కడంలేదు. బ్యాంకర్లు సైతం భూయజమానులకే రుణాలిస్తున్నారు. దీంతో కౌలు రైతులకు వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. కొన్ని చోట్ల ఎరువుల దుకాణదారులే రైతులకు అప్పులిస్తున్నారు. తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించడంతోపాటు, విత్తనాలు, ఎరువులు తమ దుకాణంలోనే కొనాలని నిబంధన విధిస్తున్నారు. కొంతమందైతే పంట కూడా తమకే అమ్మాలని ఒత్తిడి తెస్తున్నారు.



వణుకుడు మళ్లీ మొదలు

- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్‌లో 6.7, మెదక్‌లో 8 డిగ్రీలు

హైదరాబాద్, వెలుగు: చలి మళ్లీ పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో మంచు విపరీతంగా కురుస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గురువారం ఆదిలాబాద్‌లో 6.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లో 8, రామగుండంలో 9.2, హన్మకొండలో 10.5, హైదరాబాద్‌లో 10.9, నిజామాబాద్‌లో 12.5 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, సిరిసిల్ల, మెదక్ జిల్లాల్లోచలిగాలులు వీచాయి. రానున్న మూడు రోజులు పొడి వాతావరణం ఉండొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	6.7
మెదక్	8
రామగుండం	9.2
హన్మకొండ	10.5
హైదరాబాద్	10.9
నిజామాబాద్	12.5
హకీంపేట	14
భద్రాచలం	15
ఖమ్మం	15.4
నల్లగొండ	15.4
మహబూబ్‌నగర్	15.5



అలోక్ మళ్లీ ఔట్

సీబీఐ చీఫ్‌గా తప్పించిన హైపవర్ కమిటీ

- అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే నిర్ణయం
- సంస్థ చరిత్రలోనే మొట్టమొదటిసారి
- నాగేశ్వర్‌రావుకే మళ్లీ తాత్కాలిక బాధ్యతలు

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ఇన్వెస్టిగేషన్(సీబీఐ) డైరెక్టర్ అలోక్ వర్మను తప్పిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని హై పవర్ కమిటీ నిర్ణయం తీసుకుంది. దాంతో, బలవంతపు సెలవు తర్వాత సుప్రీంకోర్టు తీర్పుతో మళ్లీ బాధ్యతలు స్వీకరించిన 48 గంటలలోపే ఆయన పదవి నుంచి వైదొలిగినట్టయింది. అలోక్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు కమిటీ తెలిపింది. అలోక్‌ను సెలవుపై పంపడాన్ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు, ఆయనకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది. అలోక్ వర్మకు బాధ్యతలు అప్పగించాలో వద్దో తేల్చడానికి ప్రధాని నేతృత్వంలో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ విపక్షనేత మల్లికార్జున్‌ఖర్గే, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ఎ.కె.సిక్రీ ఈ కమిటీలో సభ్యులు. ప్రధాని కార్యాలయంలో కమిటీ బుధ, గురు వారాలు సమావేశమైంది. సీవీసీ రిపోర్టు పరిశీలించిన తర్వాత, వర్మపై ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయనను సీబీఐ నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోడీ, జస్టిస్ సిక్రీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణకు చెందిన అధికారి నాగేశ్వర్ రావునే మళ్లీ సీబీఐ డైరెక్టర్‌గా తాత్కాలికంగా కమిటీ తిరిగి నియమించింది. వారంలో కొత్త డైరెక్టర్‌ను నియమించనున్నట్లు సమాచారం. అవినీతి ఆరోపణలతో అత్యున్నత అధికారిని తొలగించడం సీబీఐ చరిత్రలోనే ఇదే మొదటిసారి. వర్మను అంతగా ప్రాధాన్యంలేని ఫైర్‌సర్వీసెస్‌అండ్‌హోంగార్డ్స్‌కు డీజీగా కమిటీ నియమించింది. అయితే, తనను తప్పించే అధికారం ప్రభుత్వానికి లేదని అలోక్ వర్మ వాదిస్తున్నారు. తను సెలవులో ఉన్నప్పుడు సీబీఐ ఆఫీసులో జరిగిన మార్పులను అలోక్‌వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించిన 24 గంటల్లోనే మార్చేయడం తెలిసిందే. పది మంది ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్‌ను రద్దు చేశారు. ఐదుగురిని బదిలీపై పంపారు. అస్తానా కేసు విచారిస్తున్న డీఐజీ ఎంకే సిన్హా, డీఐజీ తరుణ్ గౌబా, జేడీ మురుగేశన్, ఏడీ శర్మను బదిలీ చేశారు. దీంతోపాటు అస్తానా కేసు విచారణను మోహిత్ గుప్తాకు అప్పగించారు.

స్వతంత్ర విచారణ అంటే మోడీకి భయం: కాంగ్రెస్

'అలోక్ వర్మ వాదన వినకుండానే ఆయనను సీబీఐ నుంచి తప్పించడానికి ప్రధాని ఆందోళనే కారణం. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సీబీఐ డైరెక్టర్‌కానీ, పార్లమెంట్‌ద్వారా ఏర్పాటయ్యే జేపీసీతో కానీ విచారణ అంటే మోడీకి ఉన్న భయానికి ఈ నిర్ణయమే నిదర్శన'మని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.



మరిన్ని సిక్సర్లు

మోడీ లిస్టులో కీలక నిర్ణయాలు? ○ నెలరోజుల్లోపే ప్రకటించే అవకాశం

వెలుగు బ్యూరో:

అగ్రకులాల్లో పేదల కోటాపై ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయం ప్రతిపక్షాలపై 'సర్జికల్ స్ట్రైక్' లాంటిదని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రత్యర్థులు ఆలోచించడానికి సమయం లేకుండా, వ్యతిరేకించడానికి అవకాశం లేని పరిస్థితి కల్పించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. అయితే ఈ ఒక్క నిర్ణయంతోనే అంతా అయిపోలేదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. మోడీ, అమిత్ షా పరిశీలనలో కొన్ని పథకాలు ఉన్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

జీఎస్టీ పన్ను శ్లాబుల్లో మార్పులు

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీల వల్ల బీజేపీకి సంప్రదాయ ఓటర్లుగా ఉన్న చిన్న వ్యాపారులు దూరమైనట్లు ఎన్నికల ఫలితాలను బట్టి పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. మళ్లీ వారిని ఆకర్షించేందుకు చర్యలు మొదలుపెట్టారు. గురువారం జరిగిన జీఎస్టీ మండలి సమావేశం తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఇప్పటివరకు రూ.20 లక్షల టర్నోవర్ దాటినవారు జీఎస్టీ రిటర్న్‌లు ఇవ్వాల్సి ఉంటే ఆ పరిమితిని రూ.40 లక్షలకు పెంచారు. అలాగే కాంపోజిట్ స్కీమ్ కింద జీఎస్టీ చెల్లించాల్సిన టర్నోవర్ పరిమితిని రూ.కోటి నుంచి కోటిన్నరకు పెంచారు. వీటితో పాటు 28 శాతం పన్ను కింద మూడు నాలుగు రకాల వస్తువులను మాత్రమే ఉంచి మిగతావన్నీ 18 శాతం శ్లాబులోకి మారుస్తామని జైట్లీ ఇదివరకే ప్రకటించారు. త్వరలోనే 12, 18 శాతం శ్లాబులను విలీనం చేసి ఒకే స్లాబుగా మారుస్తామని కూడా చెప్పారు. ఇక జీఎస్టీ వచ్చాక ఇండ్లు కొనడం భారంగా మారిందన్న అభిప్రాయం జనంలో ఉంది. సిమెంట్ పై ఇప్పుడు 28 శాతం జీఎస్టీ ఉండగా దాన్ని త్వరలోనే తగ్గిస్తామని కూడా జైట్లీ సంకేతాలిచ్చారు. జీఎస్టీ వచ్చాక ఇండ్ల రిజిస్ట్రేషన్ చార్జీలు 12 శాతం ఉండగా దీన్ని 5 శాతం స్లాబులోకి మార్చే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

తాత్కాలిక బడ్జెట్లో సాధ్యమేనా?

రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే పెట్టాల్సి ఉంటుంది. దీంతో ప్రజాకర్షక నిర్ణయాలు ప్రకటించిన దాఖలాలు గతంలో లేవు. 2009, 2014ల్లో యూపీఏ ప్రభుత్వాల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు పెట్టినా ఇలాంటి నిర్ణయాలను ప్రకటించలేదు. 2009లో బడ్జెట్ ప్రసంగంలో నాటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో ఐటీ పరిమితి పెంచడం సరికాదన్నారు. కొత్త ప్రభుత్వానికి ఆ అధికారాన్ని వదిలేయాలని చెప్పారు. దీంతో తాత్కాలిక బడ్జెట్ లో ఈ అంశం ఉంటుందా లేదా ఆసక్తిగా మారింది. అయితే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ లో ప్రత్యక్ష పన్నుల పరిమితి పెంచొద్దన్న రూల్ లేదనీ, అది ఆర్థిక మంత్రుల ఇష్టమని బీజేపీ వర్గాలంటున్నాయి.

ఆదాయ పన్ను పరిమితి పెంపు

2014లో బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం మధ్యతరగతి ఓటర్లు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, వేతనజీవులు ఎక్కువగా ఓట్లేసినట్లు అంచనాలున్నాయి. అయితే నాలుగున్నరేళ్లలో మోడీ వారి కోసం పెద్దగా చేయలేదన్న విమర్శలున్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ.2 లక్షలుగా ఉన్న ఆదాయ పన్ను పరిమితిని ఎన్డీయే వచ్చాక రూ.2.5 లక్షలకు పెంచారు. మరోసారి రూ.5 లక్షలలోపు ఆదాయంపై గతంలో ఉన్న 10 శాతం పన్నును 5 శాతానికి తగ్గించారు. ఏడో వేతన సవరణ సంఘం నివేదిక తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పలు రాష్ట్రాల ఉద్యోగాలకు జీతాలు భారీగా పెరిగాయి. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న వారి ఆదాయమూ పెరిగింది. దీంతో చాలా మంది పన్ను పరిధిలోకొచ్చారు. పెరిగిన వేతనాలతో నాలుగో తరగతి ఉద్యోగులూ 20 శాతం పన్ను స్లాబ్‌లోకి వచ్చారు. జీతంలో కోతల వల్ల వీరంతా కేంద్రంపై అసంతృప్తితో ఉన్నారు. దీంతో వీరిన ఆకర్షించేలా ఆదాయ పన్ను పరిమితిని భారీగా పెంచే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ రాబోతోంది. దీంతో ఈ ప్రతిపాదనపై అంచనాలు ఎక్కువే ఉన్నాయి. ఇప్పుడున్న ఆదాయ పన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే అంశం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటే 20 శాతం, 30 శాతం పన్ను కట్టాల్సిన ఆదాయ పరిమితిని పెంచనున్నట్లు సమాచారం.

రైతు బంధు తరహా పథకం

ఐదు రాష్ట్రాల్లో ఓటమి తర్వాత దీనికి రైతుల్లో అసంతృప్తి కూడా కారణమని బీజేపీ భావిస్తోంది. కేంద్రం కొన్నేళ్లుగా ఫసల్ బీమా యోజన లాంటి కొత్త పథకాన్ని అమలుచేస్తున్నా రైతుల్లో సానుకూలత రాలేదు. ఫసల్ బీమా పథకం వల్ల రైతుల కంటే బీమా కంపెనీలకే ఎక్కువ లాభం జరిగిందన్న విమర్శలు వచ్చాయి. అలాగే స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం పంట ఖర్చుకు 50 శాతం ఎక్కువగా కనీస మద్దతు ధర కల్పించాలన్న నిర్ణయాన్ని గత ఏడాదే ప్రకటించారు. అయితే మద్దతు ధర అనుకున్న స్థాయిలో పెరగలేదన్న విమర్శలు వచ్చాయి. దీంతో రైతులను ఆకట్టుకునేందుకు కొత్త వరాలపై మోడీ దృష్టిపెట్టారు. రుణమాఫీ సరైన పరిష్కారం కాదని ఆయన ఇప్పటికే పలు బహిరంగ సభల్లో చెబుతున్నారు. అలాంటి పథకం ప్రకటించే అవకాశం లేదని సంకేతాలిచ్చారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు తరహా పథకంపై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. నేరుగా రైతుల అకౌంట్లలో డబ్బు వేయడంతో పాటు కౌలురైతులకు కూడా ఏదో ఒక ప్రయోజనం కల్పించడంపై ఆలోచనలు చేస్తోంది. రైతుబంధు లాగే ఎకరానికి ఏడాదికి రూ.8వేలు ఇస్తే కేంద్రంపై రూ.2.5 లక్షల కోట్ల భారం పడే అవకాశం ఉంది. రైతులకు నేరుగా డబ్బు ఇస్తున్నారు కాబట్టి ఇప్పటి వరకు ఎరువుల కోసం ఇస్తున్న రూ.70వేల కోట్ల సబ్సిడీని ఎత్తేసే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. అలా చేస్తే కేంద్రంపై భారం రూ.లక్షా 80వేల కోట్లకు తగ్గుతుంది. అందులోనూ కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించేలా పథకం రూపొందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బడ్జెట్ కంటే ముందే అంటే మూడువారాల్లోపే ఈ పథకాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

శబరిమలపై 'జల్లికట్టు' ఆర్డినెన్స్?

శబరిమలలో మహిళల ప్రవేశంపై వివాదం వల్ల కేరళలో రాజకీయంగా ప్రయోజనం ఉందని బీజేపీ భావిస్తోంది. సుప్రీం తీర్పుపై హిందూ సంస్థలు వేసిన రివ్యూ పిటిషన్లు ఈ నెల్లోనే కోర్టు పరిశీలించనుంది. వాటినీ కోర్టు తిరస్కరిస్తే తమిళనాడులో జల్లికట్టుకు కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్ తరహాలోనే శబరిమలపైనా ఆర్డినెన్స్ జారీ చేయొచ్చని బీజేపీ వర్గాలంటున్నాయి. తమిళ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు జల్లికట్టుపై సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా ఆర్డినెన్స్ తెచ్చారు. అదే తరహాలో శబరిమలపైనా చట్టం తేవాలన్న డిమాండ్లు హిందూ సంస్థల నుంచి వస్తున్నాయి.

కనీస ఆదాయం పథకం

పేద, ధనిక అంతరాలు పెరిగిపోతున్న సమయంలో పేదలను ఆకట్టుకోవడానికి వారికి కనీస ఆదాయం ఉండాలన్న ప్రతిపాదనపై చాలాకాలంగా చర్చ జరుగుతోంది. కనీస ఆదాయం కంటే తక్కువ ఆదాయం ఉన్నవారికి ప్రభుత్వం ఎంతో కొంత సాయం చేయాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. దీన్ని మోడీ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. రానున్న బడ్జెట్లో ఈ పథకాన్ని ప్రస్తావించే అవకాశం ఉంది.

ఇప్పటికే ట్రిపుల్ తలాక్ బిల్లు

పార్లమెంట్ ఎన్నికలు దగ్గరలో ఉన్నా దాదాపు రెండు వారాల పాటు బడ్జెట్ సమావేశాల్ని నిర్వహించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ప్రకటించింది. గతంలో ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టి వారంలోపే సమావేశాల్ని వాయిదా వేసేవారు. ఈసారి దాదాపు 10 రోజులు సభ పనిచేసేలా షెడ్యూల్ నిర్ణయించడం వెనుక కీలకమైన బిల్లులను ఆమోదించుకునే ఆలోచన ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే లోక్ సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం వాటిలో ఒకటి. ఈ బిల్లు పాసైతే ముస్లిం మహిళల మద్దతు తమకు వస్తుందని బీజేపీ నేతలు నమ్మకంగా ఉన్నారు. వీటితో పాటు మధ్యతరగతి ప్రజల ఇంటి రుణాలపై వడ్డీ రేటును మరింత తగ్గించే యోచనలో సర్కారు ఉన్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. అందరికీ ఇండ్లు పథకంలో భాగంగా ఇప్పటికే హౌసింగ్ లోన్లకు వడ్డీ రాయితీని అమలు చేస్తున్నారు. ఇక ఫసల్ బీమా యోజనలో కూడా కొన్ని మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రైతులు కట్టే ప్రీమియంను వీలైనంత తగ్గించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే 90 శాతం ప్రీమియం కట్టేలా పథకాన్ని మార్చే ఆలోచన చేస్తున్నారు.

"ప్రజాకర్షక పథకాలకు నరేంద్ర మోడీ సాధారణంగా వ్యతిరేకంగా ఉంటారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచి ఆయన ఉచిత హామీలకు వ్యతిరేకం. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మళ్లీ అధికారంలోకి రావాలంటే కొన్ని విషయాల్లో రాజీపడక తప్పదు. రానున్న నెలరోజుల్లో మరిన్ని ప్రజాకర్షక నిర్ణయాలు ఉంటాయి."

-'వెలుగు'తో ఓ బీజేపీ ముఖ్యనేత

రికార్డు స్థాయిలో 'పంచాయతీ' నామినేషన్లు

హైదరాబాద్ , వెలుగు:



రాష్ట్ర వ్యాప్తంగా 21న జరిగే తొలిదశ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. సర్పంచ్, వార్డు మెంబర్ల కోసం రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం తెలిపింది. 4,479 సర్పంచ్ స్థానాలకు 27,940 నామినేషన్లు వచ్చాయి. 39, 822 వార్డు మెంబర్ల కోసం 97,690 నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున ఆరుగురు పోటీ పడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో వార్డు మెంబర్ కోసం ఇద్దరు పోటీలో ఉన్నారు. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను అదే రోజు రిటర్నింగ్ అధికారులు వెల్లడించనున్నారు. మొదటి దశలో భాగంగా 197 మండలాల్లో 4,479 పంచాయతీలకు ఈ నెల 21న ఎన్నికలు జరగనున్నాయి. ఆ రోజే ఫలితాల వెల్లడి, ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటాయి.

- సర్పంచ్ స్థానానికి 27,940.. వార్డు సభ్యత్వానికి 97,690 నామినేషన్లు
- రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి

నేటి నుంచి రెండో దశ నామినేషన్లు

రెండో దశ పంచాయతీ ఎన్నికలకు శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. 172 మండలాల్లో 4,137 పంచాయతీలు, 36,620 వార్డులకు 25న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు 13 వరకు గడువు ఉంది. నామినేషన్ల ఉపసంహరణకు 17వ తేదీ దాకా అవకాశం ఉంది. పోటీలో ఉండే అభ్యర్థులను అదే రోజు అధికారులు వెల్లడించనున్నారు.

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా రమణ్‌సింగ్, వసుంధర, చౌహాన్



న్యూఢిల్లీ:

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీపరంగా కీలక మార్పులకు బీజేపీ తెరతీసింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ చౌహాన్, రమణ్‌సింగ్, వసుంధరా రాజె సింధియాలను పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా గురువారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఈ విషయాన్ని ట్విటర్లో తెలిపారు. కీలక రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలవడం తెలిసిందే.

'డబ్బు దొరికింది ఒక్క ఖమ్మంలోనే'

హైదరాబాద్, వెలుగు: ఖమ్మం జిల్లా మినహా పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడా డబ్బు పట్టుబడలేదని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఎన్నికల సంఘానికి డీజీపీ నివేదికను అందజేశారు. తొలి దశ ఎన్నికల షెడ్యూల్ విడుదలయినప్పటి నుంచి అక్కడ రూ.1,17,88,820 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అన్ని జిల్లాల్లో కలిపి రూ.3,05,245 విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 ఫిర్యాదులొచ్చాయని, 17 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని, 12 కేసుల్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు.



ఓట్లతో పాటు విరాళాలూ అడగండి

పీసీసీ అధ్యక్షులకు రాహుల్ సూచన

హైదరాబాద్, వెలుగు: 'వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోడీ విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తారు. మన దగ్గర డబ్బుల్లేవు. ప్రజలను ఓట్లతో పాటు విరాళాలూ అడగండి. ఓటూ మీదే.. నోటూ మీదే అని చెప్పండి. ఇప్పుడు కష్టపడితే అధికారం మనదే' అని పీసీసీ అధ్యక్షులకు ఏఐసీసీ చీఫ్ రాహుల్‌గాంధీ సూచించారు. 'మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. వాళ్లంతా మన పక్షానే ఉన్నారు. ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండండి. వారికి వాస్తవాలు చెప్పండి' అన్నారు. గురువారం ఢిల్లీలో అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, కోశాధికారులతో రాహుల్ సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మోడీ సర్కారు అన్ని రంగాల్లో విఫలమైందని, దీన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితి ఉందని, కాస్త కష్టపడితే కేంద్రంలోనూ కాంగ్రెస్సే అధికారంలోకి వస్తుందని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉండటంతో హాజరవలేదు.

ప్రధాని, హోంమంత్రితో గవర్నర్ భేటీ

న్యూఢిల్లీ, వెలుగు: రెండు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఒకరోజు ఢిల్లీ పర్యటనలో గురువారం బిజీబిజీగా గడిపారు. ఉదయం 11 గంటలకు ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. తెలంగాణ, ఏపీలోని తాజా రాజకీయ పరిస్థితులను చర్చించినట్లు సమాచారం. తర్వాత కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌నూ కలిసి రెండు రాష్ట్రాల రాజకీయ, పరిపాలనపై నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

'లోక్‌సభ' తర్వాతే 'సహకారం'?

పంచాయతీ ఎన్నికలున్నందున నోటిఫికేషన్ వద్దన్న వ్యవసాయ శాఖ

హైదరాబాద్, వెలుగు: ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు లోక్‌సభ ఎన్నికల తర్వాతే జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉత్తర్వులిచ్చే వరకు సహకార ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని సహకారశాఖ కమిషనర్‌కు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి ఆదేశాలిచ్చారు. దీంతో పంచాయతీ ఎన్నికల తర్వాత సహకార ఎన్నికలు జరిగేలా కనిపించట్లేదు. ఫిబ్రవరి నెలాఖరున లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో.. వాటి తర్వాతే సహకార సంఘాల ఎన్నికలుంటాయన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ ఎన్నికలకు ఓటర్ల జాబితాను రూపొందించడంతో పాటు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు దక్కని నేతలు, అసంతృప్తులకు జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పదవులిచ్చి సంతృప్తి పరచాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 906 ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు, 9 జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌ల పదవీ కాలం ఫిబ్రవరి తొలి వారంలో ముగియనుంది.



జొన్న కంకులకు లిపాపలు

అరె.. ఇదేంటి.. ఏమైనా కొత్త పంటా.. అని అనుకుంటున్నారా? ఏం కాదు.. పాతదే.. జొన్న పంట. మాకు తెల్వదా జొన్న పంట ఎట్టుంటదో అంటారా? నమ్మకపోయినా ఇది జొన్న పంటే. అవన్నీ జొన్న కంకులకు రక్షణ కవచాలు. లిపాప (ఎన్వలప్)లు తొడిగారు. ఎందుకంత రక్షణ అంటే.. వరంగల్ రూరల్ జిల్లా ఆరెపల్లి ఏఆర్ఎస్‌లో పరిశోధన కోసం ఢిల్లీ వ్యవసాయ విశ్వవిద్యాలయం సైంటిస్టులు జొన్న పంట వేశారు. పంట ఎదిగి.. చేతికందే దశలో పిట్టలు వాటిని కొరికి తినేస్తున్నాయట. ఆ పిట్టల నుంచి పంటను రక్షించేందుకే ఆ సైంటిస్టుల బుర్రకు ఈ ఆలోచన తట్టిందన్నమాట. ఎట్లుంది ఐడియా?

- వరంగల్, వెలుగు ఫొటోగ్రాఫర్

నాకు నచ్చినట్టు నేనుంటా
ఇట్స్ మై లైఫ్

మారుతున్న ఇండియన్ యూత్ ప్రయారిటీస్



- బీయింగ్ మై సెల్ఫ్ అంటున్న నవతరం
- ఇండిపెండెంట్‌గా ఉండేందుకే తొలి ఓటు
- మ్యారేజ్ గురించి అసలు ఆలోచనే లేదు
- 18 నుంచి 25 ఏళ్ల వారిపై టిండర్ యాప్ సర్వే

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో మీ టాప్ ప్రయారిటీ ఏంటి? అని గత జనరేషన్‌లో ఇండియన్స్‌ను అడిగితే.. సెటిల్ కావడం.. ఆ తర్వాత హ్యాపీగా బతకడం అని సమాధానం చెప్పేవారు. కానీ ఇప్పుడు అది మారి పోయింది. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యూత్‌ను మీ ఫస్ట్ ప్రయారిటీ ఏమిటి? అని అడిగితే 'బీయింగ్ మైసెల్ఫ్'అని జవాబు చెబుతున్నారని డేటింగ్ యాప్ టిండర్ లేటెస్ట్ రిసెర్చ్‌లో తేలింది. దేశంలోని టాప్ 20 సిటీల్లోని రెండు వేల మంది యువతీ, యువకులపై టిండర్ ఈ సర్వే చేసింది. ''ఎడ్యుకేషన్ లెవల్స్, అర్బన్ కల్చర్ పెరగడం వల్ల జెన్ జెడ్ యూత్ ఇండిపెండెంట్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. తమకు ఎలాంటి కెరీర్ నచ్చుతుందో దానినే ఎంపిక చేసుకోవాలనుకుంటున్నారు. సెల్ఫ్ ఐడెంటిటీతో పాటు రిలేషన్‌షిప్స్, ఇంటరాక్షన్స్, సెల్ఫ్ ఎక్స్‌ప్రెషన్ తమకు నచ్చినట్టు ఉండాలని భావిస్తున్నారు. తమకు నచ్చినట్టుగా లైఫ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు వారు ఇష్టపడుతున్నారు''అని తన సర్వేలో టిండర్ పేర్కొంది.

ఉద్యోగానికీ ఉంది ఇంపార్టెన్స్

ఇప్పటికీ 25 ఏళ్ల వయసున్న యూత్ టాప్ ప్రయారిటీ మంచి ఉద్యోగమే. అయితే మనదేశంలో నిరుద్యోగం ఇప్పుడు ప్రధాన సమస్య. హయ్యర్ ఎడ్యుకేషన్ చదివిన వారిలో 16 శాతం మందికి జాబ్స్ లేవు. 2050 నాటికి 28 కోట్ల మంది ప్రజలు ఇండియన్ జాబ్ మార్కెట్‌లోకి ఎంటర్ అవుతారని, వారందరికీ ఉద్యోగాలు కల్పించడం సవాలేనని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ రిపోర్ట్ ఇటీవల వెల్లడించింది. అయినా నవతరం భారతీయులు తమకు నచ్చిన ఫీల్డ్‌లో ఉద్యోగాన్ని సాధించడానికే ప్రయారిటీ ఇస్తున్నారు.

ఓన్లీ డేటింగ్.. నో మ్యారేజ్

డేటింగ్ చేసేందుకూ యూత్ ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీని ద్వారా తమ గురించి తాము తెలుసుకోవాలనేది వారి కోరిక. తమ ఐదేళ్ల గోల్స్ లిస్ట్‌లో పెళ్లి చేసుకోవడం, పిల్లల్ని కనడం అనే విషయాలకు మగ, ఆడ ఇద్దరూ చోటు ఇవ్వలేదు. వారు కొత్త అనుభవాలను కోరుకుంటున్నారు. ఇక, మనదేశంలో సామాజికంగా ఎన్నో కట్టుబాట్లు, ఒత్తిడిని ఎదుర్కొనే అమ్మాయిలకు లైఫ్‌లో సెటిలయ్యే విషయంలోనూ అబ్బాయిలకంటే చాలా తక్కువ సమయం లభిస్తోందని ఈ నివేదిక వెల్లడించింది. ఈ సర్వేలో పాల్గొన్న మూడింట రెండొంతుల మంది అమ్మాయిలు తమకు గుర్తింపు తెచ్చే గోల్స్‌ను సాధించడమే లక్ష్యమని, అదే తమ టాప్ ప్రయారిటీ అని ప్రకటించారు.

18 నుంచి 22 ఏళ్ల మధ్య యూత్ టాప్ ప్రయారిటీలు

(టాప్ ప్రయారిటీ ఇచ్చిన బీయింగ్ మైసెల్ఫ్ అనేది వదిలేస్తే)

- తల్లిదండ్రులు గర్వపడేలా చేయడం **56** శాతం
- స్ట్రాంగ్ ఫ్రెండ్‌షిప్స్‌ను ఏర్పరచుకోవడం **56** శాతం
- ఎడ్యుకేషన్‌ను ఫినిష్ చేయడం **52** శాతం
- కొత్త ప్రదేశాలు చూడటం, కొత్త వ్యక్తులను కలవడం **42** శాతం

22 నుంచి 25 ఏళ్ల మధ్య యూత్ టాప్ ప్రయారిటీలు

(టాప్ ప్రయారిటీ ఇచ్చిన బీయింగ్ మైసెల్ఫ్ అనేది వదిలేస్తే)

- మంచి ఉద్యోగాన్ని సాధించడం **56** శాతం
- తల్లిదండ్రులు గర్వపడేలా చేయడం **54** శాతం
- స్ట్రాంగ్ ఫ్రెండ్‌షిప్స్‌ను ఏర్పరచుకోవడం **52** శాతం

యూత్ క్లియర్‌గా ఉంది..

మా సోషల్ ప్లాట్‌ఫామ్‌లో చాలా మంది గోల్స్, సక్సెస్‌ల గురించే ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. పెర్ఫెక్ట్ లైఫ్ పార్ట్‌నర్, సెటిల్డ్ కెరీర్ పాత్, ఇల్లు, కారు ఇలా దేని గురించైనా స్పష్టమైన అభిప్రాయంతో ఉంటున్నారు.

- టిండర్ ఇండియా హెడ్ తరుకపూర్

ఇక రైళ్లలోనూ టికెట్లు

- రైల్వేలో అందుబాటులోకి 'హ్యాండ్ హెల్డ్ టెర్మినల్స్'
- ఖాళీలు, రిజర్వేషన్, క్యాన్సిలేషన్స్ క్షణాల్లో అప్‌డేట్



హైదరాబాద్, వెలుగు: రైల్వేలో టికెట్ల జారీ మరింత సులభం కానుంది. ఎప్పటికప్పుడు ప్రయాణికుల వివరాలు తెలుసుకోవడం, స్టేషన్ల మధ్య ఖాళీ బెర్తులను గుర్తించి వెంటనే టికెట్లు జారీ చేయడం కోసం హ్యాండ్ హెల్డ్ టెర్మినల్స్ (హెచ్‌హెచ్‌టీ)ను రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చింది. వీటిని ప్రయోగాత్మకంగా రాజధాని, శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లలో ఉపయోగిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పనిచేసే సిబ్బందికి హెచ్‌హెచ్‌టీలను సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ అమిత్ వరదాస్ గురువారం అందజేశారు. ఇవి పుణె-సికింద్రాబాద్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-హజరత్ నిజాముద్దీన్-సికింద్రాబాద్ రాజధాని ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-హజరత్ నిజాముద్దీన్-చెన్నై సెంట్రల్ రాజధాని ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హజరత్ నిజాముద్దీన్-బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అందుబాటులోకి రానున్నాయి.

హెచ్‌హెచ్‌టీ ఉపయోగాలు..

- రైల్వే తనిఖీ సిబ్బంది ఎప్పటికప్పుడు బెర్తుల ఖాళీలు తెలుసుకుని ఇతరులకు కేటాయించొచ్చు.
- రిజర్వేషన్ చార్ట్ తయారైన తర్వాత రద్దైన బెర్తు వివరాలు హెచ్‌హెచ్‌టీల్లో అప్‌డేట్ అవుతాయి. వచ్చే స్టేషన్లలో అవసరమున్న వారికి ఇవ్వొచ్చు.
- ఖాళీలుంటే ప్రయాణికుల క్లాస్‌లనూ మార్చొచ్చు.



శ్రీవారిని దర్శించుకున్న జగన్

తిరుమల, వెలుగు: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రజా సంకల్ప యాత్ర ముగించుకొని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఆయన ఉదయం తిరుపతికి వచ్చారు. అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. సర్వదర్శనంలో శ్రీవారిని దర్శించుకున్నారు. జగన్ వెంట భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తిరుమలకు వచ్చారు. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు జగన్ చేరుకోగానే ఒక్కసారిగా కార్యకర్తలు ముందుకు రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. తోపులాటలో కిందపడబోతున్న జగన్ ను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. శ్రీవారి దర్శనం తర్వాత జగన్ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.



బస్సయినా, రైలైనా బాదుడు కామన్

- 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తున్న ఆర్టీసీ
- విమాన చార్జీలను మించుతున్న 'సువిధ' టికెట్ ధరలు
- ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ అక్రమ దందా

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి దోపిడీ మొదలైంది. స్పెషల్ బస్సుల పేరిట టికెట్ ధరలు 50 శాతం పెంచి ఆర్టీసీ దోపిడీ చేస్తుంటే.. రైల్వే కూడా సువిధ రైళ్ల పేరుతో భారీగానే వసూలు చేస్తోంది. ఇక ప్రైవేట్ ట్రావెల్స్ రెట్టింపు చార్జీలతో నిలువుగా దోచేస్తున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు టికెట్ల రేట్లు చూసి హడలిపోతున్నారు. పండుగ ప్రయాణాలంటేనే భయపడిపోతున్నారు.

బస్సులు, రైళ్లు ఫుల్

ఏటా సంక్రాంతికి నగరం నుంచి 30 లక్షల మంది ఇంటిబాట పడతారని అంచనా. దీంతో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంటుంది. ఈ సారి 5,252 బస్సులు నడపాలని నిర్ణయించింది. వీటిల్లో సాధారణ చార్జీలకన్నా 50 శాతం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అదీ రిజర్వేషన్‌లో సీటు దొరికితేనే. రైల్వే కూడా ఈసారి 120 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వెల్లడించింది. వాటిల్లోనూ చాలా వరకు టికెట్లు బుక్కయ్యాయి. వెయిటింగ్ లిస్టు 400 వరకు ఉంది. సువిధ రైళ్లలోనైతే 20 శాతం టికెట్లను డిమాండ్‌ను బట్టి అమ్ముతుండటంతో ధర 4 రెట్లు పెరుగుతోంది. దీంతో విమాన టిక్కెట్ల చార్జీల కన్నా సువిధ 'ఏసీ' చార్జీలు ఎక్కువైపోయాయి. బస్సులు, రైళ్లలో టికెట్లు దొరకని వారు ప్రైవేటు వాహనాల్లో వెళ్లక తప్పని పరిస్థితి. ఇదే అదనుగా ట్రావెల్స్ యాజమానులు అక్రమ దందా చేస్తున్నారు. కాంటాక్ట్ క్యారేజ్ పర్మిషనే ఉన్నా స్టేజీ క్యారేజ్ బస్సుల మాదిరి ప్రతి స్టాప్‌లో ఆపుతూ జనాన్ని ఎక్కించుకుంటున్నారు. టికెట్ల ధరలను 2 నుంచి 4 రెట్లు పెంచేస్తున్నారు.

ఆర్టీసీ చార్జీలే రూ.200 అదనం

హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లడానికి ఒక్కో వ్యక్తికి ఆర్టీసీ చార్జీల ప్రకారమే రూ. 200లకు పైగా అదనపు భారం పడుతోంది. సువిధ లాంటి రైళ్లలోనైతే ఒక్కరే రూ.1,000 ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి. ప్రైవేట్ వాహనాల్లో వెళ్తే తక్కువలో తక్కువ రూ. 1,000 ఇవ్వాల్సిందే. ఈ లెక్కన ఓ కుటుంబంలో నలుగురుంటే రూ.3 వేల నుంచి రూ.5 వేల భారం పడుతోంది. ఏటా ఇలానే ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్, వాహనాల దోపిడిని నివారించే చర్యలు తీసుకోవాలంటున్నారు.

సంక్రాంతికి 60 జన్ సాధారణ్ రైళ్లు

సంక్రాంతి రద్దీ దృష్ట్యా 60 జన్ సాధారణ్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. అన్నీ అన్ రిజర్వ్‌డ్ సెకండ్ క్లాస్ రైళ్లేనని చెప్పింది. రైళ్లు సికింద్రాబాద్/హైదరాబాద్-విజయవాడ, సికింద్రాబాద్-తిరుపతి, కాకినాడ టౌన్-తిరుపతి, విజయవాడ-విజయనగరం మధ్య నడవనున్నట్లు తెలిపింది.

ఏపీలో వాహనాలకు ఒకే సిరీస్ నంబర్లు

విజయవాడ, వెలుగు: కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కు ఒకే సిరీస్ నంబర్ కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోనే మొదటిసారి ఈ విధానాన్ని ఆ రాష్ట్రంలో అమలులోకి తీసుకురానుంది. ఇకపై అన్ని జిల్లాల్లోనూ వాహనాలకు ఒకే సిరీస్ నంబర్ ఉంటుంది. దీంతో వాహనాన్ని ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలు కలుగనుంది. ఏపీ 39 సిరీస్‌తో కొత్త రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ విధానంతో రవాణా శాఖకు ఎక్కువ ఆదాయం వస్తుందని, వాహనదారులకు సమయంతోపాటు డబ్బు ఆదా అవుతుందని ఏపీ రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట

ఎంఎస్ఎంఈలకు జీఎస్టీ మినహాయింపు పరిమితి పెంపు



గురువారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జైట్లీ

- ప్రస్తుతం రూ.20 లక్షలు.. ఇక నుంచి రూ.40 లక్షలు
- 50% నుంచి 60% మంది చిన్నవ్యాపారులకు ప్రయోజనం
- జీఎస్టీ కౌన్సిల్ 32వ సమావేశంలో కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో వ్యాపార వర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థ(ఎంఎస్ఎంఈ)లకు వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) మినహాయింపు పరిమితిని ఇప్పుడున్న రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచింది. ఈశాన్య రాష్ట్రాలకైతే ఈ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు చేసింది. గురువారం ఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ 32వ సమావేశం ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎంఎస్ఎంఈల మినహాయింపు పరిమితిని పెంచడం ద్వారా 50 శాతం నుంచి 60 శాతం మంది చిన్న వ్యాపారులు పన్ను పరిధి నుంచి బయటపడనున్నారు. పెద్దనోట్ల రద్దు, ఆ వెంటనే జీఎస్టీ అమలుతో చితికిపోయిన చిన్న వ్యాపారాలకు చేయూత ఇవ్వడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయాలను ప్రకటించింది.

కాంపోజిషన్ స్కీములో మార్పులు

కాంపోజిషన్ స్కీములోనూ కీలక మార్పులను కౌన్సిల్ ప్రకటించింది. ఈ స్కీము పరిధిలోకి చేరేందుకు ఇప్పటిదాకా గరిష్ఠ పరిమితి రూ.కోటి ఉండగా దానిని రూ.1.5 కోట్లకు పెంచింది. దీంతో చిన్న కంపెనీలు, సంస్థలు రూ.1.5 కోట్ల దాకా జీఎస్టీ నిర్వహణ భారాన్ని పెట్టుకోవక్కర్లేదు. ఈ సంస్థలు టర్నోవర్‌ను బట్టి 1 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది మరిన్ని ఎంఎస్ఎంఈలకు వ్యాపారాన్ని సులభం చేయనుంది. రూ.50 లక్షలలోపు టర్నోవరుండే సర్వీసెస్ రంగంలోని చిన్న కంపెనీలూ ఇకపై కాంపోజిషన్ స్కీమును వాడుకోవచ్చు. ఇలాంటి సంస్థలు ఈ స్కీము కింద 6 శాతం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది. ఇక కాంపోజిషన్ స్కీములో చేరే చిన్న కంపెనీలు మూడు నెలలకోసారి జీఎస్టీ చెల్లించి, ఏడాదికోసారి రిటర్న్‌లు దాఖలు చేసేందుకు కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. మరోవైపు ఒక శాతం కెలామిటీ సెస్ విధింపునకు కేరళ రాష్ట్రానికి జీఎస్టీ కౌన్సిల్ అనుమతిచ్చింది. తుఫాన్‌తో ఆ రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున.. కోలుకోవడానికి వీలుగా అంతర్రాష్ట్ర అమ్మకాలపై రెండేళ్ల పాటు ప్రత్యేక సెస్ విధింపునకు ఓకే చెప్పింది. ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి. ఇక రియల్ ఎస్టేట్, లాటరీల విషయంలో ఏకాభిప్రాయం రానందున, వాటిపై జీఎస్టీ విధింపును నిర్ణయించడానికి రెండు వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేసింది. వివిధ రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు ఈ కమిటీలు ప్రయత్నిస్తాయి. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండటంతో, వినియోగదారులు, చిన్న వ్యాపారులను ఆకట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం గత కొద్ది రోజులుగా చాలా చర్యలు తీసుకుంటోంది. ఎంఎస్ఎంఈలకు 59 నిమిషాల్లోనే రుణాలు, నేషనల్ పెన్షన్ స్కీము చందాదారులకు పన్ను రాయితీ, 23 వస్తువులపై జీఎస్టీ తగ్గింపు, రిటర్న్‌ల దాఖలుకు గడువు పొడిగింపు, రిటర్న్ ఫార్మ్స్‌ను సులభం చేయడం, ఉల్లి ఎగుమతులపై రైతులకు ప్రోత్సాహకాలు, చిన్న వ్యాపారులను కాపాడేందుకు, ఆన్‌లైన్ రిటైల్‌లో ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ నిబంధనలను కఠినం చేయడం వంటి వాటిని ఇందులో ప్రముఖంగా చెప్పుకోవచ్చు. కాగా, మినహాయింపు పరిమితి పెంచడం వల్ల రూ.5,200 కోట్లు, కాంపోజిషన్ స్కీములో చేరే గరిష్ఠ పరిమితిని పెంచడం వల్ల మరో రూ.3 వేల కోట్లు ఖజానాపై భారం పడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.


జైళ్లలో మరిన్ని సంస్కరణలు

జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్

హైదరాబాద్, వెలుగు: జైళ్ల శాఖలో మరిన్ని సంస్కరణలు చేపడతామని, దేశంలో ఎక్కడాలేని విధంగా ఖైదీల్లో మార్పులు తీసుకొస్తున్నామని జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో 2018 వార్షిక నివేదికను విడుదల చేసి 2019 ప్రణాళికలను వెల్లడించారు. జైళ్ల శాఖ పెట్రోల్ బంకులతో మంచి ఆదాయం వస్తోందని, ఈ ఏడాది మరికొన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 12 వేల మంది..

గతేడాది రాష్ట్రంలో 76,443 మంది జైళ్లకు వచ్చారని తెలిపారు. 7,133 మంది ఖైదీల సామర్థ్యం ఉన్న రాష్ట్ర జైళ్లలో ప్రస్తుతం 5,608 మందే ఉన్నారన్నారు. ఇందులో 2,081 మంది శిక్ష అనుభవిస్తుండగా 3,228 విచారణ ఎదుర్కొంటున్నారన్నారు. మహిళా జైళ్లలో 406 మంది, పీడీ యాక్టుపై మరో 299 మంది జైళ్లలో ఉన్నారన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులతో గతేడాది 12 వేల మంది జైలుకు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. గత ఐదేళ్లలో 1,32,000 మందికి చదువు చెప్పించినట్టు తెలిపారు. జైలు నుంచి వెళ్లాక పని దొరకని వారికి పెట్రోల్ బంకుల్లో ఉద్యోగాలిచ్చామని, 197 మందికి రూ.50.9 లక్షల రుణాలు ఇప్పించినట్టు చెప్పారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఉత్పత్తుల వల్ల గతేడాది రూ.17 కోట్లు సమకూరాయన్నారు. పెట్రోల్ బంకుల్లో 2018లో రూ.495.86 కోట్ల టర్నోవర్ జరిగిందన్నారు.



కేన్సర్ మందును పీల్చేసే స్పాంజ్

- కీమోథెరపీ తర్వాత పేరుకుపోయే మందుకు పరిష్కారం
- సైడ్‌ఎఫెక్ట్‌లను తగ్గించేందుకు తయారు చేసిన ఇండియన్ సైంటిస్ట్

కేన్సర్ రోగులకు చేసే మొట్టమొదటి చికిత్స కీమోథెరపీ. రోగకణాలు చచ్చిపోవడం ఏమోగానీ, దాని వల్ల నరకం అనుభవిస్తుంటారు బాధితులు. తీవ్రమైన నొప్పి ఉంటుంది. జుట్టు ఊడిపోతుంది. పైపెచ్చు.. రక్తంలో ఆ కీమోథెరపీ అవశేషాలు పేరుకుపోతుంటాయి. అది మరో నష్టం. దానికి అమెరికా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా సైంటిస్టులు ఓ పరిష్కారం కనుక్కున్నారు. ఆ అవశేషాలను తీసేసే త్రీడీ స్పాంజ్‌ను తయారు చేశారు. పందులపై చేసిన ప్రయోగంలో కాలేయ కేన్సర్‌కు వాడే డోక్సోరుబిసిన్ అనే మందు అవశేషాలను ఆ స్పాంజ్ పీల్చేసింది. దాదాపు 64 శాతం అవశేషాలను అది తుడిచేసింది. కీమోథెరపీ సైడ్ ఎఫెక్ట్స్ ఎదుర్కొనే కొన్ని లక్షల మంది రోగులకు ఈ స్పాంజ్ మేలు చేస్తుందని సైంటిస్టులు చెబుతున్నారు. జుట్టు రాలడం, వాంతి లక్షణాలు, అలసట, విరేచనాల వంటి సైడ్‌ఎఫెక్ట్‌లను తగ్గించొచ్చంటున్నారు. అంతేగాకుండా ట్రీట్‌మెంట్‌ను మరింత సమర్థంగా చేసేందుకు ఎక్కువ డోసుల్లో మందులిచ్చేందుకు వీలు చిక్కుతుందన్నారు. కీమోథెరపీ కోసం ఇచ్చే మందుల్లో 50 నుంచి 80 శాతం వరకు శరీరంలోని ఇతర ప్రాంతాలకు చేరుతుందని, కేన్సర్ కణాల వద్దకు చేరేది కొద్దిగేనని సైంటిస్టులు చెప్పారు. పాలిఇథిలీన్ గ్లైకాల్ (పెగ్)తో ఈ స్పాంజ్‌ను త్రీడీ ప్రింట్ ద్వారా తయారు చేశామని వివరించారు. భారత సంతతి శాస్త్రవేత్త నితాశ్ బల్సారా ఈ స్పాంజ్‌ను తయారు చేశారు. సిలిండర్ ఆకారంలోని ఈ స్పాంజ్‌ను రక్తనాళాల్లోకి పంపించడం ద్వారా.. రక్తంలో కలిసిన ఆ మందును పీల్చుకునేలా చేశారు.

తప్పుకున్న జస్టిస్ లలిత్

అయోధ్య కేసులో కొత్త ట్విస్ట్! ▪ విచారణ ఈనెల 29కి వాయిదా

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామ జన్మభూమి బాబ్రీ మసీదు స్థల వివాదం కేసు విచారణలో కొత్త ట్విస్ట్ నెలకొంది. కేసును విచారిస్తున్న రాజ్యాంగ ధర్మాసనం నుంచి జస్టిస్ యు.యు. లలిత్ తప్పుకున్నారు. దీంతో కేసు విచారణను ఈనెల29కి బెంచ్ వాయిదా వేసింది. కేసు విచారణకు మరో బెంచ్‌ను ఏర్పాటుచేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ ప్రకటించారు. సీజేఐతో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం (జస్టిస్ ఎస్.ఎ. బోబ్డే, జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్) గురువారం కేసు విచారణను ప్రారంభించిన వెంటనే ... బెంచ్‌లో జస్టిస్ లలిత్ ఉన్న విషయాన్ని సీనియర్ లాయర్ రాజీవ్ ధావన్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. జస్టిస్ లలిత లాయర్‌గా ఉన్నప్పుడు (1994లో) అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ తరపున ఆయన వాదించిన విషయాన్ని ధావన్ గుర్తు చేశారు. అయితే జస్టిస్ లలిత్ తప్పుకోవాలని తాను కోరుకోవడంలేదన్నారు. అయినా జస్టిస్ లలిత్ బెంచ్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా బెంచ్‌లోని మిగతా సభ్యులు ధావన్ లేవనెత్తిన అంశాలను నోట్‌చేసుకున్నారు.కేసు విచారణకు ముగ్గురు జడ్జిల బెంచ్‌ను ఏర్పాటుచేస్తామని ముందుగా ప్రకటించినా, కేసు విచారణకు ఐగుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేస్తూ సీజేఐ నిర్ణయం తీసుకున్నారని ధర్మాసనం దృష్టికి ధావన్ తీసుకెళ్లారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేయాలంటే దానికి న్యాయపరమైన ఉత్తర్వు (జ్యుడీషియల్ ఆర్డర్) ఇవ్వాల్సి ఉందని అన్నారు. ఏదైనా బెంచ్ ఏర్పాటుకు ఇద్దరు న్యాయమూర్తులు ఉండాలన్న సుప్రీంకోర్ట్ రూల్స్ ను చీఫ్ జస్టిస్ గొగొయ్ ప్రస్తావిస్తూ...ఇదే నిబంధన ప్రకారం ఐదుగురు సభ్యుల ఏర్పాటుచేయడంలో ఎలాంటి తప్పులేదని అన్నారు.కేసుకు సంబంధించిన నిజానిజాలు, పరిస్థితులు, కట్టలుగా పేరుకుపోయిన రికార్డులను దృష్టిలో ఉంచుకుని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం అయోధ్య కేసు విచారణకు సరిపోతుందని సీజేఐ చెప్పారు.


ఓ గదిలో సీల్ వేసిన 50 ట్రంకుపెట్టెల్లో భద్రపరిచిన రికార్డుల్ని కోర్టు రిజిస్ట్రీ స్వయంగా వెళ్లి చూస్తుందని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కేసుకు సంబంధించిన రికార్డులు పెద్ద పెద్ద వాల్యూమ్స్‌లో ఉన్నాయని, కొన్ని డాక్యుమెంట్లు సంస్కృతం, అరబిక్, ఉర్దూ, హిందీ, పర్షియన్, గురుముఖి భాషల్లో ఉన్నాయని, వీటిని తర్జుమా చేయాలని కోర్టు చెప్పింది. అవసరమైతే కోర్టు రిజిస్ట్రీ ప్రభుత్వ ట్రాన్స్‌లేటర్ల సాయాన్ని తీసుకుంటుందని చెప్పింది.

విచారణ సందర్భంగా 113 అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశముందని పేర్కొంది. ఈ కేసు అలహాబాద్ హైకోర్టు ముందుకు వచ్చిన సందర్భంగా 88 మంది సాక్ష్యులను విచారించారని, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారని తెలిపింది. హైకోర్టు తీర్పే 4,304 పేజీలు ఉందని, వీటికి అదనంగా అనుబంధ పత్రాలతో కలిసి మొత్తం తీర్పు అంతాకలిపి 8,000గా ఉందని కోర్టు చెప్పింది.

మరోవైపు, కేసు విచారణను వాయిదా వేయడంపై బీజేపీ అనుబంధ సంస్థలకు చెందిన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశాయి.



అయోధ్యలో రామమందిరం నిర్మించాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టు దగ్గర గురువారం ఆందోళన చేస్తున్న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు





నేపథ్యం ఇదీ..

అయోధ్యలో 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లా మధ్య సమానంగా పంచాలని 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో సంతృప్తి చెందని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వ్యక్తులు, ధార్మిక సంస్థల తరపున మొత్తం14 పిటిషన్లు దాఖలయ్యాయి. పిటీషన్లను పరిశీలించిన సుప్రీంకోర్టు.. 2019 జనవరి మొదటివారంలో బెంచ్‌కు నివేదిస్తామని గత ఏడాది అక్టోబరు 29న పేర్కొంది. విచారణ కోసం గత మంగళవారం రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేసింది.

"సుప్రీంకోర్టులో రామ జన్మభూమి బాబ్రీమసీదు కేసు విచారణ సందర్భంగా ఎలాంటి అడ్డంకులు కల్పించకూడదు. వివాదాన్ని త్వరగా పరిష్కరించుకుంటే దేశంతోపాటు హిందువులకు, ముస్లింలకు కూడా ఎంతో ఉపయోగకరం."

- నేషనల్ మైనార్టీ కమిషన్ చైర్మన్ సయ్యద్ హసన్ రిజ్వి

ఒక సెషన్.. ఐదు బిల్లులు



- శీతాకాల సమావేశాల్లో పాస్ చేసిన పార్లమెంట్
- ప్రవేశపెట్టిన బిల్లులు 17
- లోక్‌సభ 47 శాతం, రాజ్యసభ 27 శాతం ప్రొడక్టివిటీ

న్యూఢిల్లీ: రాఫెల్ రచ్చతో ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్లతో బుధవారం ముగిశాయి. 12 బిల్లులు లోక్‌సభలో, ఐదు రాజ్యసభలో కలిపి మొత్తం 17 బిల్లులను సభ్యులు ప్రవేశపెట్టారు. ఉభయసభల్లో ఐదు బిల్లులు మాత్రమే పాస్ అయ్యాయి. వీటిలో పౌరసత్వం సవరణ బిల్లు కూడా ఉంది. మరోవైపు పెండింగ్‌లో ఉన్న నలంద యూనివర్సిటీ (సవరణ) బిల్లు, ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ (సవరణ) బిల్లు, హోమియోపతి కౌన్సిల్ (సవరణ) బిల్లు తదితరాలను రాజ్యసభలో విత్ డ్రా చేసుకున్నారు. ఇక 29 రోజులపాటు సాగిన లోక్‌సభ 17 సార్లు భేటీ అయింది. 30రోజులు సాగిన రాజ్యసభ 18సార్లు సమావేశమైంది. లోక్‌సభ మంగళవారం, రాజ్యసభ బుధవారం నిరవధికంగా వాయిదా పడింది.

లోక్‌సభ 47 శాతమే..

సెషన్ ప్రారంభంలో రాఫెల్ జెట్ డీల్, తమిళనాడు, కర్నాటక మధ్య కావేరీ వివాదం, సీబీఐ, ఆర్బీఐలో చోటు చేసుకున్న వివాదాలతో సభ సజావుగా జరగలేదు. ప్రతిపక్షాల నిరసనలు, సభ వాయిదాలు, సభ్యుల సస్పెన్షన్లతోనే సాగింది. తాజా సెషన్‌లో లోక్‌సభ 47 శాతం మాత్రమే పని చేసింది. ఎన్డీఏ హయాంలో నాలుగో అతి తక్కువ ప్రొడక్టివిటీ ఇది. రాజ్యసభలో కూడా 27 శాతం ప్రొడక్టివిటీ నమోదైంది. గత సెషన్‌లో పెద్దల సభ 68 శాతం పని చేసింది.

31న రాష్ట్రపతి ప్రసంగం

ఈనెల 31న ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించనున్నారు. తర్వాత అదే రోజు ఎకనిమక్ సర్వే రిపోర్టును ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 1న ఎన్డీఏ ప్రభుత్వ చివరి, మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఇక ప్రభుత్వం16 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. అందులో నాలుగు బిల్లులను మాత్రమే ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. మిగతా 12 బిల్లులను లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టి పాస్ చేస్తారు. వాటికి రాజ్యసభ ఆమోదం అవసరం లేదు.

కేజ్రీవాల్‌తో ప్రకాశ్‌రాజ్ భేటీ



న్యూఢిల్లీ: నటుడు ప్రకాశ్‌రాజ్ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో గురువారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికలతోపాటు అనేక అంశాలపై ఇద్దరూ చర్చించినట్టు తెలుస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్టు ప్రకాశ్ రాజ్ ఈమధ్య ప్రకటించిన వెంటనే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆయనకు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే వీరిద్దరి భేటీకి ప్రాధాన్యం సంతరించికుంది. తన రాజకీయ ప్రయాణానికి మద్దతు తెలిపినందుకు ఆయనకు, ఆమ్ ఆద్మీ పార్టీలకు ప్రకాశ్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

తాలిబన్ల దాడిలో 12 మంది పోలీసుల మృతి

కాబూల్: ఆఫ్గానిస్తాన్‌లోని పోలీసు ఔట్‌పోస్టులపై టెర్రరిస్టులు విరుచుకుపడ్డారు. తాలిబన్ల దాడిలో 21 మంది పోలీసులు చనిపోయినట్లు స్థానిక అధికారులు చెప్పారు. పశ్చిమ ఆఫ్గాన్‌లో 21 మంది, వెస్ట్రన్ బాడ్గిస్ ప్రావిన్స్ పరిధిలో ఆరుగురు, నార్తర్న్ బాఘ్లాన్ ప్రావిన్స్‌లోని బీక్‌జాయా వద్ద ఏడుగురు, నార్తర్న్ తఖార్ ప్రావిన్స్‌లో ఎనిమిది మందిని తీవ్రవాదులు తుపాకులతో కాల్చి చంపినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో మరో 23 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డట్లు తెలిపారు.



రాహుల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌ప్రెసిడెంట్ రాహుల్ గాంధీకి.. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) నోటీసులు జారీ చేసింది. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌పై కామెంట్స్ చేసినందుకు గురువారం నోటీసులు పంపామని ఎన్‌సీడబ్ల్యూ చైర్ పర్సన్ రేఖా శర్మ చెప్పారు. రాహుల్‌స్త్రీ వ్యతిరేక, దుర్మార్గమైన, అనైతిక వ్యాఖ్యలు చేశారని ఆమె ఆరోపించారు. మహిళపై చేసిన కామెంట్స్‌కు వివరణ ఇవ్వాలని కోరారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన కిసాన్‌ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రధాని మోడీ, నిర్మలా సీతారామన్‌పై కామెంట్స్‌చేశారు. మోడీ మహిళ వెనుక దాక్కుని తప్పించుకోవాలని చూశారని, కానీ ఆమె రక్షించలేక పోయారు అని అన్నారు.

రాహుల్‌కు ప్రకాశ్‌రాజ్ మద్దతు

రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను సినీనటుడు ప్రకాశ్‌రాజ్ సమర్థించారు. రాఫెల్ విషయంపై ప్రధాని మాట్లాడకుండా పారిపోవడం గురించి ఎవరూ మాట్లాడకుండా రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలనే హైలెట్ చేస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ మహిళలకు వ్యతిరేకమైతే.. ట్రాన్స్‌జెండర్‌కు పదవి ఎందుకు ఇస్తారని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో రాహుల్ గాంధీతో భేటీ అయిన తర్వాత ప్రకాశ్‌రాజ్ మీడియాతో మాట్లాడారు. "ఈ అంశాన్ని ఇంకో కోణంలో ఎందుకు చూడటం లేదు? ప్రధాని మాట్లాడకుండా దాక్కున్న విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? దాని గురించి కూడా ఆలోచించండి" అని అన్నారు.

ఆర్మీలో 'గే' లకు నో ఎంట్రీ



న్యూఢిల్లీ: ఇండియన్ ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'గే' లకు (స్వలింగ సంపర్కులు) ఆర్మీలోకి ఎంట్రీ లేదని స్పష్టం చేశారు. ఇండియన్ ఆర్మీ కొన్ని నిబంధనలకు లోబడి ఉంటుందని, సైన్యంలోకి 'గే' లను తీసుకోవడం కుదరదని తెగేసి చెప్పారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. స్వలింగ సంపర్కం నేరం కాదని సుప్రీం కోర్టు చెప్పినా అది ఆర్మీకి వర్తించదని అన్నారు. 'చట్టం కంటే ఆర్మీ ఎక్కువేం కాదు.. కానీ రాజ్యాంగం మాకు కొంత స్వేచ్ఛనిచ్చింది' అని చెప్పారు. ఆర్మీ చట్టం ప్రకారం తాము ఇం కా నడుచుకుంటున్నామన్నారు. స్వలింగ సంపర్కం నేరం కాదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోందంటూ.. పాత చట్టాన్ని కొట్టేసింది. గతంలో తీర్పు వచ్చిన సమయంలో కూడా రావత్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని కొన్ని మీడియా సంస్థలు చెప్పాయి.

కోటా బిల్లుపై సుప్రీం కోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: అగ్రకుల పేదలకు 10శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిటిషన్‌దాఖలైంది. యూత్‌ఫర్ ఈక్వాలిటీ ఆర్గనైజేషన్, కౌశల్‌కాంత్ మిత్ర అనే వ్యక్తి గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్‌వేశారు. బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమని పిటీషనర్లు ఆరోపించారు. రిజర్వేషన్లు ఇచ్చేందుకు ఆర్థిక వెనుకబాటుతన్నాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని, బిల్లును రద్దు చేయాలని కోరారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని గతంలో సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. ఉన్నత కులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగావకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మోడీ ప్రభుత్వం 124వ రాజ్యాంగ సవరణ చేసింది.

'సిటిజన్' గొడవ ఆగలే..

- పౌరసత్వ సవరణ బిల్లును వెనక్కి తీసుకోండి
- కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి డిమాండ్
- అస్సాంలో ఆగని నిరసనలు

గువహటి: పౌరసత్వ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తూ అస్సాంలో గురువారం కూడా ఆందోళనలు కొనసాగాయి. స్టూడెంట్స్, లాయర్లు, డాక్టర్లు రోడ్లపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ బిల్లు అమలైతే తమ అస్తిత్వానికి ముప్పు కలుగుతుందని కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి (కేఎంఎస్‌ఎస్) నేతృత్వంలో 70కిపైగా సంఘాలు గురువారం అస్సాం సెక్రటేరియట్ ఎదుట 'సంకల్ప దివస్' పేరుతో ఆందోళన చేశాయి. తమ ప్రయోజనాలను దెబ్బతీస్తే ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులను అస్సాంలో తిరగనివ్వమని ఆందోళనకారులు హెచ్చరించారు. "అక్రమ వలసలకు అస్సాం ప్రజలు ఎప్పుడూ వ్యతిరేకమే. ఈ బిల్లును ఆమోదిస్తే బంగ్లాదేశ్ నుంచి 190 మిలియన్ల మంది వలస వస్తారు. మా అస్తిత్వానికి ముప్పు కలుగుతుంది. వెంటనే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలి. లేకుంటే ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ర్యాలీలు చేస్తాం. బీజేపీ మంత్రులు, నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటాం" అని కేఎంఎస్‌ఎస్ చీఫ్ అఖిల్ గొగొయ్ అన్నారు. గువహటిలోని మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అస్సాం పీసీసీ లీగల్ విభాగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసింది. గువహటి, అస్సాం రాజధాని దిస్పూర్ లో స్టూడెంట్స్ స్కూళ్లు, కాలేజీలను బహిష్కరించి రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. వారిని భద్రతా దళాలు ఎక్కడికక్కడ అడ్డుకున్నాయి. బుధవారం బీజేపీ సర్కారు నుంచి అస్సాం గణ పరిషత్ బయటకు వచ్చింది.

పదేళ్లుగా చొరబాట్లు ల్లేవు

"బంగ్లాదేశ్ నుంచి ఇప్పుడు ఇండియాకు ఎవరూ వలస రావట్లేదు. వారంతా యూరప్, గల్ఫ్, ఇతర అభివృద్ధి చెందిన ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. యూరప్, గల్ఫ్ లో వారికి రోజుకు రూ.3 వేలు కూలీ లభిస్తుంది, ఇండియాలో అయితే కేవలం రూ.వెయ్యి కూలీ మాత్రమే దొరుకుతుంది. అలాంటప్పుడు వారెందుకు ఇక్కడికి వస్తారు ?. పౌరసత్వం (సవరణ) బిల్లుతో కొత్తగా ఎవరూ వలస రారు"

- బీజేపీ అధికార ప్రతినిధి స్వప్ననిల్ బరువా



ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ షీలా దీక్షిత్

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ సీఎం, కాంగ్రెస్‌సీనియర్ నేత షీలాదీక్షిత్‌ఢిల్లీ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఏఐసీసీ ఢిల్లీ యూనిట్ఇంచార్జ్ చాకో గురువారం ఈ విషయాన్ని ప్రకటించారు. ఆమెతో పాటు పార్టీ నేతలు దేవేందర్‌యాదవ్, హరూన్ యూసుఫ్, రాజేశ్ లిలోటియా లను వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించినట్లు చెప్పారు. ఆమ్‌ఆద్మీతో పొత్తుపై ఢిల్లీ కాంగ్రెస్‌లో చర్చలు జరగలేదని, లోక్ సభ ఎన్నికల్లో ఒంటిరిగానే పోటీ చేస్తామని చాకో ప్రకటించారు.

యూఎస్‌లో 8 లక్షల మంది ఉద్యోగులకు

3 వారాలుగా జీతాల్లేవ్

వాషింగ్టన్: అమెరికాలోని 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మూడు వారాలుగా జీతాల్లేవు. షట్‌డౌన్ పై జరుగుతున్న చర్చల్లో ఎ లాంటి పురోగతి లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా, బుధవారం అమెరికా ప్రెసిడెంట్‌డొనాల్డ్ ట్రంప్, డెమోక్రాట్ల మధ్య జరిగిన చర్చలు కూడా అర్ధాంతరంగానే ముగిసాయి. ప్రెసిడెంట్ ట్రంప్ వెనక్కు తగ్గలేదు, డెమోక్రాట్లు పట్టువీడలేదు. దీంతో షట్‌డౌన్ పై చర్చలు నిలిచిపోయాయి. ఇరవై రోజులు గడుస్తున్నా అమెరికాలో ఆర్థిక స్తంభన కొనసాగుతూనే ఉంది. షట్ డౌన్‌మొదలైన తర్వాత వచ్చిన తొలి పేడే శుక్రవారం కూడా ఉద్యోగులకు జీతాలందే పరిస్థితిలేదు. ఈ వారాంతం కూడా షట్ డౌన్‌కొనసాగితే అమెరికా చరిత్రలోనే ఇది ఎక్కువ కాలం సాగిన షట్‌డౌన్‌గా మిగిలిపోనుంది. చర్చలతో పరిస్థితిలో మార్పు వస్తుందన్న అమెరికన్ల ఆశ అడుగంటిపోయింది. కేవలం పదిహేను నిమిషాల్లోనే 'టైం వేస్ట్ మీటింగ్' అంటూ ట్రంప్‌బయటికి రాగా, ఇప్పటికీ ప్రెసిడెంట్ తన ధోరణి మార్చుకోవడంలేదని డెమోక్రాట్లు ఆరోపిస్తున్నారు. షట్‌డౌన్ పై చర్చలకు 'బై బై' అంటూ ట్రంప్‌ట్వీట్ చేయగా.. ప్రజలను ట్రంప్‌అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారంటూ ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు.

14 నిమిషాల్లో..

షట్ డౌన్‌ఎత్తివేతకు సంబంధించి ప్రెసిడెంట్ ట్రంప్, స్పీకర్‌నాన్సీ పెలోసి, డెమోక్రాట్ నేతల మధ్య జరిగిన చర్చలు కేవలం పద్నాలుగు నిమిషాల్లోనే ముగిసాయి. మీటింగ్‌ప్రారంభమైన వెంటనే గోడ కట్టడానికి నిధులు ఇస్తారా.. అంటూ ట్రంప్‌స్పీకర్ ను అడిగారు. స్పీకర్‌నాన్సీ కుదర దని జవాబివ్వడంతో మీటింగ్ హాల్ లోని నేతలకు బై బై చెప్పి, ఇక చర్చలు అనవసరమని ట్రంప్ బయటికొచ్చేశారు. ఇలాంటి మీటింగ్‌లతో టైం వేస్ట్‌అంటూ ట్వీట్‌చేశారు. ఈ విషయంలో ఇకపై చర్చలు జరిపేదిలేదని తేల్చిచెప్పారు. దీనిపై డెమోక్రాట్లు మండిపడ్డారు. ప్రజలను ఇబ్బంది పెట్టడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, 'దేశానికి మంచి చేద్దామని నేను ప్రయత్నిస్తున్నాను. అన్నింటినీ రాజకీయం చేయడం సరికాదు' అంటూ డెమోక్రాట్లకు ట్రంప్‌హితవు పలికారంటూ వైట్‌హౌజ్ వర్గాలు వెల్లడించాయి. బోర్డర్‌వాల్ విషయంలో ముందుకే వెళ్లాలనుకుంటే ట్రంప్‌దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించే అవకాశం ఉందని, దాంతో రక్షణ శాఖ నిధులను దీనికి ఖర్చు పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఇది వివాదాస్పదంగా మారడంతో పాటు సుదీర్ఘ న్యాయ పోరాటానికీ దారితీయొచ్చని అంటున్నారు.

డెమోక్రాట్లు ఏమంటున్నారు?

బోర్డర్ వాల్ విషయంలో మెజారిటీ అమెరికన్లు తమవెంటే ఉన్నారని డెమోక్రాట్లు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన ఒపీనియన్‌పోల్ లో 51 శాతం అమెరికన్లు ప్రెసిడెంట్‌ట్రంప్ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారని వెల్లడైందని చెప్పారు. నిధుల విడుదలకు ఒప్పుకునేది లేదని తేల్చిచెబుతున్నారు. 77 శాతం రిపబ్లికన్ ఓటర్లు ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తున్న విషయాన్ని వారు పట్టించుకోవడంలేదు.

ప్రభావం ఎలా ఉంది..?

ప్రభుత్వంలోని 25 శాతం డిపార్ట్‌మెంట్లపై షట్ డౌన్ ప్రభావం పడింది. ఎనిమిది లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు జీతాలు నిలిచిపోయాయి. ఇందులో మూడున్నర లక్షల మంది ఉద్యోగులు ఇళ్లకే పరిమితమయ్యారు. మిగతా వాళ్లు జీతాల్లేకుండా పనిచేయాల్సి వస్తోంది. ఈ పీరియడ్ కు తర్వాత జీతాలు ఇస్తారో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ఒప్పుకుంటే తప్ప షట్ డౌన్ పీరియడ్‌కు ప్రభుత్వం జీతాలివ్వదు. మరోవైపు జీతాలందక ఉద్యోగులు నానా తిప్పలు పడుతున్నారు. కొందరు వేరే ఉద్యోగాలు చూసుకుంటుండగా, ఇంకొందరు సేవింగ్స్‌తో నెట్టుకొస్తున్నారు. మరికొందరు ఉద్యోగులు ప్రభుత్వం నిరుద్యోగులకు అందించే బెనిఫిట్స్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు.



- షట్ డౌన్ చర్చలకు బై బై
- ఇలాంటి మీటింగ్‌లతో టైంవేస్ట్: ప్రెసిడెంట్ ట్రంప్
- డెమోక్రాట్లతో అర్ధాంతరంగా ముగిసిన భేటీ

అసలేం జరిగింది?

మెక్సికో బోర్డర్ లో అక్రమ వలసలను అడ్డుకునేందుకు గోడ కట్టాలని ట్రంప్ సర్కారు ప్రతిపాదించింది. దీనికోసం 5.7 బిలియన్ డాలర్లు కేటాయించాలని స్పెండింగ్‌బిల్లులో ప్రతిపాదించింది. దీనిని డెమోక్రాట్లు వ్యతిరేకించారు. గోడ కట్టాల్సిన అవసరంలేదని, ప్రభుత్వ సొమ్మును వృథా చేయొద్దంటూ బిల్లును అడ్డుకున్నారు. దీంతో నిధులు విడుదల కాక, ప్రభుత్వం ఆర్థికంగా స్తంభించిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఈ పరిస్థితిని తప్పించేందుకు డెమోక్రాట్లతో ట్రంప్‌బుధవారం సమావేశమయ్యారు. నిధుల విడుదలకు వారు ఒప్పుకోకపోవడంతో చర్చలు అసంపూర్తిగా ముగిసాయి.

యూఎస్ - మెక్సికో బోర్డర్ కంచె





బృందావనపురం గ్రామం

20 ఇండ్లు.. 96 ఓట్లు

- రాష్ట్రంలోనే రెండో చిన్న పంచాయతీ బృందావనపురం
- 1980లో ఏర్పాటు

మిర్యాలగూడ, వెలుగు: బృందావనపురం.. నాగార్జునసాగర్ నియోజకవర్గం త్రిపురారం మండలంలోని ఈ గ్రామం రాష్ట్రంలోనే రెండో అతి చిన్న పంచాయతీగా పేరుగాంచింది. ఈ గ్రామ జనాభా 130 మంది కాగా 96 ఓట్లు, 20 ఇండ్లు, నాలుగు వార్డులతో ఉంటుంది. గతంలో పెద్దదేవులపల్లి పరిధిలో ఉన్న ఈ గ్రామం 1980లో పంచాయతీగా ఏర్పాటైంది. గత పంచాయతీ ఎన్నికల సమయంలో 104 ఓట్లు ఉండగా జనరల్‌కు రిజర్వ్ అయింది. అప్పుడుమందడి ఉపేందర్‌రెడ్డి అనే వ్యక్తి 8 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుతం ఈ గ్రామాన్ని జనరల్ మహిళకు కేటాయిచారు. గ్రామంలోని నాలుగు వార్డుల్లో రెండు జనరల్, మరో రెండు జనరల్ మహిళకు కేటాయించారు.

మూడు సార్లు ఒకే కుటుంబం

బృందావన పురం గ్రామ పంచాయతీ 2001లో ఎస్టీకి రిజర్వ్ అయింది. కానీ ఇక్కడ ఆ వర్గం ఓటర్లు లేకపోవడం ఉపసర్పంచ్ మందడి రమణారెడ్డి ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా వ్యవహరించారు. 2006లో జనరల్ మహిళకు రిజర్వ్ కాగా మందడి ప్రవీణారెడ్డి, 2013లో జనరల్‌కు కేటాయంచగా మందడి ఉపేందర్‌రెడ్డి సర్పంచ్‌గా గెలిచారు. వీరంతా ఒకే కుటుంబ సభ్యులు కావడం విశేషం. తాజాగా జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయాలి : వంగాల శ్రీనివాసరెడ్డి

మా గ్రామం రాష్ట్రంలోనే రెండో అతి చిన్న గ్రామ పంచాయతీగా పేరుపొందింది. ఈ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి. ప్రత్యేకత సాధించిన ఈ పంచాయతీలో వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.



స్కూళ్లలో పేరిణి నృత్యం

- సిలబస్‌గా చేర్చేందుకు యత్నాలు
- 6 నుంచి 10వ తరగతి స్టూడెంట్స్‌కు అందుబాటులోకి..
- ఇప్పటికే డ్యాన్స్ కాలేజీల్లో సర్టిఫికెట్ కోర్సు
- కాకతీయులనాటి కళకు పెరుగుతున్న ప్రాచుర్యం

వరంగల్, వెలుగు:

కాకతీయుల నృత్యం పేరిణికి పట్టం కట్టేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. భావి తరాలకు ఈ నృత్యాన్ని పదిలంగా అందించేందుకు సిలబస్ రూపొందించే పని ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే ఇది సర్టిఫికెట్ కోర్సుగా అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు ఇక స్కూళ్లలోకి అడుగు పెట్టనుంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పేరిణి నృత్యాన్ని క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ విభాగంలో అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్న గురుకుల పాఠశాలల్లో దీన్ని చేర్చే దిశగా కసరత్తు సాగుతోంది. ఇటీవల సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని స్కూళ్ల విద్యార్థుల శిక్షణ ఇచ్చి 150 మందితో గచ్చిబౌలిలో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

సిలబస్‌లో ఏమంటాయి?

కాకతీయు కాలంలో యుద్ధ వీరులకు ఉత్సాహం నింపేందుకు పేరిణి తాండవం చేసేవారని చెబుతారు. పేరిణి నృత్య రీతులకు సంబంధించిన సమాచారాన్ని జయపసేనాని నృత్య రత్నావళి పేరుతో సంస్కృతంలో పుస్తకం రాశారు. ఇటీవల దాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించారు. ఈ నృత్యానికి సంబంధించిన అనేక శిల్పాలు రామప్ప ఆలయంలో నేటికీ ఉన్నాయి. వాటి ఆధారంగా నటరాజ రామకృష్ణ పేరిణి నృత్యరీతులకు తిరిగి ప్రాణం పోశారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ప్రభుత్వం 2016 లో పేరిణిపై సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులకు నృత్య కాలేజీల్లో శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని మూడింటితోపాటు వరంగల్, నిజామాబాద్, మంథనిలోని సంగీత, నృత్య కళాశాలలో పేరిణి నృత్యాన్ని చేర్చారు. నాలుగేళ్ల సర్టిఫికెట్, రెండేళ్ల డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. తొలి బ్యాచ్‌లో సుమారు 500 మంది రెండేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్నారు. నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సులో పేరిణికి సంబంధించి ప్రాథమిక అంశాలు, గణపతి గద్దె, మేళ ప్రాప్తి, సంధ్యాతాండవం, బ్రహ్మగద్దె వంటి వాటిని సిలబస్‌లో పొందుపరచాలని భావిస్తున్నారు.



పాఠశాల స్థాయిలో చేరిస్తే మంచిదే

పాఠశాల స్థాయిలో పేరిణి నృత్యాన్ని సిలబస్‌గా చేర్చడం మంచిదే. మన ప్రాచీన కళను భావి తరాలవారికి అందివ్వొచ్చు. యుద్ధ వీరులకు సంబంధించిన పేరిణి నృత్య రీతుల వల్ల విద్యార్థులకు ఆరోగ్యపరంగా కూడా మేలు జరుగుతుంది.

పేరిణి రాజ్‌కుమార్, కళాకారుడు



కోతుల్నెళ్లగొడ్తే.. సర్పంచ్‌గిరి

సిద్దిపేట/ కరీంనగర్, వెలుగు :పరపతి, పైసలు ఉంటే సర్పంచు కావొచ్చని అందరనుకుంటరు. కానీ, కోతులను వెళ్లగొట్టే ధైర్యం ఉంటేనే సర్పంచును చేస్తామంటున్నరు ఆ గ్రామస్తులు. ఇంకేమున్నది.. పోటీకి తయారైన ఇద్దరూ ఊళ్లో కోతులను పట్టి అడవిలో ఇడిసిపెడుతున్నరు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వింజపల్లిలో పంచాయతీ ఎన్నికలు కోతుల బెడదకు చెక్ పెట్టాయి. గ్రామంలో తీవ్రంగా ఉన్న కోతుల బెడద లేకుండా చూస్తామని సర్పంచ్ స్థానానికి పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులు తిరుపతిరెడ్డి, రమేశ్‌హామీ ఇచ్చారు. ముందు కోతులు లేకుండా చేయండి.. ఆతర్వాతే ఓట్లేస్తామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. దాంతో వారిద్దరు ప్రచారం మాని కోతులను పనిలో పడ్డారు. ఆటోకు ప్రత్యేకంగా జాలీని ఏర్పాటు చేసి అందులో కోతుల కోసం పండ్లు కూరగాయలు పెట్టి అవి రాగానే బంధిస్తున్నారు. పట్టుకున్న కోతుల్ని అడవిలో వదిలిపెడుతున్నారు.

కోతుల బెడదను తీరుస్తా..

గన్నేరువరం మండలంలోని మదాపుర్‌లోనూ పంచాయతీ ఎన్నికల్లో కోతుల బెడదే ప్రధానాంశం. ఊళ్లో కోతుల సమస్య తీరుస్తానని హామీ ఇస్తున్నాడు మాజీ సర్పంచు మడుగుల రవీందర్ రెడ్డి. ఎస్సీ జనరల్ అయిన ఇక్కడ తాను చెప్పిన వ్యక్తిని ఎన్నుకుంటే కోతుల బెడదలేకుండా చూస్తానని ప్రచారం చేస్తున్నాడు. మాదాపూర్‌లో పంటలను కోతులు నాశనం చేస్తున్నాయి. ఇదే ఇప్పుడు ఆ ఊరి సమస్యగా మారింది. దీన్నే ప్రధాన ఏజెండాగా రవీందర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నాడు.

ఓవరాల్ చాంపియన్ భద్రాచలం

- రెండో స్థానంలో ఉట్నూరు
- ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు




భద్రాచలం, వెలుగు : స్వరాష్ట్రంలో తొలిసారి భద్రాచలం వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో ఓవరాల్ చాంపియన్‌గా భద్రాచలం జోన్ నిలవగా, రెండో స్థానంలో ఉట్నూరు జోన్ నిలిచింది. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగిన ఈ క్రీడోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఐటీడీఏ పీవో పమేలా సత్పథి, డీడీ రామ్మూర్తిల విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అండర్ 17 బాయ్స్, గర్ల్స్ ఓవరాల్ చాంపియన్‌గా భద్రాచలం, ద్వితీయ స్థానంలో ఉట్నూరు 1, 2 జోన్లు నిలిచాయి. అండర్ 14 బాయ్స్, గర్ల్స్ ఓవరాల్ చాంపియన్లుగా భద్రాచలం, ఉట్నూరు 1, 2 జోన్లు నిలిచాయి. ఆర్చరీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్, కబడ్డీ, క్యారమ్స్ తదితర 8 క్రీడల్లో పోటీలు జరిగాయి. మొత్తం ఆరు జోన్లుగా విభజించి ఆటల పోటీలు నిర్వహించగా 1416 మంది క్రీడాకారులు రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి వచ్చారు. పగలు ఆటల పోటీలు, రాత్రి ఆయా గిరిజన ప్రాంతాల సంస్కృతి ప్రతిబింబించేలా ఆటాపాటలతో ఆకట్టుకున్నారు.

నిందలు కాదు.. ఆత్మ విమర్శ చేసుకోండి

తుమ్మలకు పరోక్షంగా ఎంపీ కౌంటర్

ఖమ్మం, వెలుగు : అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ ఓటమిపై వస్తున్న విమర్శల గురించి ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తొలిసారి నోరువిప్పారు. తనపై వస్తున్న విమర్శలకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో తొమ్మిది చోట్ల పార్టీ అభ్యర్థి ఓడిపోవడం బాధాకరమని



పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జరిగిన పొరపాట్లకు ఆత్మ విమర్శ చేసుకోవాలి తప్ప బహిరంగ వేదికల మీద నిందలు మోపుకోవడం అనుభవం ఉన్న రాజకీయ నేతలు చేసేది కాదన్నారు. నిందలు మోపడానికి ముందు ఎవరికి వారు పార్టీ కోసం ఏం చేశారు? నియోజకవర్గ ప్రజలకు ఎంత వరకు అందుబాటులో ఉన్నారు? అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలని పొంగులేటి సూచించారు. జిల్లాలో ఓటమిని సీఎం చాలా లోతుగా ఎంక్వైరీ చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరుగుతున్న పనులు కొనసాగేలా సీఎం కేసీఆర్ అన్ని చర్యలు తీసుకుంటున్నారని పొంగులేటి అన్నారు.

అక్కడ ఆమే రాణి



కలిసొచ్చిన రిజర్వేషన్ | పోటీలేకుండా సర్పంచ్ కాబోతున్న రుద్రజారాణి | ఊరి మొత్తంలో ఒక్కటే ఎస్టీ కుటుంబం

రాష్ట్రంలో ఎక్కడ చూసినా సర్పంచ్ ఎన్నికల సందడి. ఏ ఇద్దరు కలిసినా అదే ముచ్చట. పోటీ చేసే వారు కొందరైతే, తెరవెనుక ఉండి నడిపించేవారు ఇంకొందరు. పార్టీల మద్దతు కోసం తిరిగి అలిసిపోయి, ఇండిపెండెంట్ గా పోటీ చేసే వారు మరికొందరు. కానీ ఇలాంటివేమీ లేకుండా, అదృష్టం కలిసొచ్చి కూర్చున్న చోట నుంచి కదలకుండా పదవులను దక్కించుకునే వారు ఒకరిద్దరే ఉంటారు. అలాంటి వారిలో ఒకరే రుద్రజారాణి.

ఖమ్మం, వెలుగు:

సత్తుపల్లి నియోజకవర్గంలోని రుద్రజారాణికి రిజర్వేషన్ కలిసొచ్చింది. ఇంటి నుంచి అడుగుకూడా బయటపెట్టకుండా, పైసాఖర్చు లేకుండా ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నిక కాబోతోంది. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎస్టీకి రిజర్వ్ కాగా, ఆ ఊరిలో ప్రస్తుతం ఉన్న ఏకైక ఎస్టీ కుటుంబం ఆమెదే. ఇంట్లో ఉన్న అమ్మ, అన్న ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండడంతో, 22 ఏళ్లకే సర్పంచ్‌గా రుద్రజా రాణి అవకాశం దక్కించుకుంది.

ఆమెది పెనుబల్లి మండలం గౌరారం. ఆమె తండ్రి పాక వెంకటేశ్వర్ రావు వీఆర్వోగా పనిచేస్తూ ఏడాది క్రితం చనిపోయారు. అన్న రాణా వీఆర్వోగా ఉద్యోగం దక్కించుకోగా, తల్లి సుజాత ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ గా పనిచేస్తున్నారు. సుజాతను సర్పంచ్ గా పోటీ చేయించేందుకు చంద్రుగొండ మండలం గురవాయిగూడెం నుంచి వచ్చి గౌరారం గ్రామంలో వెంకటేశ్వర్‌రావు స్థిరపడ్డారు. అప్పుడు పరిస్థితులు కుదరకపోవడంతో విరమించుకున్నారు. ప్రస్తుతం గౌరారం గ్రామ పంచాయితీ రెండుగా విడిపోయి మరో గ్రామ పంచాయితీ పార్థసారధి పురం కొత్తగా ఏర్పడింది. గౌరారం సర్పంచ్ ఎస్టీకి రిజర్వ్ కాగా, ఆ గ్రామంలో మిగిలిన ఎస్టీ కుటుంబాలన్నీ పార్థసారధి పురంలో కలవగా, ఊరిలో వీరి కుటుంబం మాత్రమే ఉండడం కలిసివచ్చింది. దీంతో తండ్రి లేకపోయినా, ఆయన కల నెరవేరిందంటూ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండో దశ ఎన్నికల్లో ఈ నెల 25న ఇక్కడ పోలింగ్ జరగబోతోంది. అయినా ఇప్పటికే సర్పంచ్ గా రుద్రజా రాణి ఎన్నిక ఖాయమైంది. ప్రస్తుతం ఆమె డిగ్రీ పూర్తిచేసి బీఈడీ చదువుతోంది. రిజర్వేషన్ కలిసి వచ్చి రుద్రజను గౌరారానికి 'రాణి'గా నిలబెడుతోంది.



చదువుకుంటూనే గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

అమ్మను సర్పంచ్‌గా చూడాలని నాన్న చాలా కలగన్నారు. కానీ అప్పట్లో వీలు కాలేదు. ఇప్పుడు రిజర్వేషన్ కలిసి రావడంతో నేను సర్పంచ్ కాబోతున్నా. నాన్న కోరిక ఇలాగైనా తీరుతున్నందుకు చాలా ఆనందం ఉంది. ప్రస్తుతం నేను బీఈడీ చదువుతున్నా. నా చదువు కొనసాగిస్తూనే గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తా. గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారుల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తా. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యాల వారీగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా.

రుద్రజా రాణి



సంతోషంగా ఉంది

రిజర్వేషన్ కలిసి రావడంతో ఎన్నికలు లేకుండానే చెల్లి సర్పంచ్ అవుతుండడం ఆనందంగా ఉంది. అన్ని విషయాల్లో చెల్లికి అండగా ఉంటా. గతంలో సర్పంచ్‌లుగా పనిచేసిన వాళ్లు, ఇతర పెద్దలను సంప్రదించి అన్ని విషయాల్లో కలిసి పనిచేస్తాం.


రాణా, రుద్రజా రాణి అన్న



సిద్దిపేటలో ఆటల సంబురం

- రేపటి నుంచి నేషనల్‌హ్యాండ్‌బాల్ పోటీలు
- ముస్తాభవుతున్న డిగ్రీ కాలేజీ గ్రౌండ్
- 29 రాష్ట్రాల నుంచి రానున్న క్రీడాకారులు
- ఐదు రోజుల పాటు నిర్వహణ

సిద్దిపేట, వెలుగు: సిద్దిపేట మరోసారి జాతీయ క్రీడలకు వేదిక కానుంది. గత ఏడాదిలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పోటీలను సిద్దిపేటలో నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు సిద్దిపేట డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో 64వ నేషనల్‌స్కూల్ గేమ్స్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ అండర్ 17 బాలబాలికల జాతీయ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. 28 రాష్ట్రాలకు చెందిన బాలుర జట్లు, 24 రాష్ట్రాలకు చెందిన బాలికల జట్లు పాల్గొంటాయి. ఈ పోటీల నిర్వహణలో క్రీడాకారులు, కోచ్‌లు, వివిధ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది ఈ క్రీడా సంబరంలో పాల్గొంటారు. 120 మంది కోచ్‌లు, మేనేజర్లు, 435 మంది క్రీడాకారులు, 355 మంది క్రీడాకారిణులతో పాటు మరో 130 మంది అధికారులు పాల్గొంటారు. ఈ పోటీలకు సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానాన్ని అధికారులు సిద్ధం చేస్తుండ్రు. ఈ గ్రౌండ్‌లో మూడు కోర్టులను ఏర్పాటు చేసి పోటీలను నిర్వహించనున్నారు. ఉదయం రాత్రి వేళల్లో పోటీలు నిర్వహించేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు పది నుంచి పదిహేను పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్‌లు పాల్గొంటారు. వివిధ రాష్ట్రాల నుంచి పోటీల్లో పాల్గొనడానికి వస్తున్న క్రీడాకారులకు, అధికారులకు, నిర్వాహకులు ప్రత్యేకంగా భోజన వసతి, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. బాలికలకు ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లిలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల్లో, బాలురకు వికాస్ హైస్కూల్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్లలో వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. క్రీడాకారులను మైదానానికి చేర్చడానికి ప్రత్యేకంగా



రవాణా సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రీడలను విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ పలుసార్లు సమావేశాలు నిర్వహించి అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఇప్పటి వరకు 6 రాష్ట్రాల క్రీడాకారులు 207 మంది వచ్చారు. శుక్రవారం రాత్రి వరకే అన్ని రాష్ట్రాల క్రీడాకారులు సిద్దిపేటకు చేరుకోనున్నరు. పట్టణంలోని పాత బస్టాండు, కొత్త బస్టాండుల్లో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. రానున్న ఐదు రోజుల పాటు సిద్దిపేట క్రీడాకారులతో సందడిగా మారనున్నది.

స్వైన్‌ఫ్లూతో మాజీ సర్పంచ్ మృతి

వరంగల్ అర్బన్, వెలుగు: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేట మాజీ సర్పంచ్ బక్కెర రాజీరు (57) స్వైన్‌ఫ్లూతో గురువారం చనిపోయారు. అనారోగ్యంతో ఉన్న రాజీరును గురువారం ఉదయం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. స్వైన్‌ఫ్లూ సోకినట్టు డాక్టర్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు.



సాయి గుడిలోకి వింత పక్షి

యాదాద్రి, వెలుగు: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని సాయిబాబా దేవాలయంలోకి గురువారం ఓ వింత పక్షి వచ్చింది. గమనించిన పూజారులు సాయిబాబాకి ఇష్టమైన గురువారం ఈ పక్షి వచ్చిందని, దీనిని గరుడ పక్షిగా పేర్కొంటూప్రత్యేక పూజలు నిర్వహించారు. పక్షిని చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాగా అది గరుడ పక్షి కాదని అటవీశాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

యాదాద్రి, వెలుగు: ప్రభుత్వం ఆటలకు ప్రోత్సాహం ఇస్తోందని కలెక్టర్ అనితారామచంద్రన్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం రాష్ట్ర స్థాయి ఖోఖో ఛాంపియన్ పోటీలను ఆమె ప్రారంభించారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి మొత్తం 240 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.

చిన్నారి మైథిలి నవ్వింది

యువ జంట మమత, నర్సింగరావులకు మూడేళ్ల కిందట పాపాయి పుట్టింది. ఎంతో సంబరపడ్డారిద్దరూ. కానీ ఆ సంతోషాన్ని ఆవిరి చేస్తూ ఏడు రోజుల్లోనే చిన్నారికి ఫిట్స్ వచ్చాయి. తొమ్మిదో రోజు కోమా, 12వ రోజు పాప మృతి. ఆ జంటకు ఐదు నెలల కిందట మరో పాప పుట్టింది. మళ్లీ అదే పరిస్థితి. ఏడో రోజున ఫిట్స్ వచ్చాయి. ఆస్పత్రికి తీసుకెళ్తే జెనెటికల్ ప్రాబ్లమ్ అన్నారు డాక్టర్లు. కాలేయ మార్పిడి చేయాలన్నారు. 15 వేలు సంపాదించే అతను.. 20 లక్షలకు పైగా ఎక్కడి నుంచి తీసుకురాగలడు. కానీ స్వచ్ఛంద సంస్థలు సాయం చేశాయి. మనసున్న మారాజులెందరో ముందుకు వచ్చారు. సర్జరీకి అవసరమైన డబ్బును సమకూర్చారు. ఆ కష్టం వృథాగా పోకుండా వైద్యులు ఓ చెయ్యి వేశారు.10 గంటలపాటు శ్రమించి పాపాయికి శస్త్ర చికిత్స పూర్తి చేశారు. ఇప్పుడు చిన్నారి మైథిలి నవ్వుతోంది. తల్లిదండ్రుల ముఖాల్లో నవ్వులు పూయిస్తోంది.

హైదరాబాద్, వెలుగు:

హైదరాబాద్లోని లక్డీకపూల్ గ్లోబల్ హాస్పిటల్ డాక్టర్లు మైథిలి అనే ఐదు నెలల చిన్నారికి అరుదైన లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేశారు. 'మేపిల్ సిరప్ యూరిన్ డిసీజ్'తో బాధపడుతున్న పాపాయికి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశామని డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మేనరికపు పెళ్లిళ్లు, ఇతర జెనెటికల్ కారణాలతో పుట్టిన బిడ్డల్లో ఈ వ్యాధి వస్తుందని చెప్పారు. మోనో సెగ్మెంట్ సర్జరీ (కాలేయంలో చిన్న ముక్కను కత్తెరించి పెట్టడం) ద్వారా తల్లి నుంచి కాలేయ మార్పిడి చేసినట్లు వెల్లడించారు. ఐదుగురు వైద్యులు కలిసి సర్జరీ పూర్తి చేశామని చెప్పారు. లక్షల్లో ఒకరికి ఈ సమస్య వస్తుందని, తెలుగు రాష్ట్రాల్లో ఐదు నెలల పాపకు ఇలాంటి సర్జరీ చేయడం ఇదే తొలిసారని తెలిపారు.

పుట్టిన ఏడో రోజే..

"నా మేనకోడలు మమతను పెళ్లి చేసుకున్నా. మూడేళ్ల క్రితం మాకు పాప పుట్టింది. పుట్టిన ఏడో రోజే పాపకు ఫిట్స్ వచ్చాయి. తొమ్మిదో రోజు కోమాలోకి వెళ్లిపోయింది. 12వ రోజు చనిపోయింది. రెండో పాప పుట్టాక కూడా సేమ్ ఏడో రోజు ఫిట్స్ వచ్చాయి. తర్వాత కోమాలోకి వెళ్లిపోయింది. వెంటనే రెయిన్ బో హాస్పిటల్కు తీసుకెళ్లాం. మేనరికపు వివాహం వల్ల పాపకు జెనెటికల్ ప్రాబ్లమ్ వచ్చిందని డాక్టర్లు చెప్పారు. కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేస్తే పాప బతుకుతుందంటూ గ్లోబల్ హాస్పిటల్కు పంపారు"





- గ్లోబల్ ఆస్పత్రిలో అరుదైన సర్జరీ
- 5 నెలల పాపాయికి కాలేయ మార్పిడి
- 10 గంటలు శ్రమించి శస్త్ర చికిత్స
- మేనరికపు పెళ్లి వల్లే పాపకు జెనెటికల్ ప్రాబ్లమ్

అని మైథిలి తండ్రి నర్సింగరావు చెప్పారు.

మత్తు ఇచ్చి పడుకోబెట్టేవారు..

"నేను ప్రింటింగ్ ప్రెస్లో పని చేస్తా. నెలకు రూ.15 వేల వరకు వస్తుంది. 20 లక్షలకుపైనే ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. పసిగుడ్డుకు ఎలా ఆపరేషన్ చేయించాలో అర్థం కాలేదు. నెలలు గడుస్తున్నాయి. పాప కృత్రిమ శ్వాస మీదే ఉంది. శరీరం నీలంగా మారిపోయింది. ఏడుస్తూ ఉండేది. రోజూ ఫిట్స్ వచ్చేవి. మత్తు ఇచ్చి పడుకోబెట్టేవారు. తల్లిదీ పాపదీ ఓ పాజిటివ్ రక్తమే కావడంతో నా భార్య మమత లివర్ ఇచ్చింది. స్వచ్ఛంద సంస్థ 'మిలాప్', మీడియా ప్రచారం, ఫ్రెండ్స్, ఇతర సంస్థలు, దాతలు ఆర్థిక సాయం చేశారు. ఎన్నో సమస్యల తర్వాత పాపకు విజయవంతంగా సర్జరీ పూర్తి చేశారు. ఇప్పుడే కంటి నిండా నిద్రపోతున్నాం. పాప మమ్మల్ని ఇప్పుడిప్పుడే గుర్తుపడుతోంది" అని నర్సింగరావు వివరించారు.



ఈఎన్టీ, దంతపరీక్షల కోసం తాత్కాలిక సిబ్బంది

- వేల సంఖ్యలో తీసుకోనున్న వైద్య ఆరోగ్య శాఖ
- మరో మూడు జిల్లాల్లో రెండో విడత పైలెట్ ప్రాజెక్ట్

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రవ్యాప్తంగా ఈఎన్టీ, దంత పరీక్షల కోసం వేల సంఖ్యలో తాత్కాలిక సిబ్బందిని నియమించుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ప్రభుత్వ ఈఎన్టీ వైద్యులు 50, దంత వైద్యులు 200 మంది మాత్రమే ఉన్నారని, 12 వేలకుపైగా ఉన్న గ్రామ పంచాయతీల్లో చేపట్టే ఈ కార్యక్రమానికి భారీగా సిబ్బంది అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. దీనికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందిని నియమించుకోవాలని వైద్యఆరోగ్యశాఖకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కార్యక్రమం పూర్తయ్యేవరకు సేవలు అందించేలా తాత్కాలిక సిబ్బందితో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో 2 వేల మంది ఈఎన్టీ వైద్యులు ఉన్నందున, జనరల్ మెడిసిన్ వాళ్లనూ పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దంత వైద్యులు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నట్లు వైద్యఆరోగ్యశాఖ వర్గాలు చెప్పాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ కార్యక్రమం మొదలు పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నందున త్వరగా నియామకం పూర్తి చేసి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో తొలి పైలెట్ ప్రాజెక్టు పూర్తయ్యిందని, హైదరాబాద్, భువనగిరి, జనగాం జిల్లాల్లో రెండో విడత పైలెట్ ప్రాజెక్టు కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు.

పంచాయతీలోనూ ప్రలోభాలే

రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీలో నిఘా వేదిక ప్రతినిధులు

హైదరాబాద్, వెలుగు:

పంచాయతీ ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎక్కువగా ఉందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వీ నాగిరెడ్డికి ఎన్నికల నిఘా వేదిక ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. పార్టీలకు సంబంధం లేకుండా జరుగుతున్న ఎన్నికల్లో డబ్బుతో ప్రలోభ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

గురువారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆఫీసులో నిర్వహించిన సమావేశంలో క్షేత్రస్థాయి పరిస్థితులను వారు వివరించారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు జరిగిన కొన్ని ఉదంతాలనూ ప్రస్తావించారు. దాదాపు 30 స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఎన్నికల నిఘా వేదికను ఏర్పాటు చేశామని, పంచాయతీ ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై వారిలో చైతన్యం పెంచుతామన్నారు. సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తే రూ.15 లక్షలు ఇస్తామంటూ ఎమ్మెల్యేలు ప్రకటించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. డబ్బులకు ఆశపడి ఏకగ్రీవాలకు ఒప్పుకోకుండా జనాన్ని చైతన్యం చేస్తామన్నారు.

ఫసల్ బీమాలో భారీ కుంభకోణం

- కాంగ్రెస్ కిసాన్ సెల్ ఆరోపణ

హైదరాబాద్, వెలుగు:

ఫసల్ బీమా యోజనలో భారీ కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ ఆరోపించింది. గురువారం గాంధీ భవన్లో కిసాన్ సెల్ రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ ఫసల్ బీమా యోజనలో లక్షా 25 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. ప్రీమియం పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి తగిన పరిహారం ఇవ్వలేదని, అందువల్ల ఇది కుంభకోణమేనని ఆరోపించారు. దేశంలో రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. తెలంగాణలోనూ అందుకు భిన్నంగా ఏమీలేదని, వెంటనే రుణమాఫీ చేసి తిరిగి రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కల్తీ జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

'విద్య, ఉద్యోగాల్లో ముస్లింలు వెనుకబడ్డరు'

- సామాజిక పరిస్థితుల అధ్యయన కమిషన్ చైర్మన్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రవ్యాప్తంగా విద్య, ఉద్యోగాల్లో ముస్లింలు వెనుకబాటుకు గురయ్యారని ముస్లింల విద్య, ఆర్థిక, సామాజిక పరిస్థితుల అధ్యయన కమిషన్ చైర్మన్ సుధీర్ అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో 'మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి' అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు కమిషన్ సభ్యులు, ప్రొఫెసర్లు మాట్లాడారు. ముస్లింల అభివృద్ధికి చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై గతంలోనే సచార్, కుందూ కమిటీలు సూచనలు చేశాయని కమిషన్ చైర్మన్ అన్నారు. కమిషన్ సభ్యులు ఎంఏ బారి, ప్రొఫెసర్లు అమీర్ అలీ ఖాన్, అబ్దుల్ షాబాన్, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ బీపీ ఆచార్య ఈ సదస్సులో పాల్గొన్నారు.



నష్టాలు తగ్గించేందుకు కమిటీ

- వారంలోగా హైదరాబాద్లో 40 ఎలక్ట్రిక్ బస్సులు
- మెట్రో రైలు రూట్లలో బస్సుల సంఖ్య తగ్గిస్తాం
- కొత్తగా వెయ్యి బస్సులు కొంటాం: ఆర్టీసీ ఇన్చార్జి ఎండీ

హైదరాబాద్, వెలుగు:

ఆర్టీసీలో నష్టాలను తగ్గించేందుకు కమిటీ వేస్తామని సంస్థ ఇన్చార్జి ఎండీ సునీల్కుమార్ శర్మ చెప్పారు. గురువారం హైదరాబాద్ లోని బస్ భవన్ లో ఆయన హెచ్ వోడీలతో సమీక్షించారు. త్వరలో వెయ్యి కొత్త బస్సులను కొనుగోలు చేస్తామన్నారు. తక్కువ చార్జీలతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు. వాణిజ్యపరంగా ఆర్టీసీకి 2.5 శాతం ఆదాయం మాత్రమే వస్తోందని, దీన్ని 10శాతానికి పెంచుతామన్నారు. ఖాళీ స్థలాల్లో మల్టీ ప్లెక్స్ ల నిర్మాణం వేగవంతం చేస్తామని చెప్పారు. కొన్ని రూట్లలో బస్సులు నడపడం వల్ల నష్టాలు వస్తున్నాయన్నారు. 15 రోజుల్లో ఆర్ఎం, డీఎంలతో మరో సమీక్ష నిర్వహిస్తా నని చెప్పారు. బస్పాస్ల పై విద్యార్థులు, ఉద్యోగులకు అవగాహన కల్పించి ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. వారంలోగా హైదరాబాద్లో 40 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తామని ప్రకటించారు. హైదరాబాద్ లో మరో వంద బస్సులను అందుబాటులోకి తెస్తామన్నారు. మెట్రో రైలు రూట్లలో బస్సుల సంఖ్యను కుదిస్తామన్నారు. మెట్రో రైలు, ఆర్టీసీ, ఎంఎంటీఎస్ ఉమ్మడి పాస్ పై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మన గురుకులాలు భేష్

మెచ్చుకున్న పాండిచ్చేరి మంత్రులు • గౌలిదొడ్డి గురుకులం సందర్శన

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్ర గురుకుల పాఠశాలలు బాగున్నాయని పాండిచ్చేరి మంత్రులు కితాబిచ్చారు. ఆ రాష్ట్ర విద్య, సంక్షేమ శాఖల మంత్రులు ఆర్ కమలాకరన్, కందస్వామి గౌలిదొడ్డి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ను గురువారం సందర్శించారు. రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ గురుకులాల గురించి వారికి వివరించారు. కేజీ టు పీజీ ఉచిత విద్యలో భాగంగా ఎక్కువ సంఖ్యలో గురుకులాలు సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. మిర్రర్ ప్రాజెక్ట్, సమ్మర్ సమురాయి క్యాంపులు, వాయిస్ ఫర్ గర్ల్స్, ఇంగ్లిష్ ప్లస్ క్లబ్స్, ఆపరేషన్ బ్లూ క్రిస్టల్ గురించి విద్యార్థులు మంత్రులకు వివరించారు. వారి కమ్యూనికేషన్ స్కిల్స్ను మెచ్చుకున్న మంత్రులు తెలంగాణ గురుకులాల స్ఫూర్తితో పాండిచ్చేరిలోనూ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.





వృద్ధ దంపతుల పెద్ద మనసు

- రూ. కోటితో వృద్ధాశ్రమాన్ని కట్టించి ప్రభుత్వానికి ఇచ్చేందుకు నిర్ణయం
- సర్కారు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్న కేటీఆర్

హైదరాబాద్, వెలుగు :

వృద్ధ దంపతులు పెద్ద మనసు చాటుకున్నారు. కోటి రూపాయలతో నిర్మించిన వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వానికి ఇవ్వడానికి ముందుకొచ్చారు. మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామం. వారికున్న ఎకరంన్నర భూమిలో సొంత ఖర్చులతో 6 వేల చదరపు అడుగుల భవనాన్ని వృద్ధాశ్రమం కోసం నిర్మించారు.

అయితే దాన్ని ప్రస్తుతం తాము నిర్వహించలేమని, ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను కోరారు. గురువారం ఎమ్మెల్యే గొంగిడి సునీతతో కలిసి తెలంగాణ భవన్లో వారు కేటీఆర్ను కలిశారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో ఆశ్రమ నిర్వహణ తమకు సాధ్యం కావడం లేదని చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సేవలు కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కేటీఆర్ యాదాద్రి కలెక్టర్ అనితా రామచంద్రన్తో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థలాన్ని, భవనాన్ని ప్రభుత్వానికి అందించాలనే దంపతుల సేవా దృక్పథం ఎంతో గొప్పదని కొనియాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆశ్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేటీఆర్ను కలిసిన ఎంబీసీ సంఘం నాయకులు

జాతీయ ఎంబీసీ సంఘం అధ్యక్షుడు కేసీ కాలప్ప ఆధ్వర్యంలో సంఘం నాయకులు గురువారం తెలంగాణ భవన్లో కేటీఆర్ను కలిశారు. ఎంబీసీల సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని వినతిపత్రం అందజేశారు. సంచార జాతులతో పాటు మరికొన్ని కులాలను ఎంబీసీ జాబితాలో చేర్చాలని వారు కోరారు.

దేశంలోనే అగ్రగామిగ రాష్ట్ర విద్యుత్ సంస్థ

- జెన్కో, ట్రాన్స్కో సీఎండీ ప్రభాకర్ రావు

హైదరాబాద్, వెలుగు:

తెలంగాణ విద్యుత్ సంస్థ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని జెన్కో, ట్రాన్స్కో సీఎండీ ప్రభాకర్ రావు అన్నారు. గురువారం హైదరాబాద్లో పవర్ ఇంజనీర్ డైరీని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యుత్ రంగాన్ని వృద్ధిబాట పట్టించామని, డిమాండ్కు తగిన విధంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ట్రాన్స్కో, డిస్ట్రిబ్యూషన్ రంగంలో రూ.2,200 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ రంగాన్ని సీఎం కేసీఆర్ దారిలోకి తెచ్చారని పవర్ ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రావు అన్నారు. విద్యుత్ ఉద్యోగుల శ్రమను గుర్తించిన సీఎం కేసీఆర్ మంచి వేతన సవరణ ఇచ్చారన్నారు. అనంతరం 50 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న సీఎండీ ప్రభాకర్రావు 50 కేజీల భారీ కేక్ కట్ చేశారు. సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్రావు, జేఎండీ శ్రీనివాస్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సదానందం తదితరులు పాల్గొన్నారు.



50 కేజీల కేకును కట్ చేస్తున్న సీఎండీ ప్రభాకర్ రావు



మహిళా రిజర్వేషన్ల బిల్లూ ఇట్లే పాసవ్వాలి

- ఎంపీ కవిత ట్వీట్

న్యూఢిల్లీ: అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినంత వేగంగానే మహిళా రిజర్వేషన్ల బిల్లూ పాసైతే దేశం నిజంగా అభివృద్ధి సాధిస్తుందని ఎంపీ కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్లకు మరింత రాజకీయ సంకల్పం అవసరమని గురువారం ట్వీట్ చేశారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నేతలు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర బీజేపీ నేతలు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, ప్రకాశ్ జవదేకర్లను కలిశారు. వచ్చే బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలో వినతిపత్రాలు ఇచ్చారు. తర్వాత ఎంపీ బండారు దత్తాత్రేయ మీడియాతో మాట్లాడారు. కేంద్రంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు అవాస్తవమని, రాష్ట్రానికి కేంద్ర సాయంపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. మైనార్టీలు, ఎస్టీలకు రిజర్వేషన్ల పెంపుపై కేవలం తీర్మానాన్ని పంపి కేంద్రంపై నెపం నెడుతోందని, టీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

పర్యావరణ కార్యాచరణ కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, వెలుగు: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మార్గదర్శకాల ప్రకారం పర్యావరణ కార్యాచరణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్మిశ్రా అధ్యక్షతన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రెటరీ మెంబర్ కన్వీనర్గా ఆరుగురితో కమిటీ వేశారు. ఈ మేరకు సీఎస్ అజయ్మిశ్రా గురువారం జీవో జారీచేశారు.

నన్ను సస్పెండ్ చేసే అధికారం ఉత్తమ్కు లేదు

- ఉత్తమ్, కుంతియాపై ఏఐసీసీకి సర్వే ఫిర్యాదు

హైదరా బాద్, వెలుగు: పీసీసీ చీఫ్ ఉత్తమ్కుమార్రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి కుంతియా పార్టీకి శనిలా దాపురించారని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన సర్వే సత్యనారాయణ అన్నారు. ఏఐసీసీ సభ్యుడిగా ఉన్న తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం పీసీసీ చీఫ్కు లేదని మండిపడ్డారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ ఏకే ఆంటోనిని కలిసి ఫిర్యాదు చేసినట్లు మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి నష్టంచేసిన పీసీసీ అధ్యక్షుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. ఉత్తమ్ చర్యల వల్ల ఏపీ సీఎం చంద్రబాబు, టీజేఎస్ నేత కోదండరాం, సీపీఐ నేతలు అభాసుపాలయ్యారని సర్వే ఆరోపించారు.

మోడీపాలనలో అన్నివర్గాల పేదలకు న్యాయం

- బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్, వెలుగు: సమభావం, సమానత్వం మోదీ పాలనలో నిజమైందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎన్ ఇంద్రసేనారెడ్డి గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అన్నారు. ఈబీసీలకు రిజర్వేషన్ తీసుకువచ్చి సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదాన్ని మోడీ నిజం చేశారని కొనియాడారు. ఎన్డీయే ప్రభుత్వంలో అన్నివర్గాల పేదలకు న్యాయం జరుగుతోందన్నారు.

రేపు హజ్ యాత్రికుల ఎంపికకు డ్రా


హైదరాబాద్, వెలుగు: రాష్ట్రం నుంచి ఈ ఏడాది పవిత్ర హజ్ యాత్రకు వెళ్లేందుకు అర్హులైన వారిని శనివారం డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు హజ్ కమిటీ ప్రకటించింది. ఎంపిక కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్ అలీ పాల్గొంటారని తెలిపింది.

హజ్ ఆఫీసర్ల నియామకానికి ఇంటర్వ్యూ

మక్కాలో హజ్ యాత్రికులకు సేవలందించే ఖాదిముల్ హుజ్జా(హజ్ ఆఫీసర్)ల నియామకానికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి దరఖాస్తు చేసుకున్న వారి శారీరక, మానసిక స్థితిని ఇంటర్వ్యూ ద్వారా నిర్ధారించారు.

'అగ్ర' పేదల కడుపుగొట్టడమే!

బిల్లులో అగ్రవర్ణాల్లోని ఆర్థిక వెనకబాటుతనం అని చెప్పకుండా.. 'అగ్రవర్ణ ఆర్థిక బలహీనవర్గాలు' అని చెప్పడమే పెద్ద లాజిక్. రాజ్యాంగ సవరణ చేశారేగానీ అగ్రవర్ణాల్లోని పేదల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఎలాంటి అధ్యయనంగానీ సర్వేగానీ చేయలేదు. అగ్రవర్ణాల్లోని ధనికులు, పలుకుబడి ఉన్నవారు... ఇకపైన తమ కులాల్లోని బీదరికంతో ఉన్న వారిని దోచుకునేందుకు రహదారి వేసినట్లే. అందుకే ఆర్థిక వెనకబాటుతనంపై దేశవ్యాప్తంగా శాస్త్రీయ పద్ధతిలో సర్వే జరగాలి. ఇది న్యాయ సమీక్ష ఎదుర్కొనక తప్పదు.




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు పది శాతం ఉద్యోగ, ఉపాధిరంగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఆఘమేఘాలపై ఎన్నికల్లో లబ్ధి పొందే లక్ష్యంగానే 124వ రాజ్యాంగ సరవణ చేసింది. అగ్రవర్ణ కులాల వారి ఓట్లు దూరం అవుతాయనే భయంతో పార్లమెంటులోని ఇతర పార్టీలు రాజ్యాంగ సవరణకు మద్దతు చెప్పాయి. దోపిడీ, వివక్ష, పీడిత, అంటరానితనం, ఆ అంటరానితనం కారణంగా వెనకబాటుకు గురైన కులాలకు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ల వెలుసుబాటు రాజ్యాంగం కల్పించింది. చట్టం ముందు అందరూ సమానమని మన రాజ్యాంగం 14 అధికరణ చెబుతోంది. అదే రాజ్యాంగంలో పై కారణాల వల్ల విద్య, ఉపాధి రంగాల్లో దోపిడీ, వివక్ష, పీడిత, అంటరానితనానికి గురైనవారికి రిజర్వేషన్లు ఇవ్వాలని అధికరణాలు నిర్ధేశిస్తున్నాయి. మండల్ కమిషన్ సిఫార్సులను ఆమోదం తర్వాత ఇతర వెనకబడిన కులాలకు కూడా రిజర్వేషన్లు ఇచ్చే అంశానికి రాజ్యాంగబద్ధత సిద్ధించింది. అట్టి రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగంలోని 338వ అధికరణం కింద జాతీయ ఎస్సీ కమిషన్, 338(ఎ) ద్వారా జాతీయ ఎస్టీ కమిషన్, ఈ మధ్యననే 338(బి) కింద జాతీయ బీసీ కమిషన్ ఏర్పాటు అయ్యాయి. ఇప్పుడు అగ్రవర్ణాల్లోని ఆర్థిక బలహీన వర్గాలకు (ఫైనాన్షీయల్లీ వీకర్ సెక్షన్స్‌కి) పది శాతం ఇవ్వబోయే రిజర్వేషన్ల అమల్లోగానీ, లోటుపాట్లుగానీ జాతీయ స్థాయిలో ఏ కమిషన్ పర్యవేక్షిస్తుంది? అగ్రవర్ణాల్లోని ఆర్థిక వెనకబాటుతనం లేదా ఆర్థిక బలహీనవర్గాల పేరుతో రిజర్వేషన్లు ఇష్టానుసారంగా ఇచ్చేందుకు వీల్లేదు.

గతంలో పి.వి.నర్సింహరావు ప్రభుత్వం అగ్రవర్ణాల్లోని వెనుకబాటుతనం ఉన్న వారికి పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని 25వ తేదీ సెప్టెంబర్ 1991న తీసుకున్న విధాన నిర్ణయాన్ని తొమ్మిది మందితో కూడిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం తప్పుపట్టింది. ఇందిరా సహాని-కేంద్ర ప్రభుత్వం మధ్య జరిగిన న్యాయ సమీక్షపై సుప్రీంకోర్టు తీర్పులో 1964లో చిత్రలేఖ-మైసూర్ స్టేట్ మధ్య జరిగిన కేసు తీర్పును ఉటంకించింది (ఏఐఆర్ 1964 ఎస్‌సీ 1823). ఆర్థిక వెనకబాటుతనం పేరుతో రిజర్వేషన్లు ఇచ్చేందుకు వీల్లేదని, ఆ కారణంగా వారు చేసే వృత్తిని బట్టి పేదరికాన్ని నిర్ణయించాల్సి వుంటుందని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. మహామహులతో కూడిన ఆ ధర్మాసనం తరఫున మన తెలుగు బిడ్డ జస్టిస్ బి.పి.జీవన్‌రెడ్డి రాసిన తీర్పును ఇతర న్యాయమూర్తులు (అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.హెచ్.ఖనియా, తర్వాత ప్రధాన న్యాయమూర్తులైన జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ అహ్మదీలు ధర్మాసనంలో ఉన్నారు) కూడా ఆమోదించారు. దీని ప్రకారం అగ్రవర్ణంలో పుట్టి పేదరికం కారణంగా రిక్షా తొక్కడమో, రోజు వారీ కూలి పనులు చేయడమో, డ్రైవింగ్ పనులు చేయడమో, వీధి వ్యాపారం మొదలైన పనులు చేస్తుంటే వారికి రిజర్వేషన్లు కల్పించడంలో తప్పు లేదు. అగ్ర కుల కుటుంబంలో పుట్టి పేదరికంగా కారణంగా చేసే పని వల్ల అతనికి సామాజికంగా గౌరవ మర్యాదలు లభిస్తున్నప్పుడు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ వ్యతిరేకం అవుతుందని సుప్రీం కోర్టు తీర్పు చెబుతోంది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం అగ్రవర్ణ ఆర్థిక వెనకబాటుతనం గురించి చెప్పడం లేదు. అగ్రవర్ణ ఆర్థిక బలహీనులని చెబుతోంది. సుప్రీం కోర్టు ఆదేశాలకు లోబడి అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు మోడీ సర్కార్ చెప్పుకోడానికి సూది మొన అంత కూడా ఆస్కారం లేదు. ఆర్థిక వెనకబాటుతనంపై దేశవ్యాప్తంగా శాస్త్రీయ పద్ధతిలో సర్వే జరగాలి. వారు చేసే వృత్తి సామాజికంగా వెనకబాటుతో సమానం అవుతుందో లేదో తేలాలి. ఆ తర్వాతే అగ్రవర్ణాల్లోని పేదల్లో అర్హులకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఇదేమీ లేకుండా పార్లమెంటు ఉభయసభలు హడావుడిగా చేసిన 124వ రాజ్యాంగ సవరణ ప్రకారం అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు అమలు చేస్తే ఆ కులాల్లోని ధనికులు మళ్లీ దోపిడీకి పాల్పడతారు. రూ.8 లక్షల వార్షిక ఆదాయం, మున్సిపాల్టీల్లో వెయ్యి చదరపు అడుగుల ఇల్లు, అయిదు ఎకరాల సాగు భూమి, గ్రామాల్లో రెండు వందల గజాల్లోపు ఇల్లు.. ఇంతకంటే మించి ఉన్న వారు అగ్రవర్ణ పేదలు ఈ రిజర్వేషన్లకు అనర్హులు. నిజంగానే కూలీనాలి చేసుకునే అగ్రవర్ణ పేదలకు ఆ రిజర్వేషన్ల ఫలాలు అందకుండా ఏడెనిమిది లక్షల రూపాయల ఆదాయం ఉన్న అగ్రవర్ణ పెద్దలకే రిజర్వేషన్ల ఫలాలు అందుతాయి. క్రీమీలేయర్‌కు వర్తించే రిజర్వేషన్ల నిబంధనల్ని అమలు చేయాలనే తాజా నిర్ణయ ఫలితంగా ఇకపై అగ్రవర్ణాల పెద్దలు వారి కులాల్లోని పేదలకు అందాల్సిన రిజర్వేషన్ల ఫలాల్ని కాజేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే అగ్రవర్ణాలే వారి కులాల్లోని ఆర్థికంగా బలహీనపడి వారిని దోచుకోవడం ప్రారంభం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో తమకు అన్యాయం జరిగిందని చెప్పుకోవడానికి వారికి జాతీయ స్థాయిలో 'అగ్రవర్ణ బలహీన వర్గాలకు కమిషన్' కూడా లేదు. (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరువేరుగా ఏర్పాటుకు రాజ్యాంగంలోని 338, 338ఏ, 338బి అధికరణాలు వీలు కల్పించాయి.) అగ్రవర్ణ ఆర్థిక బలహీనులకు రిజర్వేషన్లు ఎవరు అమలు చేయాలి? వీటి అమలు బాధ్యతని ఏ జాతీయ కమిషన్‌కు అప్పగిస్తారు? అంటరానితనానికి గురైన ఎస్సీల కోసం నియమించిన జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఇస్తారా? లేక, దోపిడీకి గురైన ఎస్టీల కోసం ఏర్పాటైన ఎస్టీ కమిషన్‌కా లేక బల'హీను'లని భావించిన జాతీయ బీసీ కమిషన్‌కు అప్పగిస్తారా?

రాజ్యాంగం 14వ అధికరణ ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పుకుంటున్నప్పుడు రిజర్వేషన్లు ఏమిటనే ప్రశ్న చాలా మంది వేస్తుంటారు. సామాజికంగా దారుణంగా దోపిడీకి గురైన నేపథ్యంలో రాజ్యాంగ నిపుణులు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా అణగారిన, సామాజిక వివక్షకు, దోపిడీకి గురైన వారికి రిజర్వేషన్లు కల్పించారు. రాజ్యాంగంలోని 15(5)వ అధికరణం ద్వారా విద్య, 16(6)వ అధికరణం ద్వారా ఉద్యోగాలు ఎకనమికల్లీ వీకర్ సెక్షన్లకు కల్పించడానికి, ఆర్టికల్స్ 15(5), 16(6) చేర్చుతూ 124వ రాజ్యాంగ సవరణలు చేసింది. మండల్ కమిషన్ జాతీయ స్థాయిలో కులాలను అధ్యయనం చేసి బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు దోహదపడింది. ఈ అధ్యయనం కారణంగానే 1980 ఆగస్టు 13న వి.పి.సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫార్సుల ఆమోదం న్యాయ సమీక్షలో నిలిపింది. ఇప్పుడు రాజ్యాంగ సవరణ చేశారేగానీ అగ్రవర్ణాల్లోని పేదల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఎలాంటి అధ్యయనంగానీ సర్వేగానీ చేయలేదు. కేవలం ఓట్ల కోసం మోడీ గాలం వేస్తే... వ్యతిరేకిస్తే తమ పార్టీకి నష్టం వస్తుందేమోనని ఇతర పార్టీలు మద్దతు చెప్పడం అన్యాయం. రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు.. అగ్రవర్ణాల్లోని ఆర్థిక వెనకబాటుతనం అని చెప్పకుండా.. 'అగ్రవర్ణ ఆర్థిక బలహీనవర్గాలు' అని చెప్పడమే పెద్ద లాజిక్. దీనిని పార్లమెంటులో ఏ ఒక్కరూ ప్రశ్నించకపోవడం శోచనీయం.

నిజంగానే అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి పాలకులకు ఉంటే జాతీయ స్థాయిలో అన్ని కులాల స్థితిగతులపై శాస్త్రీయ అధ్యయనం జరగాలి. అప్పుడు అగ్రవర్ణాలకే కాదు... ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లల్లో అమలులో జరిగే అన్యాయం కూడా బట్టబయలు అవుతుంది. ఇప్పటి వరకూ ఈ వర్గాల్లో రిజర్వేషన్ల ఫలాలు అందుకున్న వారి కుటుంబాలే మళ్లీ మళ్లీ రిజర్వేషన్లు పొందుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లోని కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్లు పొందడాన్ని అడ్డుకునేందుకు జాతీయ స్థాయి సర్వే దోహదపడుతుంది. ఆయా వర్గాల్లోని కులాలు-ఉప కులాలను ఏబీసీడీలుగా వర్గీకరించి రిజర్వేషన్లు అమలు చేస్తేనే రాజ్యాంగం నిర్దేశించిన మేరకు రిజర్వేషన్ల ఫలాలు కింది స్థాయిలోకి చేరతాయి. లేనిపక్షంలో రాజ్యాంగం కల్పించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్ల ఫలాలు కొందరికి అందిన ద్రాక్షలుగా.. ఎంతో మందికి అందని ద్రాక్షలుగా మిగిలిపోతాయి.

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పి ఆ కులాల్లోని పేదల కడుపుకొట్టే రాజ్యాంగ సవరణ చేశారు. దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల అసమానతలకు కారణంగా పేర్కొంటున్న అగ్రవర్ణాల్లోని ధనికులు, పలుకుబడి ఉన్నవారు ఇకపై తమ అగ్ర కులాల్లోని ఆర్థికంగా పేదరికంతో ఉన్న వారిని దోచుకునేందుకు 124వ రాజ్యాంగ సవరణతో రహదారి వేసినట్లే. అందుకే ఇది న్యాయ సమీక్ష ఎదుర్కొనక తప్పదు.



– **జస్టిస్ వంగల ఈశ్వరయ్య,**
హైకోర్టు విశ్రాంత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి.
జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్‌పర్సన్.

కొత్త కోటా అమలు చేసేదెవరు?

క్రీమీలేయర్‌కు వర్తించే రిజర్వేషన్ల నిబంధనల్ని అమలు చేయాలనే తాజా నిర్ణయ ఫలితంగా ఇకపై అగ్రవర్ణాల పెద్దలు వారి కులాల్లోని పేదలకు అందాల్సిన రిజర్వేషన్ల ఫలాల్ని కాజేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే అగ్రవర్ణాలే వారి కులాల్లోని ఆర్థికంగా బలహీనపడి వారిని దోచుకోవడం ప్రారంభం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో తమకు అన్యాయం జరిగిందని చెప్పుకోవడానికి వారికి జాతీయ స్థాయిలో 'అగ్రవర్ణ బలహీన వర్గాలకు కమిషన్' కూడా లేదు. (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరువేరుగా ఏర్పాటుకు రాజ్యాంగంలోని 338, 338ఏ, 338బి అధికరణాలు వీలు కల్పించాయి.) అగ్రవర్ణ ఆర్థిక బలహీనులకు రిజర్వేషన్లు ఎవరు అమలు చేయాలి? వీటి అమలు బాధ్యతని ఏ జాతీయ కమిషన్‌కు అప్పగిస్తారు? అంటరానితనానికి గురైన ఎస్సీల కోసం నియమించిన జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఇస్తారా? దోపిడీకి గురైన ఎస్టీల కోసం ఏర్పాటైన ఎస్టీ కమిషన్‌కా లేక బల'హీను'లని భావించిన జాతీయ బీసీ కమిషన్‌కు అప్పగిస్తారా?

ఓట్లు మనవి.. సీట్లూ మనవే కావాలి

పార్లమెంట్ చరిత్రలోనే 2019 జనవరి 8, 9 తేదీలు చీకటి రోజులుగా మిగిలి పోతాయి. ఆర్థిక వెనకబాటు సాకుతో అగ్ర కులాలకు 10 శాతం కోటా కల్పించడానికి 124వ సవరణ... రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమైనది. రాజ్యాంగ పీఠికలోని సామాజిక న్యాయం లక్ష్యానికి పూర్తి విరుద్ధమైనది. సామాజిక వెనుకబాటుతనం, వివక్ష ఆధారంగా మాత్రమే విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలన్నది రిజర్వేషన్ల వెనకున్న అసలు స్ఫూర్తి. ఆర్థిక వెనకబాటు ఆధారంగా కోటా ఇవ్వడం సదరు స్ఫూర్తిని దెబ్బతీసినట్లే అవుతుంది. కాబట్టే సుప్రీంకోర్టు, పలు హైకోర్టులు ఎకనామిక్ రిజర్వేషన్లను తోసిపుచ్చాయి. ముఖ్యమైన పాయింట్ ఏమిటంటే, అగ్రవర్ణాలకు అధికారాన్ని కట్టబెట్టింది అణగారిన కులాలే మరి. జనాభాలో 80 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇప్పటికైనా ఏకం కావాలి. రాజకీయ అధికారమే మాస్టర్‌కీ అన్న నిజాన్ని గుర్తించాలి. ఓట్లు మనవే అయినప్పుడు సీట్లు కూడా మనవే ఉండాలని నినదించాలి.

సైన్స్ కాంగ్రెస్.. ఇలాగైతే కష్టమే!



ఇండియాలో సైన్స్ ఈవెంట్లు, కాన్ఫరెన్స్‌లు చాలావరకు చిక్కుముడులు వేస్తున్నాయి. జలంధర్‌లో ఇటీవల ముగిసిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కూడా ఇలాగే పజిల్‌లా ఉండిపోయింది. ముఖ్యంగా రెండు సందేహాలకు సమాధానాలు కావాలి. వివిధ సబ్జెక్టుల సైంటిస్టులను ఒకే వేదికపైకి తేవటంలోని ఉమ్మడి ఉద్దేశమేంటి? రాజకీయ నేతలు ఈ సదస్సుకి రావటం వల్ల ప్రయోజనం ఉందా?

ప్రొఫెసర్ జె.ఎల్.సైమన్‌సేన్, ప్రొఫెసర్ పి.ఎస్. మెక్‌మోహన్ అనే ఇద్దరు బ్రిటిష్ కెమిస్ట్‌ల ఆలోచన రూపమే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐఎస్‌సీఏ). పరిశోధనలను ప్రోత్సహించడానికిగాను ఏటా రీసెర్చ్ వర్కర్లను ఒకచోట సమావేశపరచాలన్న సదుద్దేశంతో1914లో ఏర్పాటు చేశారు. అప్పట్లో విస్తృత చర్చల ద్వారా సైంటిస్టులు ఒకరి ఐడియాలను ఒకరు షేర్ చేసుకునే వీలుండేది. ఇది ఏర్పాటైన కొన్నాళ్ల వరకు బాగానే ఫలితాలు వచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చాక కూడా బ్రిటిషర్ల బాటలోనే నడుస్తూ దేశంలోని రీసెర్చ్ ఫీల్డ్‌పై సొంత ముద్ర వేయలేకపోయింది.

ఐఎస్‌సీ అనేది ఒక పెద్ద ఈవెంట్. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా చాలామంది వస్తారు. కానీ, సైన్స్‌ని ప్రమోట్ చేసుకునే దిశగా జరగకపోవటం విచారకరం. వేర్వేరు టాపిక్‌లపై వేర్వేరు వ్యక్తులు ఇచ్చే స్పీచ్‌లకు, జరిగే చర్చలకు ఒకే ఆడియెన్స్ ఉంటున్నారు. స్టేజ్ మీదికి ఒకరి తర్వాత ఒకరు వచ్చిన సైంటిస్టులు మెటీరియల్ సైన్స్, అగ్రికల్చర్, 'మెకానిజం ఆఫ్ సెక్స్ డిటర్మినేషన్ ఇన్ కాక్కాయిడ్స్', 'ఓఎన్‌జీసీ ఇనీషియేటివ్స్ ఫర్ రీబిల్డింగ్ ఇండియా' వంటి డిఫరెంట్ టాపిక్‌లపై మాట్లాడారు. ఇవి ఒకదానికొకటి పొసగని అంశాలు. ఇలా ప్రతిదీ ఈ నాలుగు రోజుల సమ్మిట్‌లోనే వివరంగా చర్చించటం సాధ్యం కాదు. దీనివల్ల సైన్స్ ప్రమోషన్ జరగదు. కాబట్టి, నిర్వాహకుల లక్ష్యాలు ఇవి కాదేమో, వేరే ఉన్నాయేమో అనిపిస్తోంది.

ఏం చేయాలంటే...

మొత్తం సైన్స్ కాంగ్రెస్‌ని మల్టిపుల్ స్మాల్ ఈవెంట్లుగా డివైడ్ చేయాల్సింది. దీనివల్ల ప్రతి అజెండాపైనా ఫోకస్ పెట్టడానికి వీలుండేది. మల్టిపుల్ మీటింగ్‌లను ఒకే రోజు, ఒకే చోట కాకుండా వేర్వేరు రోజుల్లో వేర్వేరు ప్రదేశాల్లో నిర్వహించటం మంచిది. దీనికంటూ ఒక క్యాలెండర్ రూపొందించాలి. అలా చేస్తే కాంటెంపరరీ ఇష్యూలు మిస్ కావు. ఈ భేటీలకు సబ్జెక్ట్ నిపుణులను, ఆథర్స్‌ని, కాలేజ్ స్టూడెంట్స్‌లో ఫ్రెషర్స్‌ని పిలవాలి. అలాగైతేనే జూనియర్లు గ్రాడ్యుయేట్ స్టూడెంట్లతో, వర్కింగ్ సైంటిస్టులతో సెలక్టెడ్ టాపిక్‌లపై డిస్కస్ చేస్తారు. పోస్టర్ల ప్రిపరేషన్‌కి, ప్రజెంటేషన్‌కి, సబ్జెక్టులపై దీర్ఘకాలపు ఆసక్తికి ఇది దోహదపడుతుంది. సైంటిస్టులకు, సామాన్య జనాలకు మధ్య గ్యాప్‌ని భర్తీ చేయటానికి కేంద్రం ప్రయత్నిస్తోందని శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల మంత్రి హర్షవర్ధన్ పోయిన సైన్స్ కాంగ్రెస్ సమావేశంలోనే చెప్పారు. ఏడాది గడిచినా నెరవేరలేదు. సైంటిస్టులు చెప్పే చాలా కాంప్లికేటెడ్ విషయాలు సామాన్యులకు అర్థం కావట్లేదనే విమర్శలు వస్తున్నాయి.

సైంటిస్టులు, జర్నలిస్టులు సైన్స్ కమ్యూనికేషన్‌ని మరింత బాగా చేస్తేనే ఈ లోటు భర్తీ అవుతుంది. ఇది పొలిటికల్ లీడర్లతో, పార్టీలతో జరిగేది కాదు. అందువల్ల సైన్స్ కాంగ్రెస్‌కి ప్రధాని రాకుండా ఉండటమే బెటర్. వచ్చినా తన స్పీచ్‌ని త్వరగా ముగించటం ఇంకా మంచిది. ఏ రీసెర్చ్ ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి అనేది డిక్టేట్ చేయకూడదు. పరిశోధనలు అనేవి పాలకులతో సంబంధం లేకుండా స్వతంత్రంగా జరగాలి. ప్రభుత్వాలు మారినప్పుడు ఆగిపోకూడదు. సైన్స్ కాంగ్రెస్ నిర్వాహకులు వీటిపై దృష్టి పెట్టాలి.

– రామానుజన్ నదాథుర్,
మాలిక్యులర్ బయాలజిస్ట్.

రావణుడికి 24 విమానాలు!


జైపూర్ వేదికగా జరిగిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేల ఏండ్ల కిందటే ఇండియాలో టెస్ట్ ట్యూబ్ బేబీ టెక్నాలజీ ఉందని, కౌరవులంతా టెస్ట్‌ట్యూబ్ బేబీలేనని, ప్రస్తుతం క్షిపణుల్లో వాడుతోన్న గైడెడ్ టెక్నాలజీ రాముడి కాలంలోనూ ఉందని, రావణుడికి 24 రకాల పుష్పక విమానాలు ఉండేవని ఆయన చెప్పుకొచ్చారు. వీసీగారి వ్యాఖ్యలను పలు సంస్థలు తీవ్రంగా ఖండించాయి. పురాణాలను సైన్స్‌తో ముడిపెట్టి చూడటం సరికాదని, ఇలాంటి సోదాహరణలు విద్యార్థులపై చెడు ప్రభావం చూపుతాయని సైన్స్ సొసైటీలు హెచ్చరించాయి.

ఏమన్నారంటే



హోమోసెక్సువాలిటీ సైన్యంలో కుదరదు. సైన్యం మోడరనైజ్ కాదు, వెస్ట్రనైజ్‌కూడా కాదు. ఎల్జీబీటీ విషయాలు మాకు సమ్మతం కాదు. రాజ్యాంగం మాకు అంత స్వేచ్ఛ ఇవ్వలేదు.

– జనరల్ బిపిన్ రావత్, ఇండియన్ ఆర్మీ చీఫ్



రాజ్యాంగమనేది ఒకరికొకరు చేసుకున్న వాగ్దానం లాంటిది. దేవుడి గిఫ్ట్ కాదు. స్వర్గం నుంచి ఊడిపడలేదు. రాజ్యాంగాన్ని మనం సొంతం చేసుకోవాలి. మనదని అనుకోవాలి.

– కంగనా రనౌత్, బాలీవుడ్ నటి.

ఆదివాసీల ఆత్మబంధువు హైమన్ డార్ఫ్



(ఇవాళ హైమన్ డార్ఫ్ వర్ధంతి సందర్భంగా)

తెలంగాణలోని ఆదివాసీ గిరిజనులపై అధ్యయనం చేయడానికి వచ్చి, ఇక్కడి మనుషులతో విడదీయలేని అనుబంధం ఏర్పరచుకుని, ఆరాధ్య దైవంగా మారారు ప్రొఫెసర్ క్రిస్టోఫర్ వోన్ ఫ్యూరర్ హైమన్ డార్ఫ్. భార్య బెట్టీ ఎలిజబెత్‌ను వెంటబెట్టుకుని ఇక్కడి అడవుల్లో తిరుగుతూ గిరిజనుల సంప్రదాయాలు, జీవన విధానాలను, కాలానుగుణంగా ఉనికి కోసం వారు చేస్తున్న పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేశారు. అడవి బిడ్డల అభ్యున్నతికి పాటుపడ్డారు.

ఆస్ట్రియా రాజధాని వియన్నా హైమన్ డార్ఫ్ సొంతూరు. వాళ్లది రాజవంశం. 1909లో జన్మించిన ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో చదివారు. తనకెంతో ఇష్టమైన ఆంత్రోపాలజీ (మానవ పరిణామ శాస్త్రం)లో డాక్టరేట్ చేశారు. నాగా, గోండు, కోయ, కొండ రెడ్లు, చెంచు తదితర తెగల జీవన విధానంపై అధ్యయనం చేయడానికి ఇండియాలో పర్యటించారు. 1942-45 మధ్య హైదరాబాద్ సంస్థానంలోని ఆదిలాబాద్‌లో గిరిజన తెగలపై అధ్యయనంకోసం జైనూర్ మండలం మార్లవాయికి వచ్చారు. అక్కడే తన భార్య బెట్టీ ఎలిజబెత్‌తో కలిసి ఉండిపోయారు. ఆయన ఇండియా రావడం వెనుక విచిత్రమైన కథ ఉంది. రెండో ప్రపంచ యుద్ధకాలం నాటికి నాజీ జర్మనీ పాస్‌పోర్ట్‌తో బ్రిటన్‌లో ఉండేసరికి, ఆయనను ప్రభుత్వం అరెస్ట్ చేసి, నిజాం సంస్థానానికి పంపించింది. ఇక్కడి నిజాం.. ప్రొఫెసర్ డార్ఫ్‌ను గిరిజన వ్యవహారాల ప్రత్యేక సలహాదారుగా నియమించుకున్నారు. అలా డార్ఫ్‌కు పడిన శిక్ష మన ఆదివాసీల పాలిట వరంగా మారిందని చెప్పొచ్చు.

1/70 చట్టం ఆయన చేసిందే!

ఇండియా వచ్చిన తొలినాళ్లలో నల్లమల అడవుల్లోని చెంచులు, కొండరెడ్లపై అధ్యయనం చేసేవారు. ఆ తర్వాత ఆదిలాబాద్‌ను తమ కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు. ఇక్కడి చెంచుపేటలు, గోండు గూడేలల్లో ఉంటూ, ఆదివాసీల జీవన విధానాలపై రచనలు చేశారు. 'జల్-జంగల్-జమీన్' నినాదంతో ఆదివాసీ వీరుడు కుమ్రం భీం చేసిన తిరుగుబాటు (1938-40) నిజాం సర్కారును కుదిపేసింది. భీం పోరాటానికి ప్రధాన కారణమైన పటేదార్, షావుకార్ల దోపిడీలను అరికట్టడానికి డార్ఫ్ తన వంతు ప్రయత్నం చేశారు. ఆదివాసీలకు భూములపై యాజమాన్య హక్కులు కల్పించడానికి నిజాంతో చర్చలు జరిపారు. 1944-48 మధ్య కాలంలో జైనూరు ప్రాంతంలో దాదాపు లక్షన్నర ఎకరాల భూమిని 10 వేల గిరిజన కుటుంబాలకు పంచిపెట్టారు. 1948-54 మధ్యకాలంలో డార్ఫ్ కృషి వల్లే గోండు పటేళ్లు వందల ఎకరాల భూమిని పొందగలిగారు. గిరిజనుల్లో విద్యావ్యాప్తికి సైతం పాటుపడి... వందకు పైగా స్కూళ్లను ఏర్పాటు చేసి, గిరిజన పిల్లలకు గోండి భాషలోనే చదువు చెప్పించారు డార్ఫ్ దంపతులు. మర్లవాయి, తాడ్వాయి, సుదిమళ్ల ప్రాంతాల్లో ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మర్లవాయిలో వ్యవసాయ క్షేత్రం స్థాపించి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఆదివాసీలకు అవగాహన కల్పించారు. డార్ఫ్ సలహా సూచనలతోనే 'భూ బదలాయింపు చట్టం-1959' రూపుదిద్దుకుంది. దాన్నే మనమిప్పుడు 1/70 యాక్ట్‌గా చెప్పుకుంటున్నాం. 1950-85 మధ్య కాలంలో గిరిజన వ్యవహారాలకు సంబంధించిన పలు అంశాల్లో ప్రభుత్వాలకు విలువైన సలహాలు, సూచనలు అందించారు హైమన్ డార్ఫ్. ఆదిలాబాద్ గోండులతో ఏర్పడిన అనుబంధం కారణంగానే డార్ఫ్ దంపతులు తమ కొడుకు నికోలస్‌కు 'లచ్చు పటేల్' అని పేరు మార్చారు. ప్రఖ్యాత నాగోబా జాతర సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే 'గిరిజన దర్బార్'ని మొట్టమొదట అమలు చేసింది సైమన్ డార్ఫే. ఆయను స్ఫూర్తిగా తీసుకున్న ఆదిలాబాదీ మడవి తుకారాం ఐఏఎస్ అధికారి కాగలిగారు. డార్ఫ్ తన జీవిత కాలంలో ఐదు పరిశోధక గ్రంథాలు రాశారు. ఆయన నివేదికల ఆధారంగానే ఎస్.ఆర్.శంకరన్, బి.డి.శర్మ కమిషన్లు ఏర్పడి పలు విలువైన సూచనలు చేశాయి. అయితే ఆ కమిషన్ల సూచనలను మాత్రం ప్రభుత్వాలు అమలు చేయలేదు.



– గుమ్మడి లక్ష్మీనారాయణ,
వ్యవస్థాపక కార్యదర్శి,
ఆదివాసీ రచయితల సంఘం



ఇద్దరి సమాధులు ఇక్కడే


1986లో హైదరాబాద్‌లో జరిగిన ఓ గిరిజన జాతీయ గిరిజన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన బెట్టీ ఎలిజబెత్ అక్కడే హఠాన్మరణం చెందారు. ఆమె కోరిక మేరకు మర్లవాయి గ్రామంలో గిరిజన సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. భార్య సమాధి పక్కనే తన సమాధికూడా కట్టించాలని డార్ఫ్ సూచించారు. ఆదివాసీలను అభ్యున్నతి వైపు నడిపించి, వారికి ఆత్మబంధువుగా మారిన డార్ఫ్ లండన్‌లోని తన ఇంట్లో 1995 జనవరి 11న కన్నుమూశారు. ఆ తర్వాత 12 ఏండ్లకు డార్ఫ్ కుమారుడు లచ్చు పటేల్ తండ్రి అస్థికలను మర్లవాయిలో తల్లి (బెట్టి ఎలిజబెత్) సమాధి పక్కనే ప్రతిష్టించారు. ఏటా డార్ఫ్ వర్ధంతి ప్రధాన కార్యక్రమం మర్లవాయిలోనే జరుగుతోంది. ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన హైమన్ డార్ఫ్ యావత్ మానవతావాదులకు చిరకాలం గుర్తుండిపోతారు.



ఫొటో ఫీస్ట్

పసిపాపల నవ్వులు చూడటం, వారితో ఆడుకోవడం కంటే ఆనందం ఏముంటుంది! అందుకే రాశిఖన్నా కూడా తీరిక వేళలో ప్రపంచాన్ని మర్చిపోయి ఇలా మేనల్లుడితో గడుపుతోంది.

ట్విటర్ టాక్



'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' ట్రైలర్ చూసిన అనిల్ కపూర్... మన్మోహన్ సింగ్ పాత్ర పోషించిన అనుపమ్ ఖేర్ గురించి ఇలా ట్వీట్ చేశారు. "చేసే ప్రతి పాత్రకీ న్యాయం చేయడం మీకే చెల్లింది. ఈ పాత్రకీ అంతే. మీ ప్రతిభకు తిరుగులేదు. ఇంత కష్టమైన పాత్రని ఇలా పోషించడం మీకే సాధ్యం. మీరొక అద్భుతమైన అరుదైన నటుడు."

గప్‌చుప్



తెలుగు, తమిళ భాషల్లో తరచూ సినిమాలు చేస్తున్నా చెప్పుకోదగ్గ బ్రేక్ రాలేదు క్యాథరీన్ త్రెసాకి. అయినా కూడా అవకాశాలైతే తగ్గలేదు. రీసెంట్‌గా ఆమెని విజయ్ దేవరకొండ సినిమాకి తీసుకున్నారని సమాచారం. ప్రస్తుతం 'డియర్ కామ్రేడ్' చిత్రంలో నటిస్తోన్న విజయ్ ఆ తర్వాత క్రాంతి మాధవ్ సినిమా చేస్తాడట. ఆ చిత్రంలో హీరోయిన్‌గా క్యాథరీన్‌నే ఓకే చేసినట్లు తెలుస్తోంది. ఈ వార్తలో ఎంత నిజముందో మరి.



ఆన్ లొకేషన్

పచ్చని పొలాలు.. అందమైన తోటలు.. సెలయేటి గలగలలు... చిరుగాలి సవ్వడులు... పల్లెటూరి అందమే వేరు. అక్కడ దొరికే ఆనందమే వేరు. షూటింగ్ కోసం ఓ పల్లెటూరికి వెళ్లిన అమితాబ్ ఆ ఆనందాన్ని అనుభవిస్తున్నారు. ఈ ఫొటో పోస్ట్ చేసి మరీ ఆ విషయం చెప్పారు.



ఒక వర్గం కోసం సినిమా తీయను

రామ్ చరణ్ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన చిత్రం 'వినయ విధేయ రామ'. పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో, బోయపాటి మార్క్ యాక్షన్ సీన్స్‌తో ఇప్పటికే ట్రైలర్ అట్రాక్ట్ చేసింది. మరి ఈరోజు రిలీజ్ కానున్న సినిమా అంతే ఆకట్టుకుంటుందా, అందులోని విశేషాలేంటి ఇతరత్రా విషయాలన్నీ బోయపాటి ఇలా చెప్పుకొచ్చారు.

- కలర్‌ఫుల్ మూవీ. రామ్‌చరణ్ ఎపిసోడ్స్ బాగా ఆకట్టుకుంటాయి. కొత్త లుక్‌లో కనపడతాడు. తనవాళ్ల విషయంలో వినయంగా విధేయంగా ఉంటాడు. అవసరమైతే ఎంత దూరమైనా వెళ్లి వేటాడుకొచ్చే రాముడిలానూ ఉంటాడు.
- మిగతా పాత్రల్లో ఆర్టిస్టులు కనపడరు. ఆ పాత్రలే కనబడతాయి. మంచి మెసేజ్ కూడా ఉంటుంది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఒక పాయింట్‌ని ఈ సినిమాలో హేమతో చెప్పించా. అందరికీ కనెక్ట్ అవుతుంది.
- ఒక సినిమా చేస్తున్నప్పుడు చాలా విషయాలు దృష్టిలో పెట్టుకుంటాను. ఏదో ఒక వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని తీయను. చిన్న పిల్లలు, యువత, నడివయస్కులు, అరవై పైబడిన వాళ్ళు.. ఇలా ప్రతి ఏజ్ గ్రూప్‌కీ రిలేటెడ్‌గా ఉండే కథలనే ఎంచుకుంటాను. ముఖ్యంగా నా కథలన్నీ ఫ్యామిలీతో ముడిపడి ఉంటాయి. అందులోనే ఎంటర్టైన్ మెంట్ ఉంటుంది. ఎమోషన్ ఉంటుంది. లవ్ ఉంటుంది. యాక్షన్ కూడా ఉంటుంది. హీరోయిజం ఉంటుంది. మాస్ ప్రేక్షకుడు కూడా నా సినిమాను చూసి హ్యాపీగా ఇంటికి వెళ్ళాలన్న దే నా లక్ష్యం.
- ఒక ప్రేక్షకుడు తన జీవితంలో సుమారు నాలు గున్నర గంటల సమయాన్ని(సినిమా రెండు గంటలే. కానీ రావడానికో గంట , వెళ్లడానికో గంట) వెచ్చించి, కష్టపడి సంపాదించిన డబ్బు లోనుంచి నా సినిమాకోసం ఖర్చు పెట్టుకుని వస్తుంటాడు. సినిమా తీసినందుకు మేమూ డబ్బు సంపాదించుకుంటాం. కానీ ప్రేక్షకుడికి సినిమా ద్వారా తృప్తినివ్వాల్సిన బాధ్యత డైరెక్టర్‌గా నా మీద ఉంటుంది.
- ఏ సినిమాకి ఆ సినిమాని మొదటి సినిమా అనుకునే ప్రారంభిస్తాను. గతంలో తీసినవన్నీ మర్చిపోతాను. ఏ హీరోకయితే కథ రాస్తున్నానో ఆ హీరోకి ఒక వీరాభిమానిలా ఫీలవుతూ థియేటర్లో ముందు సీట్లో కూర్చొని చూస్తున్నట్లుగా ఊహించుకుంటా. అతనినెలా చూపిస్తే ప్రేక్షకుడు ఆనందపడతాడో అలాగే రాస్తాను.
- ఆర్టిస్టుల్ని ముందే అనుకుని స్క్రిప్ట్ రాయను. హీరోగా మాత్రం రామ్‌చరణ్‌ని అనుకునే కథ రెడీ చేశాను. ఆయన ఆహార్యం సినిమాలోని పాత్రకు సరిపోవడం కోసం కొన్నాళ్లు వెయిట్ చేశాం. కానీ మిగతా ఏ క్యారెక్టర్నీ అనుకుని రాయలేదు. రాసిన తర్వాతే సూటయ్యే ఆర్టిస్టుల్ని ఎంపిక చేసుకున్నాం. అందుకే ప్రతి ఆర్టిస్టులో క్యారెక్టర్ కనపడుతుంది.

నా ఆలోచన చాలా బ్రాడ్‌గా ఉంటుంది. కాబట్టి నేను చిన్న సినిమాలు చేయను. సినిమా అంటేనే ఒక అద్భుతం. అందులో ప్రతిదీ గ్రాండియర్‌గానే ఉండాలి. ఒక రూరల్ కథను తీసుకుని గ్లామర్ లేకుండా చూపించలేను. ఒకవేళ అలా చూపిస్తే హీరో హీరోయిన్లు ఫోర్స్‌డ్‌గా నటిస్తున్నట్లే ఉంటుంది. అందుకే నేను చిన్న సినిమాలు చేయను. సినిమా సినిమాకీ స్థాయిని పెంచే చేస్తాను.

- వివేక్ ఒబెరాయ్‌ని కూడా కథ ఫైనలయ్యాకే అప్రోచ్ అయ్యాం. రక్తచరిత్ర తర్వాత తెలుగులో చేస్తోన్న సినిమా అంటే అంతకు మించి నా క్యారెక్టర్ ఉంటే ఆలోచిస్తాను, కానీ ఇలా విలన్ క్యారెక్టర్స్ చెయ్యనని చెప్పేశారు. చెయ్యొద్దుగానీ కథ ఒకసారి వినండి అన్నాను. సరే అన్నారు. పాత్ర గురించి చెప్పాను. మొత్తం విన్నాక కావాల్సిన దానికన్నా ఐదు రోజులు ఎక్కువే తీసుకోండి, డేట్స్ బ్లాక్ చేస్తాను, మళ్లీ కావాలంటే ఇవ్వలేను" అన్నారు.
- కథ చెప్పేటప్పుడు , షూట్ చేసేటప్పుడు చాలా ఎమోషనల్‌గా ఉంటాను. ఎందుకంటే కథలో ఎవరెలా చేయాలో నేను ఊహించుకోవాలి. నా ఊహకి తగ్గట్టు ఆర్టిస్టు యాక్ట్ చెయ్యాలంటే వారికర్థమయ్యేలా నేను చెప్పాలి. అంటే నేను వాళ్లకన్నా ఎక్కువగా యాక్ట్ చేసి చూపించాలి. అప్పుడే అనుకున్నది కనపడుతుంది.
- సెట్లో కూడా స్ట్రిక్ట్‌గానే ఉంటాను. ఎందుకంటే.. సుమారు రెండు వందలమంది పనిచేస్తోన్న లొకేషన్లో టైమ్ వేస్ట్ చేస్తూ పనిచేస్తే కుదరదు. రోజుకో 20 షాట్లు షూట్ చేశామనుకున్నా, ఒక్కో షాట్‌కి పది నిముషాల చొప్పున వేస్ట్ అయిందనుకున్నా, రోజుకు ఆరేడు లక్షలు లాస్. అది నేను ఒప్పుకోను. ఈ సినిమా అనుకున్నట్లు గ్రాండ్‌గా వచ్చిందంటే రామ్ చరణ్ కోఆపరేషన్, ప్రొడ్యూసర్ సహకారమే కారణం.



జూన్‌లో నిశ్చితార్థం ?

బాలీవుడ్ హీరోయిన్లు ఒక్కొక్కరిగా పెళ్లి పీటలెక్కుతున్నారు. దీపిక, ప్రియాంకల తర్వాత ఇప్పుడు ఆలియా భట్ వంతు వచ్చింది. ఆమె రణబీర్ కపూర్‌తో ప్రేమలో ఉందన్న విషయం ఎప్పటినుంచో వినిపిస్తోంది. మొదట నో అని వాదించినా... ఇటీవలే తమ మధ్య రిలేషన్ ఉన్న విషయాన్ని ఇద్దరూ వేర్వేరు సందర్భాల్లో బయటపెట్టారు. త్వరలో పెళ్లి కూడా చేసుకోనున్నారన్నది తాజా సమాచారం. ప్రస్తుతం 'బ్రహ్మాస్త్ర'లో కలిసి నటిస్తోన్న రణబీర్, ఆలియాలు నిజ జీవితంలోనూ ఒక్కటవడానికి రెడీ అవుతున్నారట. జూన్‌లో వీరి నిశ్చితార్థం, కొన్ని నెలల తర్వాత పెళ్లి జరుగుతాయట. ఇరువురి కుటుంబాలకూ సన్నిహితుడైన ఒక వ్యక్తి ద్వారా ఈ విషయం బయటికి పొక్కడంతో బాలీవుడ్ అంతటా దీని గురించే చర్చ నడుస్తోంది.



రివ్యూ

పాత పాటతో కొత్త పేట

'2.0' విడుదలై రెండు నెలలు తిరక్కముందే 'పేట'తో వచ్చారు రజనీకాంత్. గురువారం విడుదలైన ఈ చిత్రానికి 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు. మునుపటి రజనీకాంత్‌ను ఈ సినిమాలో చూడబోతున్నారంటూ 'పేట' టీమ్ చేసిన ప్రచారం ఎంతవరకూ వర్కవుటయిందో చూద్దాం.

కథగా..

ఒక హిల్ స్టేషన్‌లోని కాలేజీ హాస్టల్‌కి వార్డెన్‌గా వస్తాడు కాళి (రజనీకాంత్). వచ్చీ రావడంతోనే ర్యాగింగ్‌ను అడ్డుకుని మైఖేల్ (బాబీ సింహా) గ్యాంగ్ ఆట కట్టిస్తాడు. క్వాలిటీ ఫుడ్ ఇవ్వని మెస్ కాంట్రాక్టర్‌ను మార్పించేసి హాస్టల్ పిల్లలకు మరింత దగ్గరవుతాడు. అన్వర్ అనే కుర్రాడి ప్రేమకు సాయం చేయడంతో పాటు అతనిపై ప్రత్యేక వాత్సల్యం చూపిస్తుంటాడు. ఈ క్రమంలో అన్వర్‌పై ఓ గ్యాంగ్ దాడి చేయగా అడ్డుకుని అండగా నిలుస్తాడు. అన్వర్‌పై దాడి చేసిందెవరు, ఎందుకు చేశారు అనే ప్రశ్నల నుంచి కాళి గతం బయటకు వస్తుంది. అసలు కాళీ అక్కడికి ఎందుకొచ్చాడు, అన్వర్‌తో ఉన్న సంబంధమేంటి, అతని గతమేంటి అనేది మిగతా కథ.

ఎవరెలా..

సినిమాకి మేజర్ హైలెట్ రజనీ నటనే. తన మార్క్ స్టైల్‌తో, పెర్ఫామెన్స్‌తో మెప్పించారు. కామెడీ బాధ్యత కూడా ఆయనే భుజాన వేసుకున్నారు. క్రూరమైన ఆలోచనలు గల పిరికి విలన్‌గా నవాజుద్దీన్ సిద్దిఖీ మెప్పించాడు. మరో కీలకపాత్ర పోషించిన విజయ్ సేతుపతి తనదైన నటన కనబరిచాడు. కనిపించింది కాసేపే అయినా గ్లామర్‌తో ఆకట్టుకున్నారు సిమ్రాన్, త్రిష. రజనీ సినిమాకి చేసే అవకాశాన్ని చక్కగా వాడుకున్నాడు అనిరుధ్. పాటల కంటే బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌లో సత్తా చాటాడు. తిరు సినిమాటోగ్రఫీ ఆకట్టుకుంటుంది. ఎటొచ్చీ కత్తెర వేయాల్సిన సీన్స్ మాత్రం బోలెడు. నిర్మాణ విలువల్లో మాత్రం ఎక్కడా రాజీ పడలేదు.

ఎలా ఉందంటే...

ఫస్ట్ హాఫ్‌లో హాస్టల్ నేపథ్యంలో వచ్చే సీన్స్ ఎంటర్టైన్ చేస్తాయి. ఎప్పుడైతే ఫ్లాష్ బ్యాక్ మొదలవుతుందో అప్పుడు కథ రొటీన్ రివెంజ్ డ్రామాలోకి వెళ్తుంది. పైగా ఆ తమిళ నేటివిటీ తెలుగు ప్రేక్షకులకు రుచించదు. ప్రీ క్లైమాక్స్‌లో కథ కొత్త మలుపు తిరగబోతోందని ఆనందపడేలోపు సాగతీత సీన్స్ ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడతాయి. సిమ్రాన్, త్రిష అతిథి పాత్రల్లా అనిపిస్తారు. నవాజుద్దీన్ సిద్దిఖీ, విజయ్ సేతుపతి, శశికుమార్, బాబీ సింహా వంటి టాలెంటెడ్ యాక్టర్లని దర్శకుడు సరిగా వాడుకోలేదు. రజనీ మాత్రం ఈ మధ్య కాలంలో ఏ సినిమాలో కనిపించనంత జోష్‌గా, తనదైన స్టైల్‌తో మెప్పించారు. ఎంట్రీ మొదలు క్లైమాక్స్ వరకూ అభిమానులకు కన్నుల పండుగలా ఉంటుంది. కామన్ ఆడియెన్స్‌కు మాత్రం పాత కథనే మళ్లీ చూపిస్తున్నారనిపిస్తుంది. పిజ్జా, జిగర్తాండ వంటి వైవిధ్యమైన చిత్రాలు తీసిన కార్తీక్ సుబ్బరాజ్.. ఇలాంటి రొటీన్ సినిమాకి దర్శకుడంటే నమ్మలేం. వైవిధ్యత ఆశించి వెళ్తే నిరాశ తప్పదు. రజనీ స్టైల్, మేనరిజం మాత్రమే దృష్టిలో పెట్టుకుని కథను వదిలేశాడు. ఆయన స్టైల్‌లో పడి తన స్టైల్ మర్చిపోయాడు. అయితే అతని టేకింగ్, అనిరుధ్ మ్యూజిక్‌తో రజనీ సీన్స్ ఎలివేట్ అయ్యాయి. కొత్తదనం కోసం కాకుండా రజనీని చూడ్డానికైతే హ్యాపీగా వెళ్లొచ్చు.



మున్నాభాయ్‌తో శంకర్ దాదా

సంజయ్ దత్‌ని 'మున్నాభాయ్ ఎంబీబీఎస్'గా చూసి బాలీవుడ్‌వారు ఎంత సంబరపడిపోయారో... దాని రీమేక్‌లో చిరంజీవిని 'శంకర్ దాదా ఎంబీబీఎస్'గా చూసి తెలుగు ప్రేక్షకులు అంతకంటే ఎక్కువ మురిసిపోయారు. ఆ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలనూ తెలుగులో మెగా స్టారే చేశారు. రీసెంట్‌గా మున్నాభాయ్ మూడో పార్టు పని కూడా మొదలైంది. ఈ సమయంలో సంజూని చిరు, చెర్రీ ఎందుకు కలిసినట్టు? ఏం మాట్లాడినట్టు? ఈ ఫొటో పోస్ట్ చేసినప్పటి నుంచి సోషల్ మీడియాలో ఇదే చర్చ. ఈ సీక్వెల్‌ని కూడా చిరు చేయాలనుకుంటున్నారేమో, దాన్ని రామ్ చరణే నిర్మిస్తాడేమో అంటూ ఫ్యాన్స్ ఊహాగానాలు మొదలుపెట్టేశారు. ఓ ఈవెంట్లో పాల్గొనడానికి హైదరాబాద్ వచ్చిన సంజయ్ అక్కడ మెగా హీరోస్‌ని కలిశాడట. సీక్వెల్ సంగతి చర్చించారో లేదోగానీ... ఈ కలయిక కన్నులపండువగా ఉంది కదూ!



పన్నెండు గెటప్పుల్లో

బాలీవుడ్‌లో షకీలా బయోపిక్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. రిచా చద్దా లీడ్ రోల్ చేస్తోంది. షూటింగ్ పూర్తయిపోవచ్చింది. రిలీజ్ డేట్ కూడా ఫిక్స్ చేయనున్నారు. అయితే ఈలోపు సినిమాని డిఫరెంట్‌గా ప్రమోట్ చేయాలని ప్ర యత్నిస్తోంది చిత్ర బృందం. ఆ క్రమంలో ఒక క్యాలెండర్‌ను రిలీజ్ చేయబోతు న్నారు. అప్పట్లో షకీలా చేసిన పన్నెండు చిత్రాల పోస్టర్లలో ఉన్న గెటప్పులతో రిచాని ఫొటోలు తీశారట. వాటితోనే క్యాలెండర్‌ని డిజైన్ చేశారట. ఆల్రెడీ దుస్తు లు లేకుండా కేవలం ఆభరణాలతో విడుదల చేసిన రిచా ఫస్ట్ లుక్ దుమారం రేపింది. ఈ క్యాలెండర్ ఎలాంటి సెన్సేషన్ సృష్టిస్తుందో.



మరో లేడీ ఓరియెంటెడ్ చిత్రం

కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్లో తెరకెక్కనున్న చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యింది. నరేంద్ర దర్శకత్వంలో మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి కల్యాణ్ రామ్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత దిల్‌రాజు, పరుచూరి గోపాలకృష్ణ, యలమంచిలి రవిశంకర్, స్రవంతి రవికిషోర్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు. అనంతరం కీర్తి సురేష్ మాట్లాడుతూ "తెలుగులో మహానటి తర్వాత చేస్తోన్న సినిమా. మహిళా ప్రధాన చిత్రం. ప్రతి అమ్మాయి కనెక్ట్ అవుతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "2016 నుండి ఈ కథపై పని చేస్తున్నాను. అన్ని ఎమోషన్స్ కలగలిపిన కథ. ఈ కథకు కీర్తి సురేష్ తప్ప మరెవరూ సూట్ కారు. 75 శాతం అమెరికాలో తీస్తాం. ఫిబ్రవరిలో షూటింగ్ స్టార్టవుతుంది" అన్నారు. మహానటి లాంటి చిత్రం తర్వాత కీర్తి తమ బ్యానర్‌లో సినిమా చేయడం ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు నిర్మాత.



నెక్ గుడ్ల ధరలు (100కు)

	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.453	రూ.5.15
వరంగల్	రూ.455	రూ.5.15

మార్కెట్

సెన్సెక్స్ 36,106 (↓106)

నిఫ్టీ 10,821 (↓34)

పేరు కావాలంటే షేర్లివ్వండి

సెలబ్రిటీల నయా ట్రెండ్



- ఎండార్స్‌మెంట్స్ డీల్స్‌లో భాగంగా కంపెనీల నుంచి వాటాలు
- లాంగ్ టర్మ్‌లో సంపద పెంచుకోవడం కోసమే..
- మోస్ట్ వాల్యుబుల్ సెలబ్రిటీ బ్రాండ్‌గా విరాట్

న్యూఢిల్లీ: సెలబ్రిటీల ఎండార్స్‌మెంట్లు మన మార్కెట్లోనూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. టాప్ వాల్యుబుల్ సెలబ్రిటీలుగా రికార్డులు సృష్టిస్తోన్న క్రికెట్ దిగ్గజాలు, బాలీవుడ్ అగ్రతారలు బ్రాండ్ ఎండార్స్‌మెంట్ డీల్స్‌లో లిక్విడ్ నగదును పక్కనపెట్టి, కంపెనీల్లో షేర్లను పొందుతూ కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని నగదు చెల్లించే కంటే షేరు ఇవ్వడం వల్ల తమకూ భారం తగ్గుతోందని కంపెనీలూ ఇష్టపడుతున్నాయి. ఇది ఇటు కంపెనీలకు, అటు సెలబ్రిటీలకు ఎంతో ఉపయోగపడుతోంది. కంపెనీలు వెనువెంటనే భారీ మొత్తంలో నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఈ డీల్స్ సహకరిస్తుండగా.. సెలబ్రిటీలు దీర్ఘకాలికంగా తమ సంపదను పెంచుకోవడానికి ఈ వాటాలు సాయపడుతున్నాయి. తాజాగా గ్లోబల్ వాల్యుయేషన్ అండ్ కార్పొరేట్ ఫైనాన్స్ అడ్వయిజర్స్ డఫ్ అండ్ ఫెల్ప్స్ విడుదల చేసిన టాప్ 20 మోస్ట్ వాల్యుబుల్ సెలబ్రిటీ జాబితాలో టాప్ ఎండార్సర్లుగా విరాట్ కోహ్లి మొదటి స్థానంలో నిలువగా.. దీపికా పడుకోన్ రెండో స్థానంలో ఉన్నారు. వీరిద్దరూ కూడా ఎండార్స్‌మెంట్ డీల్స్‌ను వాటాల రూపంలోనే కుదుర్చుకున్నట్టు తెలిసింది. బ్రాండ్‌తో సుదీర్ఘకాలం పాటు భాగస్వామ్యం కావడం, కంపెనీ పర్‌ఫార్మెన్స్ బట్టి సంపదను పెంచుకోవడం కోసం సెలబ్రిటీలు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

వరుసగా రెండో సారి...

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి వరుసగా రెండో ఏడాది మోస్ట్ వాల్యుబుల్ సెలబ్రిటీ బ్రాండ్‌గా నిలిచారు. తన బ్రాండ్ విలువను 2018లో 17.08 కోట్ల డాలర్లకు పెంచుకున్నారు. డఫ్ అండ్ ఫెల్ప్స్ నాలుగో ఎడిషన్ రిపోర్టు ప్రకారం.. 2018 నవంబర్ నాటికి విరాట్ కోహ్లి 24 బ్రాండ్లను ఎండార్స్ చేసుకున్నారు. ఈయన తర్వాత బాలీవుడ్ నటి, కొత్త పెళ్లి కూతురు దీపికా పడుకోన్ ఉన్నారు. చివరి ర్యాంకింగ్ నుంచి ఒక్కసారిగా 10.25 కోట్ల డాలర్ల సంపదతో రెండో సెలబ్రిటీ బ్రాండ్‌గా చోటు దక్కించుకున్నారు. నవంబర్ 2018 నాటికి 21 బ్రాండ్ల ఎండార్స్‌మెంట్‌కు ఆమె ఒప్పందాలు కుదుర్చుకున్నారు. టాప్ 20 సెలబ్రిటీల బ్రాండ్స్ సంపద మొత్తంగా 87.7 కోట్ల డాలర్లుగా ఉంది. దానిలో 75 శాతం సంపద టాప్ 10 సెలబ్రిటీల వద్దనే ఉన్నట్టు రిపోర్టులో తేలింది. బాలీవుడ్ యాక్టర్ అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్‌లు కూడా తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపరుచుకున్నారు. దీపికా తర్వాత అక్షయ్ 6.73 కోట్ల డాలర్ల వాల్యుయేషన్‌తో మూడో స్థానాన్ని, 6.3 కోట్ల డాలర్ల వాల్యుయేషన్‌తో రణ్‌వీర్ నాలుగో స్థానాన్ని పొందారు. అయితే కింగ్ ఖాన్ షారుఖ్ మాత్రం రెండో స్థానం నుంచి ఐదో స్థానానికి పడిపోయారు. ఆయన వాల్యుయేషన్ 6.07 కోట్ల డాలర్లు.

బాలీవుడ్ స్టార్లకు గట్టి పోటీగా క్రీడా దిగ్గజాలు..

టాప్ 20 సెలబ్రిటీల్లో బాలీవుడ్ తారలు అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, వారికి ఏ మాత్రం తీసిపోని విధంగా క్రీడా దిగ్గజాలు కూడా వారికి గట్టి పోటీ ఇచ్చారని డఫ్ అండ్ ఫెల్ప్స్ మేనేజింగ్ డైరెక్టర్ అవిరాల్ జైన్ తెలిపారు. విరాట్ కోహ్లి, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని, పీవీ సింధులు కలిసి మొత్తంగా 24.1 కోట్ల డాలర్ల బ్రాండ్ విలువను తమ సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం టాప్ 20 సెలబ్రిటీల బ్రాండ్ వాల్యులో ఇది 27 శాతానికి పైననే. ప్రస్తుతం యూత్‌ను ఎక్కువగా ఆకర్షిస్తోన్న ఈకామర్స్, రిటైల్, ఎఫ్‌ఎంసీజీ, స్మార్ట్‌ఫోన్స్ కంపెనీలు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ కోసం సెలబ్రిటీల వైపు చూస్తున్నాయి. అలాంటి బ్రాండ్స్ ఎండార్స్‌మెంట్లను కుదుర్చుకోవడానికే సెలబ్రిటీలు కూడా ఎదురు చూస్తున్నట్టు డఫ్ అండ్ ఫెల్ప్స్ వాల్యుయేషన్ సర్వీసెస్ ఆసియా పసిఫిక్ లీడర్ వరుణ్ గుప్తా తెలిపారు.

పెరిగిన సెలబ్రిటీల ఎండార్స్‌మెంట్స్...

ఈఎస్‌పీ ప్రాపర్టీస్ డేటా ప్రకారం.. గత దశాబ్ద కాలంగా సెలబ్రిటీలు కుదుర్చుకున్న ఎండార్స్‌మెంట్స్ బాగా పెరిగాయి. 2007లో 650గా ఉన్న ఎండార్స్‌మెంట్స్, 2017 నాటికి 1,660కు ఎగిశాయి. వార్షికంగా ఇది 10 శాతం వృద్ధి. సెలబ్రిటీ ఎండార్సర్స్‌తో టీవీ యాడ్స్‌కు వెచ్చిస్తున్న ఖర్చు 2007లో రూ.1550 కోట్ల నుంచి 2017లో రూ.6660 కోట్లకు పెరిగింది. 2017లో మొత్తం టీవీ యాడ్స్ ఖర్చులో సెలబ్రిటీ ఎండార్సర్స్ టీవీ యాడ్స్ ఖర్చు 24 శాతంగా ఉంది. 2007లో ఇది కేవలం 5 శాతం మాత్రమే. ఈ ఏడాది యూత్‌ను ఆకట్టుకునేందుకు పవర్ కపుల్‌గా పేరున్న విరాట్, బాలీవుడ్ నటి అనుష్క శర్మలు ఇద్దరూ కలిసి ఏకంగా 40 బ్రాండ్స్‌ను ఎండార్స్ చేస్తున్నారు.

సెలబ్రిటీ ర్యాంకింగ్

సెలబ్రిటీ పేరు	2018 బ్రాండ్‌ర్యాంక్	బ్రాండ్‌విలువ
విరాట్‌కోహ్లి	1	17.09 కోట్ల డాలర్లు
దీపికా పడుకోన్	2	10.25 కోట్ల డాలర్లు
అక్షయ్‌కుమార్	3	6.73 కోట్ల డాలర్లు
రణ్‌వీర్‌సింగ్	4	6.3 కోట్ల డాలర్లు
షారుఖ్‌ఖాన్	5	6.07 కోట్ల డాలర్లు
సల్మాన్ ఖాన్	6	5.58 కోట్ల డాలర్లు
అమితాబ్‌బచ్చన్	7	4.12 కోట్ల డాలర్లు
అలియా భట్	8	3.65 కోట్ల డాలర్లు
వరుణ్‌ధావన్	9	3.16 కోట్ల డాలర్లు
హృతిక్‌రోషన్	10	3.1 కోట్ల డాలర్లు




షావోమీ నుంచి టీవీలు, సౌండ్‌బార్

న్యూఢిల్లీ: చైనా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం షావోమీ ఇండియా మార్కెట్లోకి గురువారం రెండు టీవీలను, ఒక సౌండ్‌బార్‌ను విడుదల చేసింది. 55 ఇంచుల 'మీ టీవీ 4 ఎక్స్' ధర రూ.39,999 కాగా 43 ఇంచుల 4ఏ ప్రొ ధరను రూ.22,999లుగా నిర్ణయించారు. మీ సౌండ్‌బార్ ధర రూ.4,999 ఉంటుంది. ఫ్లిప్‌కార్ట్, మీడాట్‌కామ్, మీ హోం స్టోర్ల ద్వారా వీటిని కొనుగోలు చేయవచ్చు. 4ఎక్స్‌టీవీలో ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే, 2 జీబీ ర్యామ్, ప్యాచ్‌వాల్ యూఐ, 3.5 ఎంఎం జాక్, వైఫై వంటి ఫీచర్లు ఉంటాయి. 4ఏ మోడల్‌లో 1జీబీ ర్యామ్ మాత్రమే ఉంటుంది.

ఐఎల్‌ఎఫ్‌ఎస్ ఆస్తులకు భారీ డిమాండ్

న్యూఢిల్లీ: అప్పులతో సతమతమవుతున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్‌ఎఫ్‌ఎస్) దేశవ్యాప్తంగా ఉన్న 22 ఆస్తులను విక్రయానికి పెట్టగా 30కిపైగా సంస్థల నుంచి స్పందన (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) వచ్చింది. ఈ విషయాన్ని ఐఎల్‌ఎఫ్‌ఎస్ స్టాక్ ఎక్స్‌చేంజీలకు గురువారం తెలియజేసింది. గత నెల 18 నుంచి ఆస్తుల అమ్మకం ప్రక్రియ మొదలయింది. ఈ నెల ఎనిమిది వరకు 'ఈఓఐ'లు దాఖలు చేయవచ్చు. ఆర్థిక సంస్థల నుంచి ఎక్కువగా ఈఓఐలు వచ్చాయని, వీటిని పరిశీలిస్తున్నామని కంపెనీ తెలిపింది. ఈఓఐలు దాఖలు చేసిన కంపెనీలు బిడ్లు దాఖలు చేసేందుకు వీలుగా పూర్తి సమాచారం అందిస్తామని పేర్కొంది.



హోండా నుంచి 'కొత్త సిటీ'

న్యూఢిల్లీ: హోండా కార్ల కంపెనీ తన మిడ్ సైజ్ సెడాన్ 'సిటీ'లో కొత్త వేరియంట్‌ను విడుదల చేసింది. దీని ఢిల్లీ ఎక్స్ షోరూం ధరను రూ.12.75 లక్షలుగా నిర్ణయించింది. 'జెడ్ఎక్స్ ఎంటీ' పేరుతో పిలిచే ఈ మోడల్‌లో 1.5 లీటర్ పెట్రోల్ పవర్‌ట్రెయిన్ ఇంజన్, మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, రియర్ పార్కింగ్ సెన్సర్స్, ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆటోమేటిక్ హెడ్‌లైట్స్, రేన్ సెన్సింగ్ వైపర్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి.



మారుతి కార్ల ధరలు పెరిగినయ్

న్యూఢిల్లీ: ముడి సరుకుల ధరలు, రూపాయి మారకం విలువ పెరగడం వల్ల కొన్ని మోడళ్ల ధరలను రూ.10 వేల వరకు పెంచామని మారుతీ సుజుకీ గురువారం ప్రకటించింది. ధరల పెంపు తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే ఏయే మోడళ్లపై ధరలు పెంచారనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. మారుతీ సుజుకీలో అతి తక్కువ ధర ఉన్న ఆల్టోకారు ధరలు రూ.2.53 లక్షల నుంచి ప్రారంభమవుతాయి. ఎస్‌క్రాస్ మోడల్‌కు అత్యధికంగా రూ.11.45 లక్షల (ఢిల్లీ ఎక్స్‌షోరూం ధరలు) ధర ఉంది.



హువావే వై9 @ 15,990

చైనా స్మార్ట్‌ఫోన్ మేకర్ హువావే మిడ్‌రేంజ్ స్మార్ట్‌ఫోన్ 'వై9'ను గురువారం ఇండియా మార్కెట్లో విడుదల చేసింది. మిడ్‌నైట్ బ్లాక్, సఫైర్ బ్లూ రంగుల్లో లభించే ఈ ఫోన్ ధర రూ.15,990. ఫోన్ ముందూ వెనుకా డ్యూయల్ కెమెరాలు దీని ప్రత్యేకత. 6.5 ఇంచుల ఫుల్‌వ్యూ డిస్‌ప్లే, కిరిన్ 710 ప్రాసెసర్, 4,000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫింగర్ ప్రింట్ సెన్సార్, 4జీబీ ర్యామ్, 64జీబీ మెమొరీ అండ్రాయిడ్ 8.0 వంటి ఫీచర్లు ఉన్నాయి.

క్రాన్‌ఫీల్డ్ యూనివర్సిటీతో ఎస్ఆర్ఐఎక్స్ భాగస్వామ్యం

హైదరాబాద్, వెలుగు: ఎస్ఆర్ఐఎక్స్ (ఎస్ఆర్ ఇనోవేషన్ ఎక్స్చేంజ్) యుకేకు చెందిన క్రాన్‌ఫీల్డ్ యూనివర్సిటీ తో ఒప్పందం కుదుర్చుకుంది. బ్రిటిష్, ఇండియన్ స్టార్టప్స్ కు కొత్త బిజినెస్ వృద్ధి అవకాశాల తో పాటు అకెడమిక్ నైపుణ్యం కొరకు ఈ భాగస్వామ్యం దోహదపడనుంది. ఈ ఒప్పందం కింద 10 వారాల పాటు ఇండియన్ స్టార్టప్ కంపెనీలకు ఉన్నత క్రాన్‌ఫీల్డ్ అకెడమిక్స్ యుకే లో మెంటార్షిప్ ను అందిస్తారు. దీంతో పాటు ఎస్ఆర్ఐఎక్స్ లో తయారీ రంగం పై క్రాన్‌ఫీల్డ్ ప్రత్యేక తరగతులను నిర్వహించనుంది. తయారీ రంగంలోని కార్పోరేట్ క్లైంట్స్ కు వినూత్న ప్రోగ్రామ్స్ ను డిజైన్ చేయడానికి ఎస్ఆర్ఐఎక్స్ కు క్రాన్‌ఫీల్డ్ తోడ్పాటునందించనుంది. క్రాన్‌ఫీల్డ్ తో భాగస్వామ్యంతో బ్రిటిష్, ఇండియన్ ఎంట్రెప్రెన్యూర్లకు దోహదపడేలా ప్రత్యేక ప్రోగ్రామ్స్ ను తయారు చేస్తామని, దీంతో పాటు అంతర్జాతీయంగా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఎస్ఆర్ఐఎక్స్ సీఈవో శ్రీదేవి దేవిరెడ్డి తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నెంబర్ల ఈ–వేలం

హైదరాబాద్, వెలుగు: బిఎస్ఎన్ఎల్ తమ 57 వ ఫ్యాన్సీ నెంబర్ వేలం ప్రక్రియను ప్రారంభించనుంది. ఈ-వేలం ద్వారా జనవరి 11 నుండి జనవరి 17 వరకు 7 రోజుల పాటు బిఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నెంబర్ల వేలం ప్రక్రియ జరుగుతుందని తెలంగాణ టెలికం సర్కిల్, హైదరాబాద్ సీజీఎమ్ వి.సుందర్ తెలిపారు. నచ్చిన నెంబర్ల కోసం వేలం లో పాల్గొనే ప్రక్రియ వంటి మరిన్ని వివరాల కు తమ వెబ్ సైట్ ను సంప్రదించాలని అన్నారు.

టీసీఎస్‌కు రూ.8,105 కోట్ల లాభం



- గత క్వార్టర్‌తో పోలిస్తే 24 శాతం పెరుగుదల
- ఒక్కో షేరుకు రూ.4 డివిడెండ్

న్యూఢిల్లీ: మనదేశంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఈ ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో ఆదాయపరంగా రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. అక్టోబరు-డిసెంబరు క్వార్టర్‌లో లాభం 24.1 శాతం పెరిగి రూ.8,105 కోట్లకు చేరుకుంది. 2017లో డిసెంబరు 31తో ముగిసిన క్వార్టర్లో రూ.6,531 కోట్ల లాభం సంపాదించింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల నుంచి భారీగా ఆదాయాలు రావడమే ఇందుకు కారణం. నిర్వహణాపరమైన ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.37,338 కోట్లకు ఎగబాకింది. బీఎఫ్‌ఎస్ఐ సెగ్మెంట్ ఆదాయం వార్షికంగా 8.6 శాతం పెరిగింది. బ్రిటన్ నుంచి వచ్చే ఆదాయంలో 25 శాతం, యూరప్ నుంచి వచ్చేదాంట్లో 17.6 శాతం పెరుగుదల నమోదయింది. ఆసియా పసిఫిక్, నార్త్ అమెరికా, లాటిన్ అమెరికా నుంచి వచ్చే ఆదాయమూ పెరిగింది. దీంతో కంపెనీ ఒక్కో షేరుకు రూ.నాలుగు డివిడెండ్ ప్రకటించింది. ఈ నెల 24న దీనిని చెల్లిస్తారు. క్లయింట్లు పెరగడం, డిజిటల్ సేవల్లో పెరుగుదల, ఆర్డర్ బుక్ పటిష్టంగా ఉండటం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని టీసీఎస్ సీఈఓ, ఎండీ రాజేశ్ గోపీనాథన్ అన్నారు. ఈ క్వార్టర్‌లో కొత్త 6,827 మందిని నియమించుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య నాలుగు లక్షల 17 వేలకు చేరిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కంపెనీ షేరు గురువారం రూ.నాలుగు నష్టపోయి రూ.1,883 వద్ద ముగిసింది.

ఇన్వెస్ట్ చేయండి.. ఈ–రెసిడెన్సీ ఇస్తాం



- తెలంగాణ ఎంట్రప్రెనూర్స్‌కి రాయబారి ఆహ్వానం
- త్వరలో తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ

హైదరాబాద్, వెలుగు: ఎస్తోనియాలో ఈ-రెసిడెన్సీ పొంది, వ్యాపారాలు పెట్టాల్సిందిగా తెలంగాణ ఎంట్రప్రెనూర్స్‌ను ఇండియాలో ఆదేశపు రాయబారి రిహో క్రువ్ ఆహ్వానిస్తున్నారు. ఈ-రెసిడెన్సీ పొందడానికి వ్యక్తిగతంగా ఎస్తోనియాకు రావాల్సిన అవసరమే లేదని, ఆన్‌లైన్‌లో అవసరమైన డాక్యుమెంట్లను ఇవ్వడం ద్వారా పొందే వీలును కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపుతో డిజిటల్ ఐడి ఈ ప్రోగ్రామ్ కింద ఇస్తారని, వెంటనే వ్యాపారం మొదలు పెట్టుకోవచ్చని వెల్లడించారు. ఇప్పటిదాకా మొత్తం 50 వేల మంది, ఇండియా నుంచి 2,174 మంది ఈ-రెసిడెన్సీ పొందారని, ఇండియన్స్‌లో 275 మంది ఎస్తోనియాలో కంపెనీలు పెట్టారని తెలిపారు. 200 ఇండియన్స్ కంపెనీలు కిందటేడాదే అంటే 2018 లోనే మొదలయ్యాయని అన్నారు. ఐసీటీ పవర్‌హౌస్‌గా పేరొందిన ఎస్తోనియాలో, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బ్లాక్‌చైన్, డిజిటల్ టెక్నాలజీలలో కంపెనీలు పెట్టేందుకు ఇండియన్స్ ఆసక్తితో వున్నారని చెప్పారు. రిలయన్స్ జియో సబ్సిడరీని ముఖేష్ అంబానీ ఎస్తోనియాలో ఇటీవల పెట్టారని గుర్తు చేశారు. వంద శాతం ఓనర్‌షిప్‌తో వ్యాపారం పెట్టుకోవచ్చని, ఒకేసారి 100 డాలర్లు చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌లో భాగం కాబట్టి, ఎస్తోనియాను గేట్‌వేగా వాడుకుని మొత్తం యూరోపియన్ యూనియన్‌లో వ్యాపారం చేసుకోవడానికి వీలుంటుందని రిహో క్రువ్ చెప్పారు. వచ్చే లాభాలను తమ దేశంలోనే విస్తరణకు వినియోగిస్తే, పన్నులే వుండవని తెలిపారు. త్వరలో తెలంగాణ ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అవకాశం వుందని, ఇందుకోసం ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌తో చర్చలు జరుగుతున్నాయని కూడా వెల్లడించారు.

త్వరలో హెచ్‌డీఎఫ్‌సీ విస్తరణ



హైదరాబాద్, వెలుగు: తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది మార్చి చివరినాటికి 7 బ్రాంచీలు ప్రారంభించనున్నట్లు హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ తెలిపింది. దీన్లో హైదరాబాద్ లో 2 బ్రాంచీలు ప్రారంభిస్తామని, ఇప్పటికే తెలంగాణ లో 14 బ్రాంచీలు, ఏపి లో 11 బ్రాంచీలు ప్రారంభించామని హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ సౌత్ జోనల్ హెడ్ మధుసూదన్ హెగ్డే తెలిపారు. డిసెంబర్ 31 నాటికి డిపాజిట్స్ లో 23 శాతం, అడ్వాన్సెస్ లో 24 శాతం వృద్ధి సాధించినట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో 3వ అతిపెద్ద బ్యాంక్ గా హెచ్ డిఎఫ్ సి అవతరించగా, ప్రైవేట్ బ్యాంకుల్లో మొదటి స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో తమ బ్యాంకుల్లో మొత్తం 9 వేల ఉద్యోగులు పనిచేస్తుండగా, కేవలం తెలంగాణలో 6 వేలకు పైగా ఉద్యోగులున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 208 బ్రాంచీలు కలిగి ఉన్నామని చెప్పారు. యేటా 500-600 వరకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు మధుసూధన్ తెలిపారు.

రన్ ఫర్ గ్రీన్

హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ రెండవ ఎడిషన్ సేవ్ థాన్ ను ఫిబ్రవరి 10 న నెక్లెస్ రోడ్ లోని సంజీవయ్య పార్కులో నిర్వహిస్తున్నట్లు బ్యాంకు వెల్లడించింది. గతేడాది నీటి పరిరక్షణ థీమ్ తో సేవ్ థాన్ నిర్వహించగా, ఈ యేడాది గో ఫర్ గ్రీన్ పేరిట మొక్కలు నాటడాన్ని ప్రోత్సహించే విధంగా 5కే, 10కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపింది. హైదరాబాద్ వ్యాప్తంగా 25 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు బ్యాంక్ సౌత్ హెడ్ మధుసూధన్ హెగ్డే తెలిపారు. గతేడాది 5 వేల రన్నర్లు పాల్గొనగా, ఈ సారి 8 వేల మంది పాల్గొంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ హాజరయ్యారు.

ఎగుమతులకు మరిన్ని రుణాలివ్వాలి

న్యూఢిల్లీ: విదేశాలకు భారీగా సరుకులను విక్రయించాలంటే ఎగుమతిదారులకు తగిన సమయంలో అవసరమున్నంత అప్పును బ్యాంకులు ఇచ్చేలా ప్రభుత్వం, ఆర్‌బీఐ చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఈపీసీ) పేర్కొంది. ఎగుమతుల రంగానికి వార్షిక గ్రాస్ బ్యాంక్ క్రెడిట్ 54 శాతం తగ్గిందని తెలిపింది. 2017 నాటికి బ్యాంకులు రూ.43,400 కోట్లు అప్పులు ఇవ్వగా, 2018లో ఇచ్చిన అప్పులు రూ.19,700 కోట్లు మాత్రమేనని పేర్కొంది. అమెరికా-చైనా వాణిజ్యయుద్ధం, బ్రెగ్జిట్ వంటి అడ్డంకుల వల్ల ఎగుమతులు నీరసించిన నేపథ్యంలో, బ్యాంకు రుణాలు తగ్గడం మరింత ఆందోళన కలిగిస్తోందని ఈఈపీసీ చైర్మన్ రవి సెహగల్ అన్నారు. ఇంజనీరింగ్ సెగ్మెంట్‌కు అప్పులు ఇవ్వడం తగ్గిందని, ఎగుమతిదారులకు బ్యాంకు రుణాలే కీలకం కాబట్టి ఈ సమస్యను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరారు. రెండేళ్ల కంటే ఎక్కువ గడువు ఉన్న షిప్‌మెంట్ బిల్లులను తిరస్కరించాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఇండియా ఎగుమతుల్లో ఇంజనీరింగ్ సెగ్మెంట్ వాటా 26 శాతం వరకు ఉంటుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 7600 కోట్ల డాలర్ల విలువ గల సరుకులను పంపించామని రవి చెప్పారు.



మేరీకోమ్ నెం. 1

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ తాజా ర్యాంకుల్లో ఇండియా స్టార్ బాక్సర్ మేరీకోమ్ నంబర్‌వన్ ప్లేస్‌లో నిలిచింది. నవంబర్‌లో ముగిసిన ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 48 కిలోల విభాగంలో టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించిన మేరీ 1700 పాయింట్లతో టాప్ ప్లేస్‌కు చేరుకుంది. 2018లో కామన్‌వెల్త్ గేమ్స్‌లోనూ, పోలండ్‌లో జరిగిన టోర్నీలోనూ గోల్డ్‌మెడల్స్ గెలుచుకున్న మేరీకోమ్ స్ట్రాంజా మెమోరియల్ (బల్గేరియా) బాక్సింగ్ టోర్నీలో సిల్వర్ మెడల్ సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మెడల్ కొట్టడమే టార్గెట్‌గా పెట్టుకున్న మేరీ 51 కిలోల విభాగంలో పోటీపడాల్సి ఉంటుంది. మేరీకోమ్ ఇప్పటి దాకా పోటీపడుతున్న 48 కిలోల కేటగిరీని ఒలింపిక్స్ గేమ్స్‌రోస్టర్‌లో చేర్చలేదు. మహిళల 51 కిలోల విభాగంలో ఇండియాకు చెందిన పింకి జాంగ్రా 8వ ర్యాంక్‌లో నిలిచింది. ఇక ఆసియన్ గేమ్స్ సిల్వర్ మెడలిస్ట్ మనిషా 54 కిలోల విభాగంలో తన ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. 64 కిలోల విభాగంలో ఇటీవల నేషనల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న సిమ్రన్‌జిత్ కౌర్ నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. ఈ విభాగంలో సరితా దేవి 16వ ర్యాంక్‌లో ఉంది.

ప్రజ్ఞేష్ ముందుకు..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి మెయిన్ డ్రాలో పోటీ పడేందుకు ప్రజ్ఞేష్ గుణేశ్వరన్ చేరువవ్వగా.. అంకితా రైనా, రామ్‌కుమార్ రామనాథన్ ఇంటిదారి పట్టారు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 112వ ర్యాంకర్ ప్రజ్ఞేష్ 6–3, 6–3తో ఎన్రిక్ లోపెజ్ పరెజ్ (స్పెయిన్)ను ఓడించాడు. ఫైనల్ రౌండ్‌లో వటానకి (జపాన్) తో తలపడనున్నాడు.
ఈ మ్యాచ్‌లో నెగ్గితే ప్రజ్ఞేష్ మెయిన్ డ్రా బెర్త్ దక్కించుకుంటాడు. కాగా, రామ్ కుమార్ 7–5, 5–7, 6–7 (6)తో రుడొల్ఫ్ మొలెకర్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో అంకిత 6–4, 2–6, 4–6తో బడొసా గిబ్రెట్ (స్పెయిన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

సెరెనాకు టఫ్ డ్రా

- క్వాలిఫయర్‌తో జొకోవిచ్ తొలి పోరు

మెల్‌బోర్న్: కెరీర్‌లో 24వ టైటిల్ కొట్టి.. అత్యధిక గ్రాండ్‌స్లామ్స్ నెగ్గిన మార్గరెట్ కోర్ట్ ఆల్‌టైమ్ రికార్డును సమం చేయాలని పట్టుదలగా ఉన్న అమెరికా టెన్నిస్ లెజెండ్ సెరెనా విలియమ్స్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కఠిన డ్రా ఎదురైంది. ఈ నెల 14న మొదలయ్యే టోర్నీలో 16వ సీడ్‌గా బరిలోకి దిగుతున్న సెరెనా డ్రాలో టఫ్ హాఫ్‌లో నిలిచింది. నాలుగో రౌండ్‌లో ఆమెకు వరల్డ్ నెంబర్ వన్ సిమోనా హలెప్ రూపంలో సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ రౌండ్‌ను దాటితే సెమీస్‌లో కరోలినా ప్లిస్కోవాతో సెరెనా తలపడే చాన్స్ కనిపిస్తోంది. డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ కరోలినా వోజ్నియాకి మూడో రౌండ్లో రష్యా బ్యూటీ మరియా షరపోవాను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఏంజెలిక్ కెర్బర్ రెండో సీడ్‌గా బరిలో నిలిచింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ తన ఏడో టైటిల్ వేటను క్వాలిఫయర్‌తో మొదలు పెట్టనున్నాడు.



హైదరాబాద్‌లో తొలి వన్డే

వైజాగ్‌లో రెండో టీ20.. ఇండియాలో ఆసీస్ టూర్ షెడ్యూల్

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల క్రికెట్ ఫ్యాన్స్‌కు తీపి కబురు. ఇండియా–ఆస్ట్రేలియా మధ్య వచ్చే నెలలో మొదలయ్యే పరిమిత ఓవర్ల సిరీస్‌ల్లో రెండు మ్యాచ్‌లకు వైజాగ్, హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇండియాలో ఆస్ట్రేలియా టూర్ షెడ్యూల్‌ను బీసీసీఐ గురువారం ఖరారు చేసింది. తొలుత రెండు టీ20లు, ఆపై ఐదు వన్డేల సిరీస్‌లో ఇండియాతో ఆసీస్ తలపడనుంది. ఫిబ్రవరి 24న బెంగళూరులో జరిగే తొలి టీ20తో ఆసీస్ టూర్ షురూ అవుతుంది. అదే నెల 27న జరిగే రెండో టీ20కి విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 2న హైదరాబాద్‌లో తొలి వన్డే జరుగుతుంది. 5న నాగ్‌పూర్‌లో రెండో వన్డే, 8న రాంచీలో మూడో వన్డే, 10న మొహాలీలో నాలుగో వన్డేను షెడ్యూల్ చేశారు. మార్చి 13న ఢిల్లీలో జరిగే ఐదో వన్డేతో ఈ సిరీస్ ముగుస్తుంది. మే 30న ఇంగ్లండ్‌లో మొదలయ్యే వన్డే వరల్డ్‌కప్ ముందు ఇండియా టూరే ఆసీస్‌కు చివరి అంతర్జాతీయ సిరీస్ కానుంది. అయితే, ఆసీస్‌తో సిరీస్ ముగిశాక ఇండియాలో విరాట్ కోహ్లీ సేన జింబాబ్వేతో సిరీస్ ఆడనుంది. ఆపై, ఐపీఎల్‌లో పోటీ పడి వరల్డ్‌కప్‌లో ఆడేందుకు ఇంగ్లండ్ బయల్దేరనుంది.

తొలి టీ20	ఫిబ్రవరి 24	బెంగళూరు	రా. 7
రెండో టీ20	ఫిబ్రవరి 27	విశాఖపట్నం	రా. 7
తొలి వన్డే	మార్చి 2	హైదరాబాద్	మ. 1.30
రెండో వన్డే	మార్చి 5	నాగ్‌పూర్	మ. 1.30
మూడో వన్డే	మార్చి 8	రాంచీ	మ. 1.30
నాలుగో వన్డే	మార్చి 10	మొహాలీ	మ. 1.30
ఐదో వన్డే	మార్చి 13	ఢిల్లీ	మ. 1.30



- ప్రతిపాదించిన సీవోఏ చీఫ్ రాయ్
- బీసీసీఐ లీగల్ సెల్ సలహా కోరిన డయానా
- పాండ్యా, లోకేశ్‌పై బోర్డు సీరియస్!
- టీవీ షోలో చెత్త వాగుడుకు క్రికెటర్లపై చర్యలు

రెండు మ్యాచ్‌ల నిషేధం!

న్యూఢిల్లీ: టీమిండియా యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్ నోటి దురుసు వారికి కష్టాలు తెచ్చిపెట్టింది. ఒక హిందీ టాక్ షోలో మహిళల పట్ల అసభ్యంగా వాగినందుకు ఈ ఇద్దరిపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాలని బీసీసీఐ పరిపాలకుల కమిటీ (సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్ ప్రతిపాదించారు. ఈ వివాదంపై నోటీసులు అందుకున్న తర్వాత క్రికెటర్లు ఇచ్చిన వివరణ పట్ల రాయ్ సంతృప్తి చెందలేదు. భవిష్యత్‌లో మరే క్రికెటర్ ఇలా నోరు జారకుండా ఉండేందుకు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే, సీవోఏ మరో సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం ఈ విషయాన్ని బీసీసీఐ లీగల్ సెల్‌కు రెఫర్ చేసింది. ఒకవేళ ఆమె కూడా బ్యాన్‌కే మొగ్గుచూపితే.. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు హార్దిక్, రాహుల్ దూరం కానున్నారు. 'హార్దిక్ ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేదు. అందుకే నేను ఇద్దరు ప్లేయర్లపై రెండు మ్యాచ్‌ల వేటు వేయాలని రికమెండ్ చేశా. అయితే, వేటు విషయమై డయానా బోర్డు లీగల్ సెల్ సలహా కోరారు. ఈ విషయంలో బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి అభిప్రాయాలను కూడా కోరినట్టు ఎడుల్జీ చెప్పారు. నిషేధంతో పాటు పాండ్యా, రాహుల్‌ను జెండర్ సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌కు (మహిళల పట్ల సున్నితంగా ఎలా వ్యవహరించాలో తెలిపే కార్యక్రమం) పంపించాలని సూచించినట్టు అనిరుధ్ తెలిపారు. అలాగే, ఆటకు సంబంధం లేని ఒక ఎంటర్‌టైన్‌మెంట్ షోకు వెళ్లేందుకు ఆ ఇద్దరూ ఎందుకు అంగీకరించారనే విషయంపై దర్యాప్తు చేస్తామన్నారు. క్రికెటర్లను కలుసుకునేందుకు స్పోర్ట్స్ జర్నలిస్టులకే అవకాశం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో వారు ఎంటర్‌టైన్‌మెంట్ షోలకు ఎలా వెళ్తారని ఆయన ప్రశ్నించారు. ఇక, టాక్ షోలో మహిళల పట్ల హార్దిక్, రాహుల్ చులకనగా మాట్లాడిన తీరు చూశాక.. అమ్మాయిలను ఎరగా వేసి ఫిక్సర్లు వారిని ట్రాప్ చేసే (హనీట్రాప్) అవకాశం ఉందని, తద్వారా మ్యాచ్–ఫిక్సింగ్‌కు ఉసిగొలిపే ప్రమాదం పొంచి ఉందని అనిరుధ్ ఆందోళన వ్యక్తం చేశారు.



మహీ.. మా మార్గదర్శి

సిడ్నీ: వెటరన్ క్రికెటర్, మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీపై టీమిండియా వన్డే వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసల వర్షం కురిపించాడు. అతను జట్టుకు మార్గదర్శిలాంటి వాడని, యువ ఆటగాళ్లు అతని నుంచి స్ఫూర్తి పొందుతారని అన్నాడు. వరల్డ్‌కప్‌లాంటి మెగా టోర్నీలో ధోనీ పాత్ర కీలకమన్నాడు. ఈ ఏడాది వేసవిలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో ఆడే టీమ్ దాదాపుగా సెటిల్ అయిందన్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌ల్లో ఆడుతున్న టీమ్‌లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. అయితే, జట్టు ఎంపిక ఫామ్, ప్రతిభ ఆధారంగానే జరుగుతుందని స్పష్టం చేశాడు. ఇంగ్లండ్ వేదికగా మే 30 నుంచి ప్రారంభం కానున్న వరల్డ్‌కప్‌నకు ముందు 13 వన్డేలు మాత్రమే ఆడనున్న కోహ్లీ సేన దాదాపుగా ఈ సిరీసుల్లో ఆడిన జట్టుతోనే మెగా ఈవెంట్ బరిలో దిగనుందన్నాడు. శనివారం ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రోహిత్ శర్మ... మన బ్యాటింగ్, ప్రత్యర్థి బౌలింగ్, వన్డే వరల్డ్‌కప్ జట్టు ఎంపిక, జట్టులో ధోనీ ప్రాధాన్యతల గురించి తన అభిప్రాయాలు వ్యక్తం చేశాడు. అవి అతడి మాటల్లోనే...

వరల్డ్‌కప్‌లో ధోనీ కీలకం

మహీ గొప్ప ఫినిషర్. అతని సామర్థ్యం గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. అతను జట్టులో ఉండటం చాలా అవసరం. ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉండే ధోనీ వికెట్ల వెనుక ఉన్నాడంటే జట్టుకు కొండంత అండ. జట్టుకు చాలా కాలం పాటు విజయవంతమైన కెప్టెన్‌గా వ్యవహరించిన ధోనీ ఇప్పటికీ తన సలహాలతో యువ ఆటగాళ్లకు ఎంతో తోడ్పడతాడు. స్పిన్నర్లు చహల్, కుల్దీప్ యాదవ్ విజయవంతమవడంలో ధోనీ పాత్ర ఎంతో ఉంది. వికెట్ల వెనక నుంచి అతనిచ్చే సలహాల వల్లే ఈ జోడీ చక్కటి ఫలితాలను రాబట్టింది. లోయర్ ఆర్డర్లో బ్యాటింగ్ చేయాలంటే ధోనీ తరవాతే ఎవరైనా. మహీ ఫినిషింగ్ నైపుణ్యం గురించి ఎంత చెప్పినా తక్కువే.. కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా ధోనీ జట్టులో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

ఒకటి రెండు తప్ప...

మెగాటోర్నీ బరిలో దిగే జట్టు ఎంపిక ఆటతీరు ఆధారంగానే జరుగుతుంది. అదే సమయంలో సరిగ్గా ఆడకపోతే టీమ్‌లో ఎవ్వరికీ గ్యారంటీ లేదు. ఫామ్ లేకుంటే ఎవరిపై అయినా వేటు ఖాయం. అయితే, ప్రస్తుత జట్టులో భారీ మార్పులు జరుగుతాయని నేనైతే అనుకోవడం లేదు. ఫామ్, గాయాల దృష్ట్యా ఒకటి రెండుమార్పులు ఉండొచ్చు. ఏడాదిగా మేము చాలా క్రికెట్ ఆడాం. అలాంటి సమయంలో గాయాలు సహజం. వాటి బారిన పడకుండా ఉత్తమ ప్రదర్శన కనబరచడం ముఖ్యం. ప్రపంచకప్‌కు సన్నద్ధమవుతున్న సమయంలో ఆసీస్ సిరీస్ కీలకం. టాపార్డర్ విఫలమైతే ఆ తర్వాత రాయుడు, కార్తీక్, ధోనీ, జాదవ్ జట్టు భారం మోయాలి.

స్టార్క్, కమిన్స్ లేకున్నా...

ప్రస్తుత వన్డే సిరీస్‌లో పేసర్లు మిచెల్ స్టార్క్, కమిన్స్, హేజల్‌వుడ్ లేకున్నా ఆస్ట్రేలియా బౌలింగ్ బలహీనంగా ఉంటుందని అనుకోవడం లేదు. ఎందుకంటే గతంలో (2016) మేము ఇక్కడ పర్యటించినప్పుడు ఆ ముగ్గురూ జట్టులో లేరు. అయినప్పటికీ టీమిండియా 1-4తో సిరీస్ కోల్పోయింది. వారి బౌలింగ్ బెంచ్ బలంగా ఉందనడానికి ఇదో ఉదాహరణ. ఇప్పుడు కూడా అంతే. ఆ ముగ్గురు లేకపోయినా ఆసీస్ జట్టులో మేటి పేసర్లకు కొదవలేదు. మన బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టగల నైపుణ్యం వారిలో ఉంది. కానీ మేము వారిని ఒత్తిడిలోకి నెట్టేందుకు యత్నిస్తాం.

రాయుడు అదుర్స్...

ఇండియాలో జరిగిన గత సిరీస్‌లో అంబటి రాయుడు ఆకట్టుకున్నాడు. అతను మిడిలార్డర్‌లో నమ్మకమైన బ్యాట్స్‌మన్. దినేశ్ కార్తీక్ బాధ్యతలను భుజానెత్తుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఇక మూలస్తంభం మహేంద్ర సింగ్ ధోనీ ఉండనే ఉన్నాడు. కేదార్ జాదవ్ అటు బంతితో వికెట్లు తీయడంతో పాటు ఇటు బ్యాట్స్‌తోనూ ఆకట్టుకోగలడు. చివరి ఓవర్లలో భారీ షాట్లు ఆడటంలో అతను దిట్ట. ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా కీలక పాత్ర పోషించడం ఖాయం.

ఇండియాకు నిరాశ

యూఏఈ చేతిలో ఛెత్రి సేన ఓటమి

అబుదాబి: ఆసియా కప్‌లో ఇండియా జోరు కొనసాగించలేకపోయింది. గ్రూప్–ఎలో భాగంగా గురువారం జరిగిన తమ రెండో మ్యాచ్‌లో సునీల్ ఛెత్రి నేతృత్వంలోని ఇండియా 0-2 తేడాతో ఆతిథ్య యూఏఈ చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో పటిష్ఠ థాయ్‌లాండ్‌ను మట్టికరిపించిన ఉత్సాహంలో బరిలోకి దిగిన మన జట్టు.. వచ్చిన అవకాశాలను సద్వినియోగం



చేసుకోలేక నిరాశ పరిచింది. తమ కంటే ఎన్నో రెట్లు మెరుగైన అరబ్ టీమ్‌కు తొలుత గట్టి పోటీ ఇచ్చినా.. మ్యాచ్ సాగుతున్న కొద్దీ ఆ తీవ్రత కనబరచలేకపోయింది. అరబ్ టీమ్ తరఫున 41వ నిమిషంలో ఖల్ఫన్ ముబారక్, 88 నిమిషంలో అలీ అహ్మద్ చెరో గోల్ కొట్టారు. సోమవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో బహ్రెయిన్‌తో ఇండియా పోటీ పడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే మన జట్టు నాకౌట్ రేసులో నిలుస్తుంది.
మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లూ నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. మొదటి నుంచే ఇండియా.. ఎదురుదాడికి దిగింది. చాలా సార్లు గోల్ కొట్టేందుకు దగ్గరగా వచ్చినా దురదృష్టం వెంటాడింది. ఎనిమిదో నిమిషంలో దక్కిన కార్నర్‌ను సందేశ్ జింగాన్ ... ఫ్రీ హెడర్‌తో గోల్ కొట్టే ప్రయత్నం చేయగా.. బంతి పోస్ట్ పైనుంచి వెళ్లింది. ఆ తర్వాత సునీల్ ఛెత్రి నుంచి బంతి అందుకున్న ఆషిక్ ఎడమ కాలితో కొట్టిన షాట్‌ను యూఏఈ కీపర్ అడ్డుకున్నాడు. 17వ నిమిషంలో సునీల్ ఛెత్రి గోల్ చేసినంత పని చేశాడు. అనిరుధ్ థాపా నుంచి క్రాస్ అందుకున్న ఛెత్రి సెంటర్ బాక్స్ నుంచి కొట్టిన హెడర్‌ను ప్రత్యర్థి కీపర్ సేవ్ చేశాడు. ఈ దశలో జోరు పెంచిన హోమ్ టీమ్ దాడులు పెంచింది. 41వ నిమిషంలో బాక్స్ రైట్ సైడ్‌లో అలీ అహ్మద్ నుంచి పాస్ అందుకున్న ఖల్ఫన్ ముబారక్.. ఇండియా డిఫెండర్లను తప్పిస్తూ గోల్ కొట్టి హోమ్ టీమ్ శిబిరంలో ఉత్సాహం నింపాడు. తర్వాతి నిమిషంలోనే ఛెత్రి కొట్టిన గ్రౌండ్ షాట్ బార్ ఎడమవైపు నుంచి పక్కకు వెళ్లిపోయింది. సెకండాఫ్ 55వ నిమిషంలో ఉదాంత సింగ్ రైడ్ సైడ్ నుంచి కొట్టిన షాట్‌కు క్రాస్ బార్ కింది వైపునకు తగిలిన బంతి బయటకు వచ్చేసింది. ఆపై 58వ నిమిషంలో డైరెక్ట్ ఫ్రీ కిక్‌కు లెఫ్ట్ సైడ్ నుంచి ఛెత్రి కొట్టిన షాట్ వైడ్‌గా వెళ్లింది. ఆ తర్వాత బంతిని చాలా మట్టుకు తన నియంత్రణలోనే ఉంచుకున్న యూఏఈ.. ఛెత్రి సేనకు అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలో, 88వ నిమిషంలో అలీ అహ్మద్ మరో గోల్ కొట్టి యూఈఏ స్కోరు డబుల్ చేశాడు.

సెమీస్‌లో బెంగళూరు

సత్తా చాటిన ప్రణీత్, శ్రీకాంత్

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో బెంగళూరు రాప్టర్స్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ఇక్కడ జరిగిన నాలుగో సీజన్ చివరి లీగ్‌లో రాప్టర్స్ 3-2తో చెన్నై స్మాషర్స్‌ను చిత్తు చేసింది. ఆరు పాయింట్లు గెలిస్తేనే సెమీస్‌కు చేరే చాన్స్ ఉన్న చెన్నై చివరి లీగ్‌లో చేతులెత్తేసింది. పురుషుల డబుల్స్‌లో మొహమ్మద్ అహ్‌సాన్–హెంద్రా సెతీవాన్ (రాప్టర్స్) జోడీ 15-14, 9-15, 11-15తో క్రిస్ అడ్‌కాక్-చిన్ చుంగ్ జంట చేతిలో ఓడింది. ఆ తర్వాత ప్రత్యర్థి ట్రంప్ మ్యాచ్‌లో సాయి ప్రణీత్... తమ ట్రంప్‌లో కిడాంబి శ్రీకాంత్ సత్తా చాటడంతో మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే బెంగళూరు రాప్టర్స్ 3-0తో గెలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. తొలి సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 15-11, 15-12తో పారుపల్లి కశ్యప్ (స్మాషర్స్)ను ఓడించగా... రెండో సింగిల్స్‌లో శ్రీకాంత్ 15-10, 15-10తో వెయి ఫెంగ్ చాంగ్ (స్మాషర్స్)పై విజయం సాధించాడు. నామమాత్రమైన మహిళల సింగిల్స్‌లో సంగ్ జీ హ్యూన్ (స్మాషర్స్) 15-10, 14-15, 15-10తో తి ట్రాంగ్ వూ (రాప్టర్స్)పై... చివరగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రిస్ అడ్‌కాక్–గాబ్రియల్ అడ్‌కాక్ (స్మాషర్స్) జంట 15-8, 12-15, 15-4తో మార్కస్ ఎలీస్-లౌరెన్ స్మిత్ (రాప్టర్స్) ద్వయంపై విజయం సాధించినా ఫలితం లేకపోయింది. లీగ్ దశ ముగిసేసరికి అవధ్ వారియర్స్ (25 పాయింట్లు), హైదరాబాద్ హంటర్స్ (24 పాయింట్లు), బెంగళూరు రాప్టర్స్ (21 పాయింట్లు), ముంబై రాకెట్స్ (19 పాయింట్లు) తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి.

సెమీస్‌లో ఎవరితో ఎవరు

అవధ్ X బెంగళూరు
శుక్రవారం రా. 7 నుంచి

ముంబై x హైదరాబాద్
శనివారం : రా. 7 నుంచి



శ్రీకాంత్



ఆకాశాన్ని చీల్చిన

భూమి మెరుపులు

ఇవి మామూలు మెరుపులు కాదు. అసాధారణ మెరుపులు.. భూమి నుంచి వెళ్లి ఆకాశాన్ని చీల్చిన మెరుపులు. మామూలుగా అయితే మెరుపులు పై నుంచి కిందకు వస్తుంటాయి. కానీ, ఈ మెరుపులు మాత్రం.. కింది నుంచి పైకి వెళ్లాయి. ఓ రకంగా భూమి పుట్టించిన మెరుపులే. ఇంకా చెప్పాలంటే పర్యావరణ మార్పులే ఈ అసాధారణ మెరుపులకు కారణమయ్యాయట. అంటే పెద్ద పెద్ద బిల్డింగులు, సెల్‌ఫోన్ టవర్లు, విండ్ టర్బైన్ల వల్ల ఈ మెరుపులు పుడతాయట. అవి ఉండే ప్రదేశాల్లోనే ఈ రివర్స్ మెరుపులు పుట్టుకొస్తాయట. అదే ఇక్కడ ప్రత్యేకత. అలాంటి ప్రదేశాల్లోని పాజిటివ్ (ధనాత్మక) చార్జ్‌తో కూడిన కరెంట్.. పై నుంచి వచ్చే నెగెటివ్ (రుణాత్మక) చార్జ్‌తో ఆకర్షితమై ఈ అసాధారణ మెరుపులు వస్తాయని సైంటిస్టులు చెబుతున్నారు. భూమి నుంచి ఇలా మెరుపులు పుట్టుకురావడానికి కేవలం ఒక్క శాతమే అవకాశం ఉంటుందని అంటున్నారు. బ్రెజిల్ సావో



పాలోలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ రీసెర్చ్ (ఐఎన్‌పీఈ) సైంటిస్టులు హైస్పీడ్ కెమెరాలతో ఈ అసాధారణ చర్యను బంధించారు. ఓ బిల్డింగ్ మీద ఈ కెమెరాను పెట్టారు. ఒక్క సెకనులో దాదాపు 4000 ఫ్రేములను ఇది రికార్డు చేస్తుంది.

యాపిల్ మ్యాప్స్ వచ్చేసింది

ఎక్కడికైనా వెళ్లాలి.. దారి తెలియదు.. వెంటనే గుర్తొచ్చేది గూగుల్ మ్యాప్స్. ఆండ్రాయిడ్ అయినా, ఐఫోన్ అయినా.. నావిగేషన్‌కు గూగుల్ మ్యాప్సే శరణ్యం. ఇప్పుడు దానికి పోటీగా యాపిల్ కూడా మ్యాప్స్‌ను తెచ్చింది. అమెరికా వంటి దేశాల్లో ఇప్పటికే 'టర్న్ బై టర్న్' అనే యాపిల్ నావిగేషన్‌ను వాడుతున్నారు. అది ఇండియాలో లేదు. యాపిల్ ఫోన్లలోనూ ఆ ఫీచర్ లేదు. ఇప్పుడు తీసుకొచ్చేసింది యాపిల్ సంస్థ. గురువారం ఆ విషయాన్ని సంస్థ ధ్రువీకరించింది కూడా. సిరి సహా, యాపిల్‌లో ఉండే కొన్ని ఫీచర్లతో దానిని అనుసంధానించారు. వెళ్లాల్సిన దూరం, పట్టే టైంతో సహా మ్యాప్స్‌లో వివరాలుంటాయి. ఇంకో ప్రత్యేకత ఏంటంటే స్థానిక ప్రాంతం,



నడక దారులనూ అందులో పొందుపచడం. త్రీడీ మ్యాప్స్ ఫీచర్‌ను మాత్రం అందుబాటులోకి తేలేదు.

అయినా.. ఆమే బాధితురాలు

అత్యాచార బాధితులను ఇంకా ఏడిపిస్తున్న సమాజం ● కోలుకోకుండా పీక్కుతింటున్నారంటున్న రేప్ సర్వైవల్స్

ఘజియాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్ నుంచి ఓ 15 ఏళ్ల బాలిక ఇంటికి బయలుదేరింది. అప్పటికింకా చీకటి పడలేదు. సుమారు 5.30 గంటలవుతోంది. శనివారం కావడంతో సిటీ బిజీగా ఉంది. ముగ్గురు వ్యక్తులు ఆమెను వెంబడిస్తూ ఏడిపించడం మొదలెట్టారు. పేరు పెట్టి పిలవసాగారు. చివరికి తన బండి ఆపి కీ లాక్కున్నారు. తాకడం మొదలెట్టారు. ఆ తతంగాన్ని చూసిన కొందరు స్థానికులు అక్కడికి రావడంతో ఆ గ్యాంగ్ పరారైంది. కానీ స్థానికులు వెళ్లాక మళ్లీ ఆమెను వెంబడించారు వాళ్లు. ఇంటికి చేరుకునే వరకు వదల్లేదు. వాళ్లకు తెలుసు ఆమెవరో. 'బులంద్‌షహర్ ఘటన అమ్మాయివి నువ్వే కదా?' అని ఒకడు అడిగాడు. ఇంతకుముందు కూడా ఇలాంటి ఘటన జరిగింది. అప్పుడు ఇద్దరు వ్యక్తులు వెంబడించారు. ఇంత జరిగినా తనేం చేయలేకపోయింది. అలా ఆమెను ఎందుకు ఏడిపిస్తున్నారంటే ఆమె అత్యాచార బాధితురాలు. 2016 జూలైలో ఆ బాలిక తన కుటుంబంతో కలసి నోయిడా నుంచి యూపీలోని ఓ ప్రాంతానికి బయలుదేరింది. మధ్యలో కొందరు దుండగులు వాళ్లను అడ్డుకున్నారు. మగవారిని కట్టేసి ఆ బాలిక, వాళ్ల అమ్మపై అత్యాచారం చేశారు. ఆ వార్త దేశవ్యాప్తంగా సంచలనమైంది. అయితే కఠినమైన చట్టాలుండటం వల్ల వాళ్ల పేరు బయటకు రాలేదు. కానీ చాలా కేసుల్లో అత్యాచార బాధితులు మళ్లీ మళ్లీ బాధితులవుతున్నారు. ఆ భయంకరమైన ఘటన నుంచి కోలుకోకుండా సాటివారు ఏడిపిస్తున్నారు. (పేర్లు మార్చి ఇస్తున్న కొందరి కథలు)

షబ్నం కన్నీటి కథ

మరో బాధితురాలు షబ్నం కథ ఇది. భర్త, పిల్లలతో థాణేలో నివసించేది. 2017 ఆగస్టులో పండుగ రోజు అక్కడి వీధిలోని ఓ వ్యక్తి ఆమెపై దౌర్జన్యం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు. కానీ అప్పటి నుంచే ఆమెకు అగ్ని పరీక్ష మొదలైంది. "కొందరు స్థానిక గూండాలు నిందితుడితో నాకు సంబంధముందని నానా మాటలు అనేవారు. ఓ రోజు నా భర్త తాగొచ్చి నిజంగా సంబంధముందా అని ప్రశ్నించాడు. నాకు కన్నీళ్లు ఆగలేదు" అని అన్నారు షబ్నం. అప్పటి నుంచి తను బయటకే వెళ్లడం మానేసింది. "తర్వాత నా భర్త మెల్లిగా నాతో మాట్లాడటం ఆపేశాడు. ఎప్పుడూ నాపై కోపంగా ఉండేవాడు. పిల్లలతోనూ మాట్లాడేవాడు కాదు. నా పుట్టింటికి పంపమని ఓ రోజు అడిగాను. అంతా సద్దుమణిగాక వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఏడాదైంది. ఇంకా రాలేదు. పిల్లలు భర్తతోనే ఉంటున్నారు. అమ్మను తీసుకొద్దామని వాళ్లు ఎన్నిసార్లు అడిగినా వినలేదు" అని చెప్పింది. "అత్యాచార బాధితులకు సమాజంలో స్థానం లేదు. సమాజం వాళ్లను బతకనివ్వదు. నేను చేసిన తప్పేంటి" అని ప్రశ్నిస్తున్నారు.



'అత్యాచార బాధితులకు సమాజంలో స్థానమే లేదు. నేను చేసిన తప్పేంటి? దాడి చేసింది నాపై, రేప్ చేసింది నన్ను, కానీ సమాజం నన్ను మళ్లీ కోలుకోకుండా కాకుల్లా పొడుస్తోంది. గాయాన్ని పెద్దది చేస్తోంది' ఇదీ సగటు బాధితురాలి ఆవేదన. ఘజియాబాద్, ముంబై, థాణే, రిషికేశ్ ప్రాంతమేదైనా సమాజం వాళ్లను ఇంకా కుంగదీస్తోంది. కుక్కల్లా పీక్కు తింటోంది. కనికరం లేకుండా ఏడిపిస్తోంది.

రేపిస్టులకన్నా పోలీసులు చేసేదే ఎక్కువ

2017లో ఓ మహిళను 8 మంది గ్యాంగ్‌రేప్ చేశారు. 14 ఏళ్ల తన కొడుకునూ లైంగికంగా వేధించారు. 2017 నవంబర్ 14న వాళ్లపై కేసు నమోదైంది. వారిలో ఆరుగురు ఇంకా పరారీలో ఉన్నారు. ప్రధాన నిందితుడికి రాజకీయబలం ఉండటంతో కేసు వాపస్ తీసుకోమని పోలీసులు తనను వేధించారని, కొట్టారని ఆ మహిళ చెప్పింది. స్థానికులు, పక్కవారి బాధ పడలేక వాళ్లున్న ప్రాంతాన్ని వదిలి మరో ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. హర్యానా మహిళా సంక్షేమ శాఖ తనకు కౌన్సెలింగ్ ఇవ్వనేలేదు. కొన్నికొన్నిసార్లు పోలీసులే బాధితుల పేర్లు బయటకు చెబుతుంటారు. 14 ఏళ్ల బాలికను ఐదుగురు యువకులు 2018లో రేప్ చేశారు. ఆ తర్వాత తన అక్క, తల్లిదండ్రులు ఉద్యోగాలు కోల్పోయారు. ఇంటియజమాని ఇల్లు ఖాళీ చేయమన్నాడు. ఇంతకుమించి పోలీసులు స్థానికులకు ఆ బాలికెవరో చెప్పారు. దీంతో ఇప్పటికీ ప్రతిరోజు ఆ బాలికను యువకులు, స్థానికులు ఏడిపిస్తూనే ఉన్నారు. విరాళంపైనా ఆ కుటుంబం బతుకు వెళ్లదీస్తోంది. "నేరానికన్నా ఎక్కువగా పోలీసులు మా జీవితాన్ని నరకప్రాయం చేశారు. దర్యాప్తు కోసం వాళ్లు మా ఇంటికొచ్చేవారు. నా చెల్లెలు కులం సర్టిఫికెట్ కోసం పశ్చిమబెంగాల్‌లోని మా సొంతూరికి వెళ్లారు. అలా చేయొద్దని హైకోర్టు చెప్పినా వినలేదు" అని బాధితురాలి అక్క చెప్పింది.

బాధితుల్నే ప్రశ్నిస్తారంటున్న నైనా

మరో అమ్మాయి నైనా దక్షిణ ముంబైలో ఉంటోంది. ఎప్పుడూ ఇల్లు దాటి బయటకెళ్లదు. ఇంటి పనులు చేస్తూ తల్లిని చూసుకుంటూ ఉంటుంది. రియాల్టీ మార్కెటింగ్‌లో ఉద్యోగాన్ని రెండేళ్ల కిందట వదిలేశాక ఇంకే సంస్థ కూడా తనకు ఉద్యోగం ఇవ్వలేదు. ఎందుకంటే తను పని చేస్తున్న కంపెనీ యజమాని తనకు మత్తుమందిచ్చి రేప్ చేశాడని, దాన్ని వీడియో కూడా తీశాడని పోలీసు కేసు పెట్టింది. అయితే దర్యాప్తు మాత్రం మొదలవలేదు. ఎందుకంటే విచారణ చేయాల్సిన పుణేకు తను వెళ్లలేదు. ఇక కొందరు సహోద్యోగులు నైనాను సూటిపోటిమాటలు అనసాగారు. "అత్యాచార బాధితులనే ఎప్పుడూ ప్రశ్నిస్తారు. తప్పు చేసిన వాడిని కాదు" అని అంటోంది నైనా. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో అడుగుపెట్టి ఫిర్యాదు చేయడం ఆలస్యం పోలీసులు ఆమెకు సహకరించరని అత్యాచార బాధితుల తరఫున పోరాడే సామాజికవేత్త మోహన్ కృష్ణన్ అంటున్నారు. "రేప్ ఫిర్యాదులు నమోదు చేసేందుకు మహిళా పోలీసులు చాలా తక్కువగా కనబడుతుంటారు. మగ పోలీసులకు ఫిర్యాదు చేసేటప్పుడు బాధితులు ఇబ్బంది పడుతుంటారు. బాధితురాలు ఫిర్యాదు చేసేటప్పుడు సరైన పదాలు వాడటం అవసరం. కానీ పోలీసులు దాన్ని సరిగా పట్టించుకోరు' అంటున్నారు.

బాధితుల తరఫున పోరాడుతున్న పూజ

యూపీ టౌన్‌లో ఓ అమ్మాయి దివ్యను (అప్పుడు 18 ఏళ్లు) 2014లో ఐదుగురు గ్యాంగ్ రేప్ చేశారు. అప్పటి నుంచి తను చదువు కొనసాగలేదు. "నా క్లాస్‌మేట్స్ అందరికీ తెలుసు నన్ను రేప్ చేశారని" అని ఆ అమ్మాయి చెప్పింది. దివ్య కేసును ఫ్రీగా వాదిస్తున్న సంజయ్ శర్మ మాట్లాడుతూ.. "అత్యాచార బాధితులందరిదీ ఇలాంటి సమస్యే. చదువు మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి. కొందరు వాళ్ల సొంతూళ్లను వదిలేస్తారు. కొందరు అమ్మాయిలు ధైర్యంగా నిందలను తిప్పికొట్టినా, చాలా మందికి ఆ ఘటన నుంచి బయటకు రావడానికి చాలా టైం పడుతుంది" అని అన్నారు. కానీ ఆ సమస్యలను అధిగమించే వాళ్లూ ఉంటారు. అందుకు సరైన ఉదాహరణే పూజ. 10 ఏళ్ల కిందట తనను రిషికేశ్‌లో ఓ దుండగుడు రేప్ చేశాడు. "ఘటన జరిగిన తర్వాత రోజు అక్క, బావకు చెప్పా. అదే రోజు మా అక్క బయటకు వెళ్లినపుడు బావ నాపై అత్యాచారం చేశాడు. నేను ఇప్పటికే గౌరవాన్ని కోల్పోయానని, కాబట్టి ఇదేమంత పెద్ద విషయం కాదని తను అన్నాడు. ఇది తెలిశాక మా అక్క నన్ను బయటకు గెంటేసింది" అని చెప్పారు. "ఆ తర్వాత దర్యాప్తు అధికారి తనపై అత్యాచారం చేశాడు. విచారణను వేగం చేస్తానని తను అన్నాడు, ఇప్పుడెవరు నన్ను పెళ్లి చేసుకోరన్నాడు. తర్వాత కొంతమంది కానిస్టేబుళ్లూ నాపై అత్యాచారం చేశారు. ఇలా ఏడాదిన్నర పాటు జరిగింది. కానీ కేసు మాత్రం ముందుకు సాగలేదు" అంది. దీంతో పూజ రిషికేశ్ నుంచి బయటపడి ఎన్జీవో సమాధాన్‌ను ఆశ్రయించింది. ఆ తర్వాత పూజా ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. ఇప్పుడు తనో లాయర్. తానెక్కువగా అత్యాచార కేసులనే తీసుకుంటోంది.



అమ్మ చాటు పిల్లలు

తల్లి చాటు బిడ్డలని ఊరికే అనలేదేమో. మనిషైనా, పశువులైనా, పక్షులైనా.. తల్లిదండ్రుల ప్రేమకు మించింది ఉండదేమో. ఈ ఫొటో చూస్తే అదే అనిపించకమానదు. గజగజ వణికిస్తున్న చలి నుంచి తప్పించుకోవడానికి తమ తల్లి రెక్కలనే దుప్పట్లుగా చేసుకున్నాయి రెండు బుడ్డ పిట్టలు. ఆ తల్లి పక్షి తాను చలికి వణికినా పిల్ల పక్షులకు మాత్రం వెచ్చదనాన్నిచ్చి ప్రేమను చాటుకుంది. అమెరికా న్యూజెర్సీలో మెలిస్సా గ్రూ అనే మహిళ తీసిందీ ఫొటో. లీస్ట్ టెర్న్ అనే పక్షులివి.

అవాక్కయ్యారు

చైనాలోని జియాంగ్సు నగరం.. రాత్రి సమయం.. ఓ రోడ్డుపై పేద్ద అడ్వర్టయిజింగ్ స్క్రీన్.. ఓ వీడియో ప్లే అవుతోంది.. ఆ దారి వెంట పోతున్న జనాలు చూసి అవాక్కయ్యారు. కొందరు ఆగి ఆసక్తిగా ఫొటోలు, వీడియోలు కూడా తీసుకున్నారు. ఆశ్చర్యపోయేంత సూపర్ అడ్వర్టైజ్‌మెంట్ ఏమో అనుకుంటున్నారా? కాదండీ బాబు.. పోర్న్ వీడియో ప్లే అవుతోందక్కడ. రాత్రిపూట అడ్వర్టయిజింగ్ స్క్రీన్ ఆపేసి ఉంటారనుకుని దాన్ని కనెక్ట్ చేసిన సిస్టమ్‌లో పోర్న్ వీడియోలను బ్రౌజ్ చేశాడు ఓ ఉద్యోగి. కానీ ఆ రోజు స్క్రీన్ కనెక్షన్ తీసేయలేదు. ఇంకేముంది ఈయనగారు చూసేదంతా అక్కడ అలానే ప్లే అయింది. గంటన్నర పాటు వీడియోలు ప్లే అవుతూనే ఉన్నాయి. మరో ఉద్యోగి వెంటనే విషయాన్ని అతడికి చెప్పడంతో కంగుతిని దాన్ని ఆపేశాడు. గత ఏడాది ఇండియాలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ఢిల్లీలోని మెట్రో స్టేషన్‌లో ఓ బిగ్ స్క్రీన్‌పై పోర్న్ వీడియో ప్లే అయింది.



మహిళా సమేత ప్రయోగం

- గగన్‌యాన్‌లో అవకాశం
- మొత్తం వెళ్లేది ముగ్గురే.. ఇస్రో సైంటిస్టులెవరూ లేరు
- ఎంపిక ప్రక్రియలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్: ఇస్రో చైర్మన్

ఎన్నెన్నో మైలు రాళ్లను అందుకున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. చరిత్రాత్మక ఘట్టమైన మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. 2021 ప్రథమార్ధంలో ఆ మహత్తర కార్యానికి ముహూర్తం పెట్టుకుంది. మరో అదనపు హంగునూ ఆ ప్రయోగానికి అద్దబోతోంది. మహిళా సమేతంగా ప్రయోగం చేయాలని నిర్ణయించింది. మానవ సహిత అంతరిక్ష ప్రయోగంలో మహిళా ఆస్ట్రోనాట్లనూ భాగం చేస్తామని, అంతరిక్షానికి పంపుతామని ఇస్రో చైర్మన్ కే శివన్ తెలిపారు. ఎంపిక ప్రక్రియ ఎప్పుడుంటుందనేది మాత్రం ఆయన చెప్పలేదు. "స్పేస్ ఫ్లైట్‌లో మహిళలూ వెళతారు. ఆ విషయంపై మేం ఆలోచిస్తున్నాం. మానవ సహిత ప్రయోగాన్ని ప్రకటించే సందర్భంలో ప్రత్యేకించి మహిళల విషయాన్ని కూడా ప్రస్తావించారు. కాబట్టి, తొలి మానవ సహిత ప్రయోగంలో మహిళలు భాగమైతే అంతకుమించిన ఆనందం ఏముంటుంది? ఈ విషయాలన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎంపిక ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు" అని అన్నారు. ఎంపిక ప్రక్రియకు ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. అంతరిక్షానికి వెళ్లే వాళ్లను భారత వాయుసేన అందిస్తుందని, కాబట్టి అభ్యర్థుల ఎంపిక మొత్తంలో ఎయిర్‌ఫోర్స్ భాగస్వామిగా ఉంటుందని చెప్పారు. తొలి ప్రయోగమే కాబట్టి కొద్ది మందినే అంతరిక్షానికి పంపుతున్నామన్నారు. ముగ్గురిని మాత్రమే అంతరిక్షానికి పంపుతామన్నారు. ప్రయోగం తుది దశకు వచ్చినప్పుడు




ఎన్ని రోజులు అంతరిక్షంలో గడపాలో నిర్ణయిస్తామన్నారు. తొలుత వారం అనుకున్నాం గానీ, అది రెండు, మూడు రోజులకు కుదించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తు పెట్టుకున్న అభ్యర్థుల నుంచి పది మందిని ఎంపిక చేస్తామని, వాళ్లందరికీ కఠిన శిక్షణ ఇస్తామని చెప్పారు. తర్వాతే ఎవరెవరు వెళ్లేది నిర్ణయిస్తామన్నారు. రష్యా, ఫ్రెంచి అంతరిక్ష సంస్థలు శిక్షణా సాయం చేస్తామంటూ ముందుకొస్తున్నాయన్నారు. ఇస్రో సైంటిస్టులెవరూ అంతరిక్షానికి వెళ్లట్లేదని ఆయన స్పష్టం చేశారు. అంతా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందినోళ్లేనని చెప్పారు. గగన్‌యాన్ మిషన్‌కు సన్నాహకాన్ని మరో పది రోజుల్లో చేపడతామన్నారు.


యవ్వనం వికసిస్తుంది

- ఇండియా మొక్కలో దాగిన రహస్యం

యవ్వనాన్ని పొడిగించేందుకు ఇప్పటిదాకా ఎన్నెన్నో ప్రయోగాలు జరిగాయి. కొందరు సైంటిస్టులు వాటిని ఆహ్వానించారు. మరికొందరు కొట్టిపారేశారు. విటమిన్ ఏ గురించి అందరికీ తెలిసే ఉంటుంది కదా. ఇప్పటిదాకా మార్కెట్‌లో అందుబాటులో ఉన్న యవ్వన ప్రొడక్ట్ అదే. అయితే దాని వల్ల కొన్ని సైడ్ ఎఫెక్టులున్నాయి. వాటిని వాడినప్పుడు చర్మం ఎర్రబడుతుందట. అందుకే విటమిన్ ఏకి మారురూపాలైన రెటినోల్, రెటినాల్, రెటినిల్‌లను కొందరు సూచిస్తారు. గర్భిణులు మాత్రం ఈ విటమిన్ ఏని డైరెక్ట్‌గా తీసుకోకూడదన్నదే ప్రధాన అవలక్షణం. ఎక్కువగా తీసుకుంటే పుట్టే పిల్లలు లోపాలతో పుడతారు. వాటికి ప్రత్యామ్నాయమా అన్నట్టు యవ్వన రహస్యం మన ఇండియా మొక్కలోనే దాగి ఉందట. బాబ్చి అనే మొక్కలో ఉండే 'బాకుషియోల్' అనే రసాయనం చర్మాన్ని యవ్వనంగా ఉంచడమే కాకుండా, వయసు మీద పడకుండా చూస్తుందట. ఇప్పటికే ఆయుర్వేదంలో దీన్ని



బాగా వాడుతున్నారు. ఇప్పుడు అందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను సైంటిస్టులు పరిశోధనాత్మకంగా నిరూపించారు. 44 మంది వలంటీర్లపై ప్రయోగాలు చేశారు. కొందరిని బాకుషియోల్ 0.5 క్రీమ్‌ను, మరికొందరిని రెటినోల్ 0.5 క్రీమ్‌ను 12 వారాల పాటు వాడాల్సిందిగా సూచించారు. ఫలితాలను చర్మనిపుణులు అంచనా వేశారు. ఆ రెండూ వాడిన వాళ్లలో మంచి ఫలితాలే కనిపించినప్పటికీ, రెటినోల్ వాడిన వాళ్లలో చర్మం పగిలిందని గుర్తించారు. బాకుషియోల్ వాడినోళ్లలో సైడ్ ఎఫెక్ట్‌లు తగ్గినట్టు కనుగొన్నారు. దీనిపై పెద్ద మొత్తంలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ డెర్మటాలజిస్ట్ అంజలి మహతో అన్నారు. ఈ స్టడీ బ్రిటిష్ జర్నల్ ఆఫ్ డెర్మటాలజీలో ప్రచురితమైంది.



ఆధ్యాత్మికం.. ఆరోగ్యం

కుంభమేళాతో రోగ నిరోధక వ్యవస్థ మెరుగు? ○ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో స్టడీ

కుంభమేళా.. గంగ, యమున, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం, ఆ త్రివేణి సంగమంలో సాధు పుంగవులు, భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారు. కోట్లాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆ స్నానం కేవలం పుణ్యం ఇవ్వడం కాదు.. నిండు ఆరోగ్యాన్నిస్తుందంటున్నారు కొందరు సైంటిస్టులు. రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెబుతున్నారు. 45 రోజుల పాటు కల్పవాసుల (త్రివేణి సంగమ తీరంలో గుడారాలు వేసుకుని వేదాధ్యయనం చేసే సాధు పండితులు, భక్తులను కల్పవాసులంటారు. ఆ గుడారాలను కల్పవాసాలు అని పిలుస్తారు) ఆరోగ్యాన్ని అధ్యయనం చేసేందుకు సైంటిస్టులు కదులుతున్నారు. కల్పవాసాల వల్ల మనిషి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందో నిశితంగా అధ్యయనం చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ నేతృత్వంలో ఈ అధ్యయనం చేస్తున్నారు. జనవరి 15 నుంచి కుంభమేళా ప్రారంభం కాబోతోంది.

శాస్త్రీయ ఆధారాలతో...

పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ సెల్ సైన్స్, బనారస్ హిందూ యూనివర్సిటీ, నైనిటాల్‌లోని ఆర్యభట్ట రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్‌కు చెందిన సైంటిస్టులు ఈ అధ్యయనం కోసం రంగంలోకి దిగుతున్నారు. అధ్యయనంలో భాగంగా పర్యావరణంలోని మార్పులు, దాని వల్ల కల్పవాసులపై పడే ప్రభావంపై శాస్త్రీయ ఆధారాలను సేకరించనున్నారు. నది నీళ్లు, మట్టి తీసుకుని భౌతిక, రసాయనిక, సూక్ష్మజీవ లక్షణాలను అంచనా వేయనున్నారు. 1,080 మంది కల్పవాసులకు మెడికల్ చెకప్‌లతో పాటు, రక్త పరీక్షలు చేసి వాళ్ల ఆరోగ్యాన్ని పరిశీలిస్తారు. రోగ నిరోధక వ్యవస్థకు కీలకమైన 14 ఇండికేటర్లను విశ్లేషిస్తారు. ఒత్తిడి, సంతోషానికి కారణమయ్యే హార్మోన్లు కోర్టిసోల్, డోపమైన్, సెరటోనిన్‌లను పరీక్షిస్తారు. వాటితోపాటు కుంభమేళా భౌగోళిక ప్రాధాన్యంపైనా అధ్యయనం చేస్తారు.

నదిలో పుణ్య స్నానం ఆచరించడం వల్ల యాంటీజెన్స్ (బ్యాక్టీరియా)ను సహజంగా తీసుకుంటూ ఉంటారు.

కోట్లాది మంది స్నానం చేయడం వల్ల బ్యాక్టీరియా మార్పిడి జరుగుతుంది.

అదే కల్పవాసుల రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

కొత్త యాంటీజెన్లు ఎంటరవడంతోటే మన శరీర రక్షణ వ్యవస్థ (రోగనిరోధక) ఫైటింగ్‌కు రెడీ అవుతుంది. వాటిని ఎదుర్కొనేందుకు కొత్తగా యాంటీ బాడీలను పుట్టిస్తుంది.

అందులోని సైన్స్‌ను పట్టాలి

"ప్రస్తుతం యాంటీ బయాటిక్‌లకూ లొంగని రోగాలు ఇప్పుడు మనిషిపై దాడి చేస్తున్నాయి. ప్రాణాంతకమైన సూపర్‌బగ్స్ మానవాళి మనుగడకు సవాల్ విసురుతున్నాయి. ఇలాంటి పెను సమస్యలను ఎదుర్కొనేందుకు కుంభమేళా ఓ రకంగా సాయం చేస్తోంది. దాని వల్ల ఎలాంటి లాభాలున్నాయో చెప్పేందుకే ఈ ప్రయోగం చేస్తున్నాం" అని అధ్యయనానికి నేతృత్వం వహించనున్న వాచస్పతి త్రిపాఠి తెలిపారు. అన్నింటికీ ప్రాంతం, కాలం, దిక్కు, కర్తే సమాధానమని వేద పురాణాలు చెబుతున్నాయని, పర్యావరణహిత వ్యవస్థకు కుంభమేళా ఒక రకంగా కారణమని, కాబట్టి అధ్యయనం చేస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు. కుంభమేళాలో పుణ్యస్నానం చేస్తే మనిషి అజరామరుడు (మరణం లేనివాడు) అవుతాడని ప్రతీతి. ఇక్కడ అజరామరుడు అంటే రోగాలు లేని వ్యక్తిగా అర్థం చేసుకోవాలని త్రిపాఠి అంటున్నారు. కాబట్టి అందులో ఉన్న సైన్స్‌పైనే తాను దృష్టి పెట్టానని ఆయన తెలిపారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.